- గులాబీ పార్టీకే 32 జిల్లా పరిషత్‌లు

సాక్షి, హైదరాబాద్: పరిషత్ రాజకీయం మరింత రసవత్తరమైంది. ఇన్నాళ్లూ ఫలితాల కోసం ఎదురు చూసిన అభ్యర్థులంతా ఇప్పుడు క్యాంపు రాజకీయాల్లో బిజీ అయ్యారు. అధ్యక్ష ఎన్నిక గడువు ముంచుకొస్తుండడంతో ఆశావహులంతా ప్రాదేశిక సభ్యులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల రేసులో ఉన్న అభ్యర్థులు సంప్రదింపుల్లో తలమునకలయ్యారు. తమకు మద్దతివ్వాలని ప్రాధేయపడుతున్నారు. కీలక సభ్యులతో క్యాంపు రాజకీయాలు సైతం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లోని 538 మండలాల్లో జెడ్పీటీసీ ఎన్నికలు, 534 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. ఈనెల 7వ తేదీన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా ఈనెల 8న జిల్లా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోఆప్టెడ్ సభ్యుల ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

గులాబీదే ఆధిక్యమైనా...

జిల్లా పరిషత్ ఎన్నికల్లో గులాబీ పార్టీ సత్తా చాటింది. మెజార్టీ సభ్యులు అధికారపార్టీకి చెందిన వారే గెలుపొందడంతో 32 జిల్లాల్లో జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలను ఆ పార్టీ కైవసం చేసుకోనుంది. పార్టీ ఆదేశాను సారం ఖరారైన అభ్యర్థులకే టీఆర్ఎస్ జెడ్పీటీసీ సభ్యులు మద్దతు పలికే అవకాశం ఉండడంతో జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో పెద్దగా ఇబ్బంది లేదు. అయినప్పటికీ సభ్యులంతా అందుబాటులో ఉండేలా ఆ పార్టీ ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా మండల పరిషత్ స్థానాల్లోనూ అధికార పార్టీనే మెజార్టీ సీట్లు దక్కించుకుంది. కొన్ని మండలాల్లో మాత్రం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బలాన్ని ప్రదర్శించింది. దీంతో హస్తం పార్టీ సభ్యులు ఎక్కువగా ఉన్న మండలాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పీఠాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ సైతం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. 534 మండలాల్లో 437 మండల పరిషత్ పీఠాలు టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయి. మరో 67 మండలాల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. మిగతా 30 స్థానాల్లో ఏ పార్టీకీ మెజార్టీ రాకపోవడంతో అక్కడ హంగ్ వాతావరణం కనిపిస్తోంది. ఈ మండలాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రెబెల్స్, స్వతంత్రులు, టీడీపీ, సీపీఐ, సీపీఎం, బీజేపీ పార్టీలకు చెందిన సభ్యుల మద్దతు కీలకం కానుంది. దీంతో వీరిని బుట్టలో వేసుకునేందుకు అన్ని పార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

రాజధాని సమీపంలో క్యాంపులు

పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. ఈనెల 7, 8వ తేదీల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నిక ఉండడంతో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. మండలాల్లో స్పష్టమైన ఆధిక్యం ఉన్న చోట్ల కూడా క్యాంపులకు ఆస్కారమవుతోంది. సభ్యులు అందుబాటులో ఉండేలా, ఎన్నిక సమయానికి నేరుగా అక్కడికి చేరుకునేలా అభ్యర్థులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా నగరానికి సమీపంలో ఉన్న రిసార్టులు, హోటళ్లలో క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఎన్నిక తేదీకి రెండ్రోజులే గడువు ఉండడంతో ఆర్థిక భారం పెద్దగా ఉండదని భావించిన అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ తరహా క్యాంపులకు తెరలేపాయి. మరోవైపు హంగ్ ఉన్న మండలాల్లో రాజకీయం మలుపులు తిరుగుతోంది. ఈ మండలాల్లో కూడా అధికారపార్టీ తన బలాన్ని ప్రదర్శించేందుకు కృషి చేస్తోంది. సంబంధిత ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కీలక అభ్యర్థులతో చర్చలు జరుపుతూ వారిని బుట్టలో వేసే ప్రయత్నం చేస్తున్నారు. స్వతంత్ర, ఇతర పార్టీకి చెందిన వారిని తమవైపునకు తిప్పుకునేందుకు భారీ మొత్తంలో తాయిలాలు ప్రకటిస్తున్నారు. రిజర్వ్ స్థానాల్లో అయితే ఏకంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవినే కట్టబెడతామని ప్రలోభ పెడుతుండడంతో ఆయా మండలాల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. చర్చలకు పిలుపునిచ్చి ఏకంగా క్యాంపులకు తరలించేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మొత్తంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ముగిసే దాకా ఈ క్యాంపు రాజకీయాలు జోరుగా సాగనున్నాయి.

బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మొక్కను నాటిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచానికి పెను సవాలుగా మారిన కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన ఢిల్లీలో బీఎస్ఎఫ్ క్యాంప్, ఏపీ, తెలంగాణ భవన్ ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, కాలుష్య నియంత్రణకు పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకాన్ని తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణ సమతుల్యతను పాటించాలని, అడవుల సంరక్షణకు పెద్దపీట వేస్తూ పర్యావరణ పరిరక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పెను ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం బీజేపీ సీనియర్ నేతలు ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, షహనవాజ్ హుస్సేన్‌లను వారి నివాసంలో కిషన్ రెడ్డి కలుసుకుని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజకీయశక్తిగా ఎదుగుతున్నందుకే..

బీజేపీ కార్యకర్త హత్యపై ఎంపీ బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ ఎదుగుతున్న క్రమంలో భయభ్రాంతులకు గురైన సీఎం కేసీఆర్ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. నారాయణపేట జిల్లా దేవరకద్ర గ్రామంలో బీజేపీ కార్యకర్త ముష్టి ప్రేమ్ కుమార్ హత్యలో టీఆర్ఎస్ అగ్రనాయకుల ప్రమేయముందన్నారు. ప్రేమ్ కుమార్‌తో పాటు మరో ముగ్గురిని కలిపి సామూహికంగా హత్య చేసేందుకు టీఆర్ఎస్ నాయకత్వం కుట్రపన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, పినరయి విజయన్‌ల మాదిరి రాష్ట్రంలో టీఆర్ఎస్ నాయకత్వం రాజకీయాలకు తెరలేపిందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో దాడులు, హత్యా రాజకీయాలు మితి మీరి పోయే ప్రమాదముందని, వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు బీజేపీ నాయకత్వం సిద్ధంగా ఉందని సంజయ్ హెచ్చరించారు. ప్రేమ్ కుమార్ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి హంతకులను, కుట్రకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యకర్తలు, నాయకులు మనోధైర్యంతో ముందుకు సాగి టీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు సాగించాలని సంజయ్ పిలుపునిచ్చారు.

ప్రాంతీయ భాషల్లో పోటీ పరీక్షలు నిర్వహించండి: రాపోలు

సాక్షి, న్యూఢిల్లీ: యూపీఎస్సీ, రైల్వే, బ్యాంకింగ్ ఇతర పోటీ పరీక్షలు కేవలం హిందీ, ఇంగ్లిష్‌లోనే కాకుండా ప్రాంతీయ భాషల్లో కూడా నిర్వహించడాన్ని పరిశీలించాలని బీజేపీ నేత రాపోలు ఆనంద భాస్కర్ పేర్కొన్నారు. తద్వారా ప్రాంతీయ రాష్ట్రాల్లో యువతరం మన్నలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు హిందీలోనే ఉండటం వల్ల ప్రాంతీయ రాష్ట్రాల్లో వాటికి తగిన ప్రాచుర్యం దక్కడం లేదన్నారు. పథకాల పేర్లను ప్రాంతీయ భాషల్లో ప్రవేశపెడితే మరింత ఆదరణ దక్కుతుందని పేర్కొన్నారు.

గతంలో కన్నా మెరుగే

పరిషత్ ఫలితాలపై బీజేపీ అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధించిందని బీజేపీ అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఆర్ఎస్ చాలా డబ్బు వెచ్చించడంతోపాటు వంద మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను రంగంలోకి దింపినా, కార్యకర్తల బలంతో బీజేపీ పలు సీట్లను గెలుచుకుందన్నారు. స్థానిక సంస్థల్లో అధికారంలో ఉన్న పార్టీలకే సహజంగా ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. టీఆర్ఎస్ నేతలు హత్యా రాజకీయాలు చేస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ అభ్యర్థి గెలవడాన్ని తట్టుకోలేక ప్రేమ్‌కుమార్ అనే తమ కార్యకర్తను టీఆర్ఎస్ నాయకులు హత్య చేశారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా కేసు దర్యాప్తు చేయాలన్నారు.

ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏయే ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఉద్యోగ ఖాళీలున్నాయి, వాటిలో ఇప్పటివరకు ఎన్ని భర్తీ చేశామన్న దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం కేసీఆర్‌కు సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1.07 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు కేసీఆర్ స్వయంగా ప్రకటించారని, అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచిన నేపథ్యంలో రాష్ట్రం ఏర్పడే నాటికి ఖాళీలు, ఉద్యోగుల పదవీ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీల సంఖ్యను ప్రజలకు తెలియజేయాలని సీఎంకు రాసిన లేఖలో కోరారు.

టీఆర్ఎస్‌లోకి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి?

తాండూరు: వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పైలట్ రోహిత్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి కబురు రావడంతో 4 రోజుల క్రితం రోహిత్‌రెడ్డి ఆయనను కలసినట్లు తెలిసింది. అయితే ప్రాదేశిక ఎన్నికల అనంతరం పార్టీలో చేరుతానని రోహిత్‌రెడ్డి కేటీఆర్‌కు చెప్పినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. అన్నీ కుదిరితే త్వరలోనే రోహిత్ కాంగ్రెస్‌ను వీడి సొంత గూటికి చేరనున్నారు. ఏడాది క్రితం గులాబీ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఆయన అనంతరం కాంగ్రెస్‌లో చేరి తాండూరు ఎమ్మెల్యేగా గెలిచారు.

నేడు అధికారులకు విప్‌ల నియామక లేఖలు

- రేపటి ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఎంపీపీ స్థానాల్లో మహిళల హవా

సాక్షి, హైదరాబాద్: శుక్రవారం మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ) అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఏర్పాట్లు పూర్తిచేసింది. 7న తొలుత కోఆప్షన్ సభ్యుల నామినేషన్ల స్వీకారం, కోఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, ఆ తర్వాత ఎంపీపీ పదవులకు ఎన్నికలుంటాయి. ఒక్కో ఎంపీపీ పరిధిలో ఒక్కో కోఆప్టెడ్ సభ్యుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నిక పూర్తికాకపోతే ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక నిర్వహణకు అవకాశం లేదు. ఎంపీపీ పదవులకు ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈసీ వెబ్‌సైట్‌లో ఆయా పదవులకు సంబంధించి రిజర్వేషన్లను పొందుపరిచింది. ఎన్నికలు జరగనున్న మొత్తం 538 ఎంపీపీల్లో మహిళలకు 269 స్థానాలు దక్కుతాయి.

నేడు విప్‌ల అందజేత...

శుక్రవారం నిర్వహించే ప్రత్యేక సమావేశానికి ఒకరోజు ముందు (గురువారం) ఉదయం 11 గంటలలోపు రాజకీయ పార్టీలు విప్‌ల నియామకానికి సంబంధించిన లేఖను, ఫామ్-ఎను ప్రిసైడింగ్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ లేఖతోపాటు విప్ జారీచేసే వ్యక్తి గుర్తింపు కార్డుతోపాటు ఆధారిత లేఖ, రాష్ట్ర అధ్యక్షుడి నియామకం పత్రాన్ని గురువారం అధికారులకు అందజేయాలి. ఆ తర్వాత పార్టీ అధ్యక్షుడి నుంచి విప్ అధికారం పొందిన వ్యక్తి ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో చేయి ఎత్తే పద్ధతిలో ఎవరికి ఓటేయాలన్న దానిపై సభ్యులకు విప్ జారీచేస్తారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, జనతా దళ్, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీలకు విప్ జారీచేసే అవకాశముంది. అయితే గెలుచుకునే ఎంపీపీ స్థానాలను బట్టి ప్రధానంగా టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, మరో ఒకటి, రెండు పార్టీలు విప్‌ను జారీచేయవచ్చునని తెలుస్తోంది. షెడ్యూల్ ఏరియాలోని వరంగల్, ఖమ్మం జెడ్పీల పరిధిలోని బయ్యారం, గార్ల, గంగారం మండలాలను షెడ్యూల్ మండలాలుగా గుర్తించారు. గతంలో షెడ్యూల్ మండలాలు 24 ఉండగా, సవరించిన జాబితా ప్రకారం 33కు చేరుకున్నాయి. దీంతో ఎస్సీ, బీసీలకు స్థానాలు తగ్గాయి. రిజర్వేషన్ల కోటాను ఖరారు చేస్తూ ఇదే పద్ధతిలో కోటా కేటాయించాలని ఆదేశాలిచ్చారు.

మహిళల హవా...

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మహిళల జనాభా అధికంగా ఉండడంతో ఆ జిల్లాల్లో వారికి ఎక్కువ ఎంపీపీ స్థానాలు కేటాయించారు. జిల్లాల వారీగా నిజామాబాద్‌లో 51.75 శాతం, నిర్మల్‌లో 51.47, జగిత్యాలలో 51.10, కామారెడ్డిలో 50.77, మెదక్‌లో 50.67, ములుగులో 50.38, రాజన్న సిరిసిల్లలో 50.36, జయశంకర్ భూపాలపల్లిలో 50.28, సిద్దిపేటలో 50.22, భద్రాద్రి కొత్తగూడెంలో 50.09, వరంగల్ అర్బన్‌లో 50.09, కరీంనగర్‌లో 50.08, వికారాబాద్‌తో 50.01 శాతంగా మహిళలున్నట్లు ఎస్ఈసీ రికార్డులను బట్టి తెలుస్తోంది. అదే విధంగా 17 జిల్లాల్లో సగటున 49.96 శాతం నుంచి 49.22 శాతంలో, వనపర్తి, రంగారెడ్డి జిల్లాలో 48.88 శాతం మహిళలు ఉన్నట్టు రిజర్వేషన్ల జాబితాలో ప్రకటించారు.

పరిషత్ ఎన్నికల్లో 'కారు'కే పట్టం

- అధికారికంగా ఫలితాల వెల్లడి
- నామమాత్రం సీట్లకు పరిమితమైన లెఫ్ట్, టీడీపీ

	ఎంపీటీసీ	జెడ్పీటీసీ
టీఆర్ఎస్	3,548	449
కాంగ్రెస్	1,392	75
బీజేపీ	208	8

సాక్షి, హైదరాబాద్: జిల్లా, మండల ప్రజా పరిషత్ ఎన్నికలకు సంబంధించి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) అధికారికంగా తుది ఫలితాలను ప్రకటించింది. పరిషత్ ఎన్నికల్లో 3,548 ఎంపీటీసీ, 449 జెడ్పీటీసీ స్థానాలు గెలుచుకోవడం ద్వారా అధికార టీఆర్ఎస్ ఇతర పార్టీలపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కాంగ్రెస్ పార్టీ 1,392 ఎంపీటీసీ, 75 జెడ్పీటీసీ సీట్లను గెలుచుకుని రెండోస్థానానికి పరిమితమైంది. 549 ఎంపీటీసీ సభ్యులు, నలుగురు జెడ్పీటీసీ సభ్యులు స్వతంత్రులుగా ఎన్నికయ్యారు. బీజేపీ 208 ఎంపీటీసీ, 8 జెడ్పీటీసీ స్థానాలు గెలుచుకోగలిగింది. సీపీఐ 38, సీపీఎం 40, టీడీపీ 21, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన, ఎస్ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలకు 20 ఎంపీటీసీ స్థానాలు వచ్చాయి. గుర్తింపు పార్టీలకు 2 జెడ్పీటీసీ సీట్లు వచ్చాయి. బుధవారం ఈ మేరకు ఫలితాల ప్రకటన, రాజకీయపార్టీల వారీగా గెలుచుకున్న పరిషత్ స్థానాలకు చెందిన నివేదికను ఎస్ఈసీ విడుదల చేసింది.

ఒక్క జెడ్పీటీసీని దక్కించుకోని వామపక్షాలు

సీపీఐ, సీపీఎం టీడీపీలకు ఒక్క జెడ్పీటీసీ సీటు కూడా దక్కలేదు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఎస్ఈసీ వెబ్‌సైట్‌లో పరిషత్ ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ తాజావి ప్రకటిస్తూ వచ్చారు. అయితే మంగళవారం అర్ధరాత్రి దాటాక కూడా పూర్తి ఫలితాలపై రిటర్నింగ్ అధికారుల నుంచి నివేదికలు అందకపోవడంతో బుధవారం అధికారిక ప్రకటన వెలువరించారు. మొత్తం 534 మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ)ల పరిధిలోని 5,817 ఎంపీటీసీ స్థానాల్లో, 538 జెడ్పీటీసీ స్థానాల్లో ఎన్నికలకు ఎస్ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ స్థానాలకు గత నెల 6, 10, 14 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు ముగిశాక, మంగళవారం ఓట్లను లెక్కించింది. ఇదిలాఉంటే శుక్రవారం పరోక్ష పద్ధతుల్లో ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులను, శనివారం జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లను ఎన్నుకోనున్నారు. దీంతో రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ప్రస్తుతం జెడ్పీ,ఎంపీపీ పదవులకు ఎన్నికైన వారు పాత పాలకమండళ్ల పదవీకాలం ముగిశాక జూలై మొదటివారంలో అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించాల్సి ఉంది.

'కో-ఆప్టెడ్'కు ఇద్దరు పిల్లల నిబంధన

సాక్షి, హైదరాబాద్: మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ), జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీపీ)లలో కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎన్నికయ్యే వారికి ఇద్దరు పిల్లల నిబంధనను వర్తింపజేస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఉన్న నియమ, నిబంధనలన్నీ కో-ఆప్టెడ్ సభ్యులకు కూడా వర్తించనున్నాయి. శుక్రవారం ఎంపీపీలు, శనివారం జెడ్పీపీలలో కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగనుంది. 1995 మే 31 తర్వాత ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్న వారు కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎన్నికయ్యేందుకు అనర్హులు కానున్నారు. ఎంపీపీలలో ఒకరిని, జెడ్పీలలో ఇద్దరి చొప్పున కో-ఆప్టెడ్ సభ్యులుగా మైనారిటీ వర్గాలకు చెందిన వారిని ఎన్నుకోనున్న విషయం తెలిసిందే. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్ల (పార్సీలు)ను మతపరమైన మైనారిటీలుగా, మాతృభాష తెలుగు కాని భాషాపర మైనారిటీలను రెండో కేటగిరీగా పరిగణిస్తారు. ప్రత్యేక సమావేశం నిర్వహించే రోజు ఉదయం 9-10 గంటల మధ్య కో-ఆప్టెడ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఒక అభ్యర్థే పోటీపడితే వారినే ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఈ ఎన్నికకు సంబంధించిన ప్రత్యేక సమావేశానికి కూడా ఎన్నికైన సగం కంటే ఎక్కువ మంది సభ్యుల కోరం ఉంటేనే ఈ ఎన్నిక నిర్వహిస్తారు. కో-ఆప్టెడ్ సభ్యుడిగా పోటీచేసే వ్యక్తి స్థానిక ఓటరై ఉండటంతో పాటు 21 ఏళ్ల వయసు కంటే తక్కువ ఉండొద్దు. కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎన్నికయ్యాక ఎంపీపీ, జెడ్పీపీ ఎన్నికల కోసం నిర్వహించే ప్రత్యేక సమావేశానికి వారిని ఆహ్వానిస్తారు. అయితే వారికి ఓటు వేసే హక్కు ఉండదు. ఎంపీపీ, జెడ్పీపీ కో-ఆప్షన్ ఎన్నికల్లోనూ ఇద్దరు అభ్యర్థులకు సమానమైన ఓట్లు వచ్చిన పక్షంలో డ్రా ద్వారా నిర్ణయాన్ని ప్రకటిస్తారు. ఒకవేళ కో-ఆప్టెడ్ ఎన్నిక జరగకపోతే ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించే అవకాశం లేదు. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు రాజకీయ పార్టీల విప్‌లు వర్తించవని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఒకే ఒక్క 'గురుకులం'!

- బీసీ సొసైటీ పరిధిలో ఒకే ఒక్క గురుకుల డిగ్రీ కాలేజీ
- ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీల్లో 52 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు
- డిమాండ్ అధికంగా ఉన్నా కొత్తవి ఇవ్వని ప్రభుత్వం
- పరిమిత సంఖ్యలో సీట్లు ఉండటంతో భారీగా తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలో సీటు సాధించడం కత్తిమీద సామును తలపిస్తోంది. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం ఒకే ఒక్క కాలేజీ ఉంది. అది కూడా మహిళల బ్రాంచ్ కావడంతో సీటును ఆశిస్తున్న మహిళా విద్యార్థులు అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాల్సిందే. గజ్వేల్ సమీపంలోని వర్గల్ వద్ద బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ ఉంది. ఈ కాలేజీ పరిధిలో బీఎస్సీ, బీకామ్, బీఏ బ్రాంచ్‌లలో 9 రకాల కోర్సులు ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించేందుకు బీసీ గురుకుల సొసైటీ ఏప్రిల్ నెలలో అర్హత పరీక్ష నిర్వహించింది. ఇటీవల ఫలితాలను విడుదల చేసిన సొసైటీ.. తాజాగా అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేసింది. ఒకే ఒక్క కాలేజీ కావడం.. అత్యంత పరిమిత సంఖ్యలో సీట్లు ఉండటంతో మెజారిటీ విద్యార్థులకు సీట్లు దక్కలేదు.

ఆ రెండు సొసైటీల్లో..

రాష్ట్రవ్యాప్తంగా 53 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలున్నాయి. ఇందులో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో 30 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో 22 డిగ్రీ కాలేజీలుండగా.. ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో మాత్రం ఒకే ఒక్క కాలేజీ ఉంది. అదికూడా మహిళల బ్రాంచ్. ఇతర సొసైటీల్లో పెద్ద సంఖ్యలో కాలేజీలు ఉండటంతో సీట్ల సంఖ్య ఆశాజనకంగా ఉంది. ఇంజనీరింగ్ వద్దనుకుని డిగ్రీ కోర్సుల వైపు దృష్టి పెట్టిన వారికి ఈ కాలేజీల్లో సీట్లు వస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న ప్రతి ముగ్గురిలో ఒకరికి అడ్మిషన్ దొరుకుతుంది. జనాభా పరంగా తక్కువగా ఉండటం.. కాలేజీలు ఎక్కువగా ఉండటంతో ఎస్సీ, ఎస్టీలకు కొంత ఉపశమనం కలుగుతోంది. కానీ బీసీల్లో అబ్బాయిలకు రెసిడెన్షియల్ గురుకుల డిగ్రీ కాలేజీ లేకపోవడంతో వారంతా నివాస ప్రాంతానికి సమీపంలోని ప్రైవేటు కాలేజీల్లో చేరాల్సి వస్తోంది. మహిళలకు మాత్రమే ఒక కాలేజీ ఉండగా.. ఒక్కో కోర్సులో 40 సీట్లు మాత్రమే ఉండడంతో దరఖాస్తు చేసుకున్న 40 మందిలో ఒకరికి మాత్రమే అడ్మిషన్ దొరుకుతుంది. జనాభా పరంగా బీసీలు 50 శాతానికి పైగా ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల పరంగా వీరి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం ఒక కాలేజీ సరిపోదు. సంఖ్యాపరంగా మరిన్ని కాలేజీలు తెరవాల్సిన ఆవశ్యకత ఉంది.

మరిన్ని కాలేజీలు ఏర్పాటు చేయాలి..

రాష్ట్రం ఏర్పడక ముందు బీసీ గురుకుల పాఠశాలల సంఖ్య కేవలం 19 మాత్రమే ఉండేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం రెండేళ్ల క్రితం 119 గురుకులాలను ఒకేసారి తెరిచింది. క్షేత్ర స్థాయిలో ఉన్న డిమాండ్‌కు ఈ గురుకులాల్లో సీట్లు సరిపోకపోవడంతో తాజాగా 2019-20 విద్యా సంవత్సరం నుంచి మరో

ముగిసిన మూడో టెట్ వ్యాలిడిటీ

- మూడు టెట్ల వ్యాలిడిటీ ముగియడంతో అర్హత కోల్పోయిన లక్షల మంది
- వారంతా ఇప్పుడు టెట్ కోసం ఎదురుచూపులు
- రెండేళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో టెట్ నిర్వహించని విద్యా శాఖ
- ప్రతి 6 నెలలకోసారి టెట్ నిర్వహించాలన్న నిబంధన బేఖాతరు
- ప్రభుత్వ పరిశీలనలోనే ఫైలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థుల మూడో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వ్యాలిడిటీ కూడా ముగిసిపోయింది. దీంతో ఇప్పటికిప్పుడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వస్తే దాదాపు 2.5 లక్షల మంది అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అర్హత కూడా లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం ప్రతి 6 నెలలకోసారి టెట్ నిర్వహించాల్సి ఉన్నా.. రాష్ట్రంలో రెండేళ్లుగా ఆ ఊసే లేదు. టెట్ నిర్వహించేందుకు అనుమతి కోసం విద్యా శాఖ పంపిన ఫైలు ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చాక 6 టెట్‌లు నిర్వహించగా, ఇప్పటి వరకు మూడు టెట్‌ల వ్యాలిడిటీ ముగిసిపోయింది. 2011 జూన్ 1 మొదటి టెట్ నిర్వహించగా, 2012 జనవరి 8న రెండో టెట్, అదే ఏడాది జూన్ 1న మూడో టెట్ నిర్వహించారు. ప్రస్తుతం వాటి వ్యాలిడిటీ ముగిసిపోవడంతో అభ్యర్థులంతా టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లే కాదు.. ప్రైవేటు పాఠశాలల్లోనూ టీచర్లుగా పని చేయాలంటే టెట్‌లో అర్హత సాధించి ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో టెట్ నిర్వహించకపోవడంతో అనేక మంది టెట్ అర్హత లేకుండా టీచర్లుగా పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

2017 జూలై నుంచి లేని టెట్

రాష్ట్రంలో 2017 జూలై 23న చివరి టెట్ నిర్వహించారు. ఆ తర్వాత ఇప్పటివరకు టెట్ నిర్వహించలేదు. చివరగా నిర్వహించిన ఆ టెట్ పేపర్-1కు 98,848 మంది హాజరు కాగా, 56,708 మంది అర్హత సాధించారు. దాదాపు 40 వేల మంది ఫెయిల్ అయ్యారు. ఇక పేపర్-2 పరీక్ష 2,30,932 మంది హాజరు కాగా 45,045 మంది అర్హత సాధించారు. అంటే 1.90 లక్షల మంది ఫెయిల్ అయ్యారు. అయితే వారిలో అంతకుముందు టెట్‌లలో అర్హత సాధించిన వారు కొంత మంది ఉన్నా దాదాపు 2 లక్షల మంది టెట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు నిర్వహించిన ఆరు టెట్‌లలో దాదాపు 6 లక్షల మంది అర్హత సాధించగా, అందులో ఈ రెండు లక్షల మంది టెట్ వ్యాలిడిటీ ముగిసిపోయినట్లు నిరుద్యోగులు చెబుతున్నారు. వారితో పాటు 2017 జూలై తర్వాత రాష్ట్రంలో టెట్ నిర్వహించలేదు. ఇక అప్పటి నుంచి బీఎడ్, డీఎడ్ ఉత్తీర్ణులైన దాదాపు 60 వేల మంది అభ్యర్థులు టెట్ కోసం ఎదురుచూస్తున్నారు.

ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు..

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ప్రతి అభ్యర్థి టెట్‌లో అర్హత సాధించి ఉండాలని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) 2010లోనే ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా మన రాష్ట్రంలోనూ ఏటా రెండుసార్లు (నవంబర్/డిసెంబర్, జూన్/జూలై) టెట్ నిర్వహించాలని రాష్ట్రం ప్రభుత్వం నిర్ణయించింది. అందులో అర్హత సాధించిన వారే ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వీలుంటుందని ఉత్తర్వులు జారీ చేసింది. టెట్ స్కోర్ వ్యాలిడిటీ ఏడేళ్లు ఉంటుందన్న నిబంధనను విధించింది. ఏడేళ్ల తర్వాత ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే మళ్లీ టెట్‌లో అర్హత సాధించాలని స్పష్టం చేసింది. ఆ నిబంధన ప్రకారం రాష్ట్రంలో మొదటి ఏడాది తప్ప ఏటా రెండు సార్లు టెట్‌ను నిర్వహించట్లేదు. 2011 నుంచి ఇప్పటివరకు ఆరు సార్లు టెట్ నిర్వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగుసార్లు, తెలంగాణ ఏర్పడ్డాక 2 సార్లే టెట్ నిర్వహించింది. ఇందులో 2011 జూలై 1న నిర్వహించిన టెట్ వ్యాలిడిటీ 2018 జూలై 1తో ముగిసింది. 2012 జనవరి 8న నిర్వహించిన రెండో టెట్ వ్యాలిడిటీ ఈ జనవరి 8తో ముగిసిపోయింది. అలాగే ఈనెల 1తో 2012 జూన్ 1న నిర్వహించిన మూడో టెట్ స్కోర్ వ్యాలిడిటీ కూడా ముగిసిపోయింది.

వ్యాలిడిటీ రద్దయిన టెట్‌ల వివరాలు..

పేపర్	హాజరు	అర్హులు
2011 జులై 1న మొదటి టెట్..		
1	3,05196	1,35,105
2	3,34,659	1,66,262
2012 జనవరి 8 నాటి రెండో టెట్..		
1	55,194	24,578
2	4,12,466	1,93,921
2012 జూన్ 1 నాటి మూడో టెట్..		
1	58,123	26,382
2	4,18,479	1,94,849

రుతుపవనాల రాక కాస్త ఆలస్యం

- కేరళలోకి నేటికి బదులు 8న వచ్చే అవకాశం
- తెలంగాణలోకి 11న రావాల్సి ఉండగా, రెండ్రోజులు ఆలస్యం

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల రాక కాస్తంత ఆలస్యం అయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై.కె.రెడ్డి వెల్లడించారు. కేరళలోకి గురువారం (నేడు) రుతుపవనాలు ప్రవేశిస్తాయని ఇటీవల ప్రకటించగా, ఇప్పుడు 8వ తేదీన వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. అలాగే తెలంగాణలోకి ఈ నెల 11న వస్తాయని ఇటీవల అంచనా వేయగా, ఇప్పుడు 13వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముందని ఆయన వివరించారు. అయితే ఈ తేదీలకు రెండ్రోజులు అటూ ఇటూ తేడా ఉండొచ్చని పేర్కొన్నారు. వాస్తవంగా గతేడాదితో పోలిస్తే ఈసారి రుతుపవనాలు ఆలస్యమవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం గత నెల వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఆలస్యం కావడం పట్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. గతేడాది నైరుతి రుతుపవనాలు మే 29వ తేదీనే కేరళను తాకాయి. ఆ తర్వాత జూన్ 8న తెలంగాణలోకి ప్రవేశించాయి.

వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్	44.8	ఖమ్మం	44
భద్రాచలం	42.6	మహబూబ్‌నగర్	41.1
హన్మకొండ	44.5	నిజామాబాద్	42.9
హైదరాబాద్	40.5	రామగుండం	43.2

రాజన్న జిల్లాలో మహిళా ఎంపీటీసీ కిడ్నాప్

పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

ఇల్లంతకుంట(మానకొండూర్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట ఎంపీటీసీ సభ్యురాలు గొడిసెల వనజను ప్రత్యర్థులు కిడ్నాప్ చేశారు. దీంతో ఆమె భర్త అనిల్ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనజ ముస్కానిపేట ఎంపీటీసీ సభ్యురాలిగా టీఆర్ఎస్ తరఫున పోటీచేసి విజయం సాధించారు. కాగా, ఆమెను ఇల్లంతకుంట ఉపసర్పంచ్ ఎండీ సాదుల్ కిడ్నాప్ చేశారని ఆరోపిస్తూ బాధితురాలి భర్త గ్రామస్తులతో కలసి ఆందోళనకు దిగారు. ఉపసర్పంచ్ సాదుల్ ఇంటికి చేరుకుని ధర్నా చేశారు. తన భార్యను తనకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనిల్‌తోపాటు గ్రామస్తులకు నచ్చజెప్పారు. కాగా, ఎంపీపీ పదవి కోసం పోటీపడే ప్రత్యర్థివర్గం వనజను కిడ్నాప్ చేసి తమ శిబిరానికి తరలించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఓయూ లైబ్రరీ పేరు మార్పుపై పిల్

- స్థానిక చారిత్రక నేతల పేరు మార్చడం తగదు
- గుట్టుగా అంబేడ్కర్ పేరు పెట్టారు
- హైకోర్టులో పిల్ దాఖలు చేసిన నిజాం వారసులు

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి భారతరత్న బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌ను ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ మనమడు అలీఖాన్, మరొకరు దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఓయూ వీసీ/రిజిస్ట్రార్/డైరెక్టర్‌లను ప్రతివాదులుగా చేర్చారు. ఓయూను 1918లో నిజాం నిర్మించారు. పరిశోధన, అధ్యయన భవనాలన్నింటినీ ఉస్మానియా విశ్వవిద్యాలయ భవనాలుగానే పరిగణిస్తారు. గ్రంథాలయాన్ని 1963లో అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. అప్పటి నుంచి దీనిని ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీగానే పరిగణిస్తున్నారు. ఇంతటి చారిత్రక విశ్వవిద్యాలయంలో గ్రంథాలయానికి అంబేడ్కర్ పేరు పెడుతున్నట్లుగా గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. మే 11వ తేదీన గోప్యంగా పేరు మార్చేశారు. అంబేడ్కర్ అంటే తమకు ఎనలేని గౌరవం ఉంది. అయితే జాతీయ నేతల పేరుతో స్థానికుల మనోభావాల్ని దెబ్బతీసేలా పేర్లు పెట్టడం చెల్లదు. ఈ పేరు మార్పు చట్టం చెల్లదని ప్రకటించాలి'అని పిల్‌లో హైకోర్టును కోరారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి'

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు త్వరలో కార్యాచరణను ప్రకటించనున్నట్లు ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌లు తెలిపారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశాలు చండీగఢ్‌లో రెండు రోజులపాటు జరిగాయి. ఈ సమావేశంలో సీపీఎస్ విధానం రద్దు, ఖాళీలు భర్తీ చేయాలని, ప్రభుత్వ శాఖల ప్రైవేటీకరణ ఆపేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలు చేశారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. సీపీఎస్ రద్దు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కట్టబెట్టాలని కేంద్రాన్ని కోరారు. ఉద్యోగుల కనీస వేతనం నెలకు రూ.24,000 చెల్లించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాతీయ కౌన్సిల్ సమావేశాలను త్వరలో మహారాష్ట్రలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

కొత్త సెట్స్‌తో పరీక్షలు

ఇంటర్ బోర్డు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం వరంగల్‌లోని పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరిచిన రెండు బాక్సులు మిస్ అయిన నేపథ్యంలో ఇంటర్ బోర్డు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఈ నెల 7 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్న తరుణంలో ప్రశ్నపత్రాల ట్రంకు బాక్సులు మిస్ అయినట్లు తమకు ప్రాథమిక నివేదిక అందినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొత్త సెట్స్‌తోనే పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించింది. పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బోర్డు కార్యదర్శి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

దొంగతనానికి వచ్చి..దుర్మరణం చెందాడు..!

హైదరాబాద్ : దొంగతనానికి వచ్చిన ఓ వ్యక్తి పరిసరాల వారు మేల్కోవడంతో తప్పించుకునే యత్నంలో మూడోఅంతస్తునుంచి దూకి తీవ్రగాయాలపాలై దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన బాలాంజనేయులు(32) అలియాస్ బాలు నగరానికి వలస వచ్చాడు. పుప్పాలగూడ దుర్గా కాలనీ ప్రాంతంలోని రవీందర్ అనే వ్యక్తి వద్ద కొంతకాలం పనిచేశాడు. ప్రస్తుతం ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 12గంటల సమయంలో తాను గతంలో పనిచేసిన రవీందర్ ఇంటి వద్దకు చోరీకి వచ్చాడు. ఆ సమయంలో రవీందర్ కుటుంబీకులు ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రిస్తున్నారు. దొంగతనం చేసేందుకు వచ్చిన బాలు ఆ ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లగా..అదే సమయంలో మూడో అంతస్తులో అద్దెకు ఉంటున్న ఓ వ్యక్తి చూసి కేకలు వేశాడు. దీంతో బయటకు వచ్చిన బాలు తప్పించుకునేందుకు మూడో అంతస్తు నుంచి కిందకు దూకేశాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఆం.ప్ర. గ్రీనింగ్ & బ్యూటిఫికేషన్ కార్పొరేషన్
ప్లాట్ నం.30, రోడ్ నం.4, సెక్టార్ నం.4, లోటస్‌పాండ్ మూడ్, కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్. www.urbangreening.ap.gov.in, email:apurbangreening@gmail.com, Phone No: 0866 - 2530833
e-Tender notice No: APUG-15021/7/2019-TECH SEC-APUGBC/2019-20/2(5), Dt.04/06/2019
ఒక లక్ష HDPE స్ట్రీ గార్డ్ సరఫరా మరియు నర్సరీ ప్లాంట్ల్ యాండ్‌స్కేప్ (4) నిర్వహణ పనుల కొరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి. E.C.V. మొత్తం రూ.173.02 లక్షలు.
పూర్తి బిడ్ డాక్యుమెంట్ల సెట్ ape-procurement పోర్టల్ http://www.apeprocurement.gov.in మరియు ఆం.ప్ర. గ్రీనింగ్ & బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ వెబ్‌సైట్ http://urbangreening.ap.gov.in లో తేది.06.06.2019 ఉ 10గంటల నుండి 24.06.2019 సా 2.00 వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
S/d మేనేజింగ్ డైరెక్టర్-APG&BC

దేశవ్యాప్తంగా టైటిల్ గ్యారెంటీ!

▶ మొదటి పేజీ తరువాయి

రూపొందించాలని కేంద్ర సర్కారు భావిస్తోంది. ఈ బాధ్యతను నీతి ఆయోగ్‌కు అప్పగించింది. ఇప్పటికే మన రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకురావడానికి నిపుణుల కమిటీ కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలనే ఉద్దేశంతో టైటిల్ గ్యారంటీ చట్టాన్ని ప్రవేశపెట్టడమే ఉత్తమ మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న భూ చట్టాలను అధ్యయనం చేస్తోంది. వచ్చే శాసనసభ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టానికి ఆమోదముద్ర వేసేందుకు గాను ముసాయిదాకు తుదిరూపనిస్తోంది.

ఆర్థిక భారం కేంద్రానిదే!..

భూ సర్వే, రెవెన్యూ సంస్కరణలకు నిధులను సమకూర్చేందుకు కేంద్రం ఇది వరకే అంగీకరించింది. భూ భారతి మొదలు సమగ్ర భూ సర్వేకు కూడా నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలోనే టైటిల్ గ్యారంటీ చట్టం అమలుకు అవసరమైన వ్యయాన్ని భరించడానికి సుముఖంగా ఉంది. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జాతీయ భూ రికార్డుల నవీకరణ కార్యక్రమం (ఎన్ఎల్ఆర్ఎంపీ) ప్రవేశపెట్టింది. దీని స్థానే ఎన్డీఏ సర్కారు డిజిటల్ ఇండియా భూ రికార్డుల నవీకరణ ప్రోగ్రాంను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం టైటిల్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేయడం. ఈ నేపథ్యంలోనే గతేడాది హరియాణాలోని ఒక జిల్లాలో టైటిల్ గ్యారెంటీని పైలట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టింది. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరడంతో టైటిల్ గ్యారంటీ చట్టంపై ఆశలు చిగురించాయి. మరోవైపు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచన చేస్తుండటం.. కేంద్రం కూడా దానికి సానుకూలంగా ఉండటంతో టైటిల్ గ్యారంటీ పట్టాలెక్కేందుకు మార్గం సుగమమం కానుంది. అంతేగాకుండా.. టైటిల్ గ్యారెంటీని ప్రవేశపెట్టాలంటే హద్దులు, టైటిల్ క్లియర్ అవసరం. దీంతో భూసర్వే నిర్వహిస్తే తప్ప ఈ చట్టం అమలు సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో సమగ్ర భూ సర్వే చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి అవసరమైన నిధులను రాష్ట్రాలకు కేటాయించేందుకు కేంద్రం సుముఖంగా ఉంది. 2022 లోపు టైటిల్ గ్యారంటీని అందుబాటులోకి తీసుకురావాలని నీతి ఆయోగ్ సూచించడం కూడా మోదీ సర్కారు భూసంస్కరణల వైపు మొగ్గు చూపడానికి కారణంగా కనిపిస్తోంది.

విశాఖ శారదా పీఠాధిపతిగా కిరణ్‌శాస్త్రి

- ఈ నెల 15,16,17 తేదీల్లో ఉత్తరాధికారిగా స్వీకార మహోత్సవం
- విజయవాడలో బాధ్యతలు అప్పగించనున్న స్వరూపానందేంద్ర స్వామి
- హాజరుకానున్న గవర్నర్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

ఉత్తరాధికారి శిష్య తురీయాశ్రమ దీక్షా స్వీకారమహోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్: విశాఖ శారదా పీఠం అధిపతిగా ప్రస్తుత పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి శిష్యుడు కిరణ్‌శాస్త్రి నియమితులవుతున్నట్లు ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ తెలిపింది. ఇందుకు సంబంధించి ఈ నెల 15,16,17 తేదీల్లో విజయవాడ కృష్ణా కరకట్టపై ఉత్తరాధికారి శిష్య తురీయాశ్రమ దీక్షా స్వీకార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ స్టేట్ అడిషనల్ సెక్రటరీ రఘురామయ్య చెరుకుచర్ల తెలిపారు. ఈ మేరకు ఈ స్వీకార మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం హైదరాబాద్‌లోని కుబేరా ప్యాలెస్‌లో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణచారి, అధికార ప్రతినిధి కె.వేణుగోపాలచారి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామయ్య మాటాడుతూ.. స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి పదవి ముగుస్తున్న కారణంగా ఆయన స్థానంలో తన శిష్యుడు కిరణ్ శాస్త్రిని విశాఖ పీఠాధిపతిగా ఆయనను నియమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావులతో పాటు దేశంలో పలువురు రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సాగర తీరానే సచివాలయం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన దృష్టికి వచ్చింది. దీంతో మరోచోట కొత్త భవనాలు నిర్మించాలని నిర్ణయించి.. తొలుత ఎర్రగడ్డలోని ఛాతీ వ్యాధుల ఆసుపత్రి స్థలాన్ని ఎంపిక చేశారు. అందులోని ఆసుపత్రిని వికారాబాద్‌కు తరలించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, ట్రాఫిక్ పరంగా ఆ ప్రాంతం ఇబ్బందిగా ఉంటుందన్న భావనతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానం పక్కనే ఉన్న బైసన్‌పోలో గ్రౌండ్‌లో కొత్త సచివాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించారు. అది రక్షణ శాఖ అధీనంలో ఉండటంతో ఆ స్థలాన్ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాని మోదీతో సమావేశమైన సందర్భంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు. అయితే, ఇందుకు పర్యావరణవేత్తలు, ప్రజాసంఘాలు అభ్యంతరం చెప్పాయి. దాదాపు కోటి జనాభాతో కిటకిటలాడుతున్న హైదరాబాద్‌లో ఖాళీ స్థలాలు లేకపోవడం, పచ్చదనం బాగా తక్కువగా ఉండి పర్యావరణపరంగా సమస్యలు ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావించాయి. అందులోనే జింఖానా క్రికెట్ మైదానం ఉండటంతో క్రీడా సంఘాలు కూడా ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో మోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని పక్కనపెట్టింది. అయితే, ఎలాగైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బైసన్‌పోలో మైదానాన్ని స్వాధీనం చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేసింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం హైదరాబాద్ వచ్చిన అప్పటి రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌ను రక్షణశాఖ విశ్రాంత సిబ్బంది కుటుంబాలతో పాటు పర్యావరణ సంఘాల ప్రతినిధులు కలిసి, బైసన్‌పోలో మైదానాన్ని సచివాలయం కోసం కేటాయించొద్దని కోరారు. ఈ విషయాన్ని తాను ప్రధాని దృష్టికి తీసుకెళ్తానని, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం వ్యవహరించదని అప్పుడు ఆమె హామీ ఇచ్చారు. అనంతరం వారి వినతులకు ప్రధానికి సమర్పించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ భారీ మెజార్టీతో తిరిగి అధికారంలోకి రావడంతో బైసన్‌పోలో ప్రతిపాదనకు సానుకూల స్పందన వచ్చే అవకాశం కనిపించడంలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సచివాలయ భవనాలున్న ప్రాంతంలోనే కొత్త భవనాలు నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం దాదాపు నిర్ణయానికి వచ్చిందని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి చెప్పారు.

రెండు దశల్లో నిర్మాణం..

ప్రస్తుతం సచివాలయంలోని ఏ, బీ, సీ, డీ బ్లాకులను తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకుంటోంది. శిథిలావస్థలో ఉన్న పురాతన హెరిటేజ్ జీ బ్లాక్ కాకుండా హెచ్, జే, కే, ఎల్ బ్లాకులు ఏపీ అధీనంలో ఉన్నాయి. ఈ భవనాలు తిరిగి తెలంగాణ పరిధిలోకి రానున్నాయి. వాటిని స్వాధీనం చేసుకున్న తర్వాత తెలంగాణ కార్యాలయాలను హెచ్, జే, కే, ఎల్ భవనాల్లోకి తరలిస్తారు. అనంతరం ఏ, బీ, సీ, డీ బ్లాకులు ఉన్న భవనాలను కూల్చివేసి అక్కడ ప్రధాన భవనాల నిర్మాణం చేపడతారు. అవి పూర్తయిన తర్వాత కార్యాలయాలను కొత్త భవనాల్లోకి తరలించి.. హెచ్, జే, కే, ఎల్ సముదాయాలను కూల్చివేసి అక్కడ పనులు చేపడతారు. ఈ విధంగా సచివాలయాన్ని మరోచోటుకు తరలించకుండానే రెండు దశల్లో పనులు పూర్తిచేయనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలను రోడ్లు, భవనాల శాఖ గతంలోనే ముఖ్యమంత్రికి సమర్పించింది. వాటికి ఆయన ఆమోదం తెలిపితే దాన్నే అమలు చేసే అవకాశం ఉంది. మరికొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సచివాలయ ప్రాంగణం 24 ఎకరాల్లో ఉంది. అందులో వాస్తును సరిద్దేందుకు రోడ్ల అలైన్‌మెంట్‌ను మార్చడం, ఇతరత్రా అవసరాల కోసం నాలుగు ఎకరాల స్థలం అవసరమని సమాచారం. దీంతో ఆ నాలుగు ఎకరాలు తీసేయగా, మిగిలిన 20 ఎకరాల్లో కొత్త భవనాలు నిర్మిస్తారు. అయితే వీటి నిర్మాణానికి భారీగా వ్యయం చేయాల్సి ఉన్నందున ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభిస్తుందా లేదా అన్నది తేలాల్సి ఉంది.

> కొత్త సచివాలయం సాధారణ భవనాలుగా కాకుండా తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా ఆధునికంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారు. ఇందుకోసం ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్ కాంట్రాక్టర్‌కు డిజైన్ రూపకల్పన బాధ్యతను గతంలోనే అప్పగించారు. ఆ మేరకు ఆయన రెండు ప్లాన్‌లు సిద్ధం చేశారు. ఇందులో ఓ ప్లాన్‌ను స్వయంగా ముఖ్యమంత్రే మీడియాకు వివరించారు. ఇప్పుడు ఆ ప్లాన్లకు స్వల్పంగా మార్పు చేసి కొత్త ప్లాన్ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆయన్ను కోరినట్టు సమాచారం. ఇక ప్రస్తుత సచివాలయం ఉన్న స్థలంలోనే పనులు ప్రారంభిస్తే, సెక్రటేరియట్‌ను తాత్కాలికంగా మరోచోటకు తరలించాల్సిన అవసరం లేకుండానే నిర్మాణం చేపట్టనున్నట్టు తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్.. సేవింగ్స్‌పై 'కేర్'..

- తలకిందులైన సాఫ్ట్‌వేర్ లైఫ్‌స్టైల్..
- వీకెండ్ పార్టీలకు బదులు పొదుపుపై దృష్టి
- ఆచితూచి ఖర్చు పెడుతున్న టెకీలు
- ఉద్యోగ భద్రతపై నమ్మకం లేకే..

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ పూర్తవగానే ఎంఎన్‌సీ కంపెనీలు కొలువిచ్చాయి. కెరీర్ మొదలు పెట్టగానే ఐదంకెల జీతం.. ఐదు రోజుల పని.. వీకెండ్ పార్టీలు, మాల్స్‌లో షాపింగ్‌లు.. బ్రాండెడ్ వస్తువులు.. ఖరీదైన సెల్‌ఫోన్లు.. ఇదీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాలు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లైఫ్ అంటే ఇంత సుఖంగా ఉంటుందా అన్న రేంజ్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు మనవాళ్లని పెంచి పోషించాయి. సాఫ్ట్‌వేర్ ఇదో

సాక్షి
గురువారం, జూన్, 6

లంకలో విద్వేషపర్వం

తమ చర్యల ద్వారా సమాజంలో చీలికలు తీసుకురావడం, పౌరుల్లో పరస్పర అనుమానాలు రేకెత్తించడం, ఘర్షణలు ప్రేరేపించి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం ఉగ్రవాద మూకల ప్రధానోద్దేశం. దాదాపు దశాబ్దకాలంనుంచి ప్రశాంతంగా ఉంటున్న శ్రీలంకలో మొన్న ఏప్రిల్ నెలలో ఈస్టర్ పర్వదినాన ఉగ్రవాదులు ఆ ఉద్దేశంతోనే మారణకాండ, విధ్వంసం సాగించారు. దాదాపు 300మంది ప్రాణాలు బలి తీసుకున్నారు. నిఘా సంస్థలకు ఉగ్రవాదుల పన్నాగంపై ముందస్తు సమాచారం ఉన్నా అవి తగినవిధంగా స్పందించకపోవడం వల్లే ఇంత ఘోరం జరిగిపోయింది. అయితే దురదృష్టమేమంటే... తర్వాతనైనా శ్రీలంక ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించలేక పోతోంది. ఈ విషయమై పౌర సమాజం, మత పెద్దలు పదే పదే హెచ్చరిస్తున్నా దాని ధోరణేమీ మారలేదు. ఫలితంగా దాడులు చేసిన ఉగ్రవాదులు జన్మతః ముస్లింలు కనుక ఆ వర్గం మొత్తాన్ని అనుమాన దృక్కులతో చూసే ధోరణి అక్కడ వ్యాపిస్తోంది. వారిపై పలుచోట్ల దుండగులు దాడులు చేస్తున్న సందర్భాలున్నాయి. ముఖ్యంగా వాయువ్య ప్రావిన్స్‌లో ముస్లింలకు చెందిన వ్యాపార సంస్థలపైనా, మసీదులపైనా, ఇళ్లపైనా సింహళ తీవ్రవాదులు దాడులు జరుపుతున్నారు. చివరికి ఇదంతా ఎక్కడదాకా పోయిందంటే... గవర్నర్లుగా ఉన్న ఇద్దరు ముస్లిం నేతలు ఉగ్రవాదానికి తోడ్పాటునందిస్తున్నారని, దర్యాప్తు సక్రమంగా జరగకుండా అవాంతరాలు సృష్టిస్తున్నారని, వారిని వెంటనే తొలగించి అరెస్టు చేయాలని ఒక బౌద్ధ మత సన్యాసి నిరవధిక నిరాహార దీక్షకు దిగాడు. ఆయన అధికార పక్షమైన యునైటెడ్ నేషనల్ పార్టీకి చెందిన ఎంపీయే. అయినా ప్రధాని రనిల్ విక్రమసింఘే ప్రభుత్వం పట్టనట్టు ఉండిపోయింది. ఒకపక్క బౌద్ధ సన్యాసి దీక్ష, మరోపక్క రోజురోజుకూ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ముస్లిం వర్గానికి చెందిన తొమ్మిదిమంది మంత్రులు, ఇద్దరు గవర్నర్లు రాజీనామా చేశారు. తమలో ఎవరికైనా ఉగ్రవాదులతో సంబంధాలున్నట్టు తేలితే చర్య తీసుకోవాలని, లేనట్టయితే సింహళ తీవ్రవాద సంస్థల ఆరోపణలు అబద్ధమని చెప్పాలని డిమాండ్ చేశారు.

అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, ప్రధాని రనిల్ విక్రమసింఘే మధ్య ఏర్పడ్డ విభేదాలు మొత్తం పాలనా వ్యవస్థను అచేతన స్థితికి చేర్చాయి. భారత నిఘా వర్గాలు ఉగ్రవాద దాడుల గురించి ముందస్తు సమాచారం ఇచ్చినా సరైన స్పందన లేకపోవడానికి ఇదే ప్రధాన కారణం. కనీసం ఆ తర్వాతైనా ప్రభుత్వం సమష్టిగా పనిచేస్తే వేరుగా ఉండేది. కానీ భద్రత కొరవడటానికి కారణం మీరంటే మీరని వాదులాడుకోవడంతోనే సరిపోతోంది. ఈ విషయంలో ప్రభుత్వం కంటే కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కాథొలిక్ చర్చి మెరుగ్గా ఉన్నాయి. వాటి కృషి వల్లే క్రైస్తవులు ప్రశాంతంగా ఉన్నారు. మారణకాండ తర్వాత క్రైస్తవ వర్గానికి చెందినవారు ముస్లింలపై దాడులు చేస్తారని సింహళ తీవ్రవాద శక్తులు బాగా ఆశించాయి. కానీ అలా జరగకపోవడంతో ఆ శక్తులే స్వయంగా రంగంలోకి దిగి ముస్లింల వ్యాపారసంస్థలపైనా, ఇళ్లపైనా దాడులు చేస్తున్నాయి. ఉగ్రవాదానికి రూపురేఖలుండవు. ప్రజలనూ, ప్రభుత్వాలనూ పక్కదోవ పట్టించేందుకు మతాన్నో, మరే ఇతర వాదాన్నో ముందుకు తెచ్చినా దాని మతమూ, అభిమతమూ కూడా మృత్యువే. పౌరులను సదా అప్రమత్తం చేయడం, విద్వేషపూరిత ప్రచారం చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం, వాటి కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచడం వంటివి ఉగ్రవాదాన్ని నియంత్రించడానికి తోడ్పడతాయి. అదే సమయంలో సమాజంలో పరస్పర విద్వేషాలు ప్రబలకుండా చూడటం, అలాంటి కార్యకలాపాలు సాగించేవారిపై చర్యలు తీసుకోవడం కూడా ముఖ్యం.

ఎల్‌టీటీఈపై సుదీర్ఘకాలం సాగించిన పోరాటం వల్ల కావొచ్చు.. శ్రీలంకలో సైన్యానికి, పోలీసులకు మొదటినుంచీ అపరిమిత అధికారాలున్నాయి. కానీ ముస్లిం వర్గాలపై దాడులు జరుగుతున్నా ఆ రెండు విభాగాలూ నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నాయి. మెజారిటీగా ఉన్న సింహళీయులపై చర్య తీసుకుంటే ఈ ఏడాది ఆఖరులో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో నష్టపోతానని విక్రమసింఘే భయపడుతుండటమే ఇందుకు కారణం. సింహళ తీవ్రవాద సంస్థలు ఒకపక్క ముస్లింలపై దాడులు సాగిస్తూనే వదంతుల్ని ప్రచారంలో పెడుతున్నాయి. ముస్లింలను బుజ్జగిస్తూ రావడం వల్లే ఉగ్రవాదం పెరిగిందని, బురఖా ధరించడానికి అనుమతించడం వల్ల ఎవరు ఉగ్రవాదో, ఎవరు కాదో తెలియడం లేదని వాదనలు లేవదీశాయి. దానికి తగ్గట్టే బురఖా ధరించరాదంటూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. నిజానికి చర్చిలు, హోటళ్లపై ఉగ్ర దాడులకు పాల్పడిన వారు బురఖాలు ధరించలేదని సీసీ టీవీల్లో రికార్డయిన దృశ్యాలు చెబుతున్నాయి. ఉగ్రవాద చర్యలతో ప్రమేయమున్నదని అనుమానం కలిగినవారిపై చర్యలు తీసుకోరాదని ఇంతవరకూ ముస్లిం నేతలెవరూ కోరలేదు. వారు అలా అడిగారని ప్రభుత్వం కూడా చెప్పలేదు. కానీ సింహళ తీవ్రవాద సంస్థలు ఈ విషయంలో ఇష్టానుసారం మాట్లాడుతున్నా అది మౌనం దాలుస్తోంది. దాదాపు రెండు నెలలుగా సాగిస్తున్న దర్యాప్తు ఎంతవరకూ వచ్చిందో, ఎవరి ప్రమేయమున్నదని తేలిందో, ఆ దర్యాప్తు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడానికి కారణాలేమిటో వివరించాల్సిన బాధ్యత ఉన్నా విక్రమసింఘే సర్కారు మాట్లాడదు. ఈ స్థితిలో ముస్లిం మంత్రులు, గవర్నర్లు రాజీనామా చేయడంలో ఆశ్చర్యం లేదు. ఈ సందర్భంగా లంక ఆర్థికమంత్రి మంగళ సమరవీర చేసిన ట్వీట్ ప్రస్తావించుకోవాలి. 'ద్వేషాన్ని ద్వేషంతో శాంతింపజేయలేం. దాన్ని ప్రేమానురాగాలతోనే జయించగలమని బుద్ధుడు ప్రవచించాడు. వంచకులు బుద్ధ భగవానుడి పేరిట ఇష్టానుసారం విద్వేషాన్ని రగుల్కొల్పుతుంటే, ముస్లిం మంత్రులు తమ పదవులకు రాజీనామాలివ్వడం ద్వారా బుద్ధుడి మార్గాన్ని అనుసరించారు' అని ఆ ట్వీట్‌లో సమరవీర అన్నారు. శ్రీలంక ప్రభుత్వం కూడా తాను ఏ పక్షాన ఉంటున్నదో, ఉండాలో తేల్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి శు.తదియ ఉ.11.33 వరకు, తదుపరి చవితి నక్షత్రం పునర్వసు రా.10.30 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం ఉ.11.01 నుంచి 12.32 వరకు, దుర్ముహూర్తం ఉ.9.46 నుంచి 10.38 వరకు, తదుపరి ప.2.57 నుంచి 3.50 వరకు అమృతఘడియలు... రా.8.11 నుంచి 9.43 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

'సబ్‌కా విశ్వాస్'లో వాళ్లకు చోటుందా?

మల్లెపల్లి లక్ష్మయ్య

ఈ దేశంలో గత ఐదేళ్ళలో మతం దేవాలయాల్లోనుంచి, అన్నం గిన్నెల్లోకి పొంగిపొర్లింది. ఎవరేం మాట్లాడాలో, ఏం ఆచరించాలో, ఏ సంస్కృతిని అనుసరించాలో, చివరకు ఎవరి అన్నం గిన్నెల్లో ఏముండాలో కూడా ఆధిపత్య మతమో, లేదా హిందుత్వవాదులో నిర్ణయిస్తోన్న దయనీయ పరిస్థితి ఈ దేశంలో 15 శాతంగా ఉన్న ముస్లిం మైనారిటీల వంటగదులను సైతం రక్తసిక్తంగా మార్చేసింది. ఈ నేపథ్యంలో మన దేశంలో మైనారిటీలలో నెలకొన్న ఊహాజనితమైన భయాలను తొలగించాలని సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్‌తో పాటు, సబ్‌కా విశ్వాస్ కూడా సాధించాలంటూ రెండోసారి అధికార పగ్గాలు చేపడుతోన్న ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయి. ముస్లింలలోని భయం నిజం కాదని ధ్వనిస్తున్న ఈప్రకటన మన దేశ ముస్లింలలో విశ్వాసాన్ని ప్రోది చేస్తుందా?

కొత్త కోణం

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలోని ప్రతి పౌరుడి సంరక్షణకు లౌకికభావన కంచు కవచంలాంటిది. కానీ వ్యక్తి ఆహార్యాన్నీ, ఆహారాన్నీ, సాంప్రదాయాన్నీ, సంస్కృతినీ, గుర్తించి, గౌరవించే కనీస మానవీయ విలువలకి కాలం చెల్లిందనడానికి గడచిన ఐదేళ్ళు ప్రత్యక్షసాక్ష్యంగా నిలుస్తున్నాయి. మతం మత్తుమందులాంటిదని ఏనాడో చెప్పిన మార్క్సిస్టు మహాజ్ఞాని వ్యాఖ్యలు అక్షరసత్యాలని వేనవేల సంవత్సరాల మత మౌఢ్యం ప్రతిమారూ నిరూపిస్తూనే ఉంది. అది హిందూత్వ భావజాల పునాదులపై అధికారంలోకి వచ్చిన భారతీయ జనతాపార్టీ, దాని అనుబంధ సంస్థలూ మతం యొక్క మూఢత్వాన్నీ, వెర్రితనాన్నీ మరింతగా సాక్షాత్కరించాయి. బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఈ నాటి వరకూ ఆధిపత్య మతమైన హిందూ మతం మైనారిటీ మతమైన ముస్లిం మతంపైనా, ఇస్లాం మతాన్ని ఆచరిస్తోన్న అత్యంత పేద వర్గమైన ముస్లింలపైనా చెలాయిస్తోన్న ఆధిపత్య చరిత్ర యావత్తు రక్తసిక్తంగా మారింది. ఇలాంటి సందర్భంలో రెండోసారి అధికారపగ్గాలు చేపడుతోన్న ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు ఈదేశంలో సమానత్వ కాంక్షాపరులందరినీ క్షణకాలం పాటు ఆశ్చర్యానికి గురిచేశాయి.

''మన దేశంలో మైనారిటీలలో నెలకొన్న ఊహాజనితమైన భయాలను తొలగించాలి. సబ్‌కాసాథ్ సబ్‌కా వికాస్‌తో పాటు, సబ్‌కా విశ్వాస్ కూడా సాధించాలి. మనం ప్రజలందరి ప్రభుత్వంగా పనిచేయాలి'' అంటూ బీజేపీ అనూహ్య విజయాన్ని కైవసం చేసుకున్న అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త గొంతును విని యావత్ దేశం ఆశ్చర్యపోయింది. ఈ దేశంలో ఇసుమంతైనా సెక్యులర్ భావజాలం బతికి బట్ట కట్టాలని భావించేవారందరికీ ఈ వ్యాఖ్యలు అద్భుతంగా తోయడంలోనూ ఆశ్చర్యం లేదు. ఈ మాటల్లో సత్యమెంత అన్న అనుమానం రానివారెవ్వరూ ఉండరని కూడా గతకాలపు చేదు అనుభవాల దొంతరలు నొక్కి చెపుతున్నాయి. అందుకనుగుణంగానే ఈ మాటల్లోనే ఒక తిరకాసు కనిపిస్తున్నది. ఒక మాయాజాలం అంతర్లీనంగా వినిపిస్తూ ఉన్నది. ముస్లిం మైనారిటీల్లో ఊహాజనితమైన భయం ఉన్నదని ఆయన మాటల సారాంశంగా మనం భావించొచ్చు. ముస్లింలలోని భయం నిజం కాదన్నది దానర్థం. ఆ మాటల్లోని అంతరార్థంలో సత్యాసత్యాలను పెద్దగా అన్వేషించాల్సిన పనికూడా లేదు. భారతదేశంలోని పరిస్థితులను గత అయిదేళ్ళుగా పరిశీలిస్తున్న వారెవరికైనా ఈ మాటల్లోని నిజం వెతకడం అర్థంలేనిపనిగా స్పష్టమౌతుంది. ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవ మైనారిటీల్లో గత కొన్నేళ్ళుగా నెలకొన్న అభద్రతాభావం పెరిగింది. దానికి గత ఐదేళ్ళలో ఆయా మతాలపైనా, మతాన్ని ఆచరిస్తోన్న ప్రజలపైనా అమానుషమైన దాడులూ, దానికి సమర్థనగా లేవనెత్తిన అప్రజాస్వామిక భావజాలాలూ కారణం. ముఖ్యంగా గోసంరక్షణ పేరుతో జరిగిన దాడులు కాకతాళీయం కాదన్న సంగతి జగమెరిగిన సత్యం.

ఈ దేశంలో గత ఐదేళ్ళలో మతం దేవాలయాల్లోనుంచి, అన్నం గిన్నెల్లోకి పొంగిపొర్లింది. ఎవరేం మాట్లాడాలో, ఏం ఆచరించాలో, ఏ సంస్కృతిని అనుసరించాలో, చివరకు ఎవరి అన్నం గిన్నెల్లో ఏముండాలో కూడా ఆధిపత్య మతమో, లేదా ఆ మతాన్ని ఆచరిస్తోన్న పాలకుల నీడలో హిందూత్వవాదులో నిర్ణయిస్తోన్న దయనీయమైన పరిస్థితి ఈ దేశంలో 15 శాతంగా ఉన్న ముస్లిం మైనారిటీల వంటగదులను సైతం రక్తసిక్తంగా మార్చేసింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం అంటే 2018 వరకు జరిపిన అధ్యయనంలో దాదాపు 80 మందికి పైగా హత్యకు గురయ్యారని హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొన్నది.

ఆవుని చంపడాన్ని నిషేధిస్తూ ఉన్న చట్టాలను బీజేపీ ప్రభుత్వాలు మరింత కఠినతరం చేశాయి. కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు గో సంరక్షణ దళాలను ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి అపరిమితమైన అధికారాలను కట్టబెట్టాయి. ఎవరైనా గో హత్యకు పాల్పడినట్టు వారు భావిస్తే, లేదా అనుమానం వస్తే, అది కాదని నిరూపించుకునే బాధ్యత సైతం నిందితులపైనే పెట్టారు. ఇది పూర్తిగా కక్షసాధింపు చర్యే తప్ప మరొకటి కాదు. మరీ ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా లాంటి రాష్ట్రాల్లో గో సంరక్షణ దారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. 2017లో ఉత్తర ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన యోగి ఆదిత్యనాథ్ ఏకంగా ముస్లింలు చట్ట ప్రకారం నిర్వహిస్తోన్న ఎన్నో పశువధ శాలలను బలవంతంగా మూసివేయించారు. రాజస్తాన్‌లో బీజేపీ ప్రభుత్వం ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే పేరుతో వందలాది మందిని అక్రమంగా నిర్బంధించింది. గోసంరక్షకులకు అధికారికంగా అండదండలు అందించి, అనధికారికంగా ప్రోత్సాహమిచ్చి అదే వృత్తిని నమ్ముకొని బతుకుతోన్న వేలాదిమంది నిరుపేద ముస్లింలపై దాడులకు కారణమయ్యింది. దాని ఫలితమే 2017 ఏప్రిల్‌లో పెహ్లూఖాన్ అనే పాలమ్ముకునే రైతును స్మగ్లింగ్ చేస్తున్నాడనే పేరుతో తీవ్రంగా హింసించిన అమానుష ఘటన అప్పట్లో పెద్ద సంచలనాన్ని రేపింది. గోసంరక్షణ పేరుతో హత్యలకు పాల్పడిన వాళ్ళకు వత్తాసు పలుకుతూ, ఆవులను స్మగ్లింగ్ చేస్తున్న వాళ్ళను తెలిసి నేరం చేస్తున్నట్టు, గో సంరక్షకులూ, గో ఆరాధకులు వాళ్ళను ఆపడానికి ప్రయత్నం చేయడం తప్పుకాదు అంటూ హంతకులకు వత్తాసు పలకడం పాలకుల తీరుకి అద్దం పడుతోంది.

2015 మే నుంచి 2018 డిసెంబర్ మధ్యలో కనీసం 44 మంది ముస్లింలు హత్యకు గురైనట్టు, వీరిలో అత్యధిక భాగం ఆవు మాంసాన్ని రవాణా చేస్తున్నందుకో, లేదా గోవు మాంసాన్ని ఇంట్లో ఉంచుకున్నందుకో మృత్యువు ఒడిలోకి చేరిన దుస్థితిని హ్యూమన్ రైట్స్ వాచ్ బట్టబయలు చేసింది. అలాగే దేశంలో జరిగిన మతదాడుల్లో 90 శాతం మోదీ అధికారాన్ని చేపట్టిన తరువాతే జరిగాయని కూడా ఈ రిపోర్టు వెల్లడించింది. గోసంరక్షకుల పేరుతో కొంతమంది ముఠాలుగా తయారై హింసాకాండకు దిగారు. దాడులు చేశారు. హత్యలకు దిగారు. కేవలం గోభక్షకులనే ఒకే ఒక్కపేరుతో నిరుపేద మైనారిటీల దేహాలను చెట్లకు వేళ్ళాడదీశారు. ఈ కుటుంబాల్లోని వారెవరైనా న్యాయం కోసం గొంతు విప్పితే వారినోళ్ళు మూయించడానికి కండబలాన్ని ప్రయోగించడం అత్యంత సహజక్రియగా మారిపోయింది. చావు భయంతో వెనక్కి తగ్గడం తప్ప వారికి వేరే ఆసరా లేకుండా పోయింది. ఎవరైనా సామాజిక కార్యకర్తలో, సంస్థలో బలవంత పెడితే పేరుకి దర్యాప్తు ప్రారంభించి, దానికి సంబంధించిన ప్రొసీజర్స్‌ని నిర్లక్ష్యం చేసి, చివరకు నేరస్తులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నించినట్టు కూడా ఈ రిపోర్టు తేల్చి చెప్పింది.

ఇక ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణసింగ్ ఏకంగా ''గోవులను చంపే వారిని మేం ఉరితీస్తాం'' అంటూ అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. చివరకు రైళ్ళలో ప్రయాణిస్తున్న వారిపై సైతం గోమాంసం తింటున్నారనే పేరుతో దాడులకు పాల్పడిన ఘటనలు ఎన్నో జరిగాయి. హరియాణాలో బీఫ్ తింటున్నారన్న కారణంగా ఓ కుటుంబంలోని ఇద్దరు స్త్రీలపై అత్యాచారంచేసి, హత్యచేసిన దారుణ ఘటనలు జరగడం మన రాజ్యాంగంలోని లౌకిక భావనకు ఈ దేశం, ఇక్కడి పాలకులు ఇస్తున్న గౌరవ మెలాంటిదో అర్థం అవుతోంది. ఏదైనా నేరం చేసిన వారు తమ నేరాన్ని బహిరంగంగా చెప్పు కోలేరు. నేరం చేసినందుకు తాము శిక్షించబడతామేమోననే భయం వారిలో ఉంటుంది కనుక. కానీ గోసంరక్షణ పేరుతో దాడులకు పాల్పడిన వారు తమ నేరాన్ని బహిరంగంగా యూట్యూబ్‌లో పెట్టుకుంటున్నారు. తాము చేసిన దుశ్చర్యకు విప్రవీగుతున్నారు. ఎందుకంటే వారిని ఆ తరువాత శిక్షించడం కాకుండా హీరోలుగా చూస్తున్న పరిస్థితి ఉందంటున్నారు ఇండియన్ సోషల్ వర్కర్, రచయిత హర్షమందర్. మూకుమ్మడిగా ముస్లింలను హత్యలు చేసిన గుంపు హత్యాకాండల్లో దోషులకు శిక్షపడిన దాఖలాలే లేవు.

ఆ రోజు ముస్లింల హత్యలకు పాల్పడిన గుంపులకు ఇప్పుడిక హద్దూ పద్దూ ఉండదని మరునాటి నుంచే ప్రారంభమైన దాడులు తేటతెల్లం చేస్తున్నాయి. కాబట్టి ప్రధాని, లేదా భారతీయ జనతా పార్టీ వల్లె వేస్తున్న మాటలకూ, చేతలకూ పొంతనలేదన్న విషయంలో ఏమాత్రం సందేహంలేదు. సబ్‌కా సాత్ సబ్‌కా విశ్వాస్ వినడానికి సొంపుగానే ఉన్నా, అదే విశ్వాసాన్ని ఈ దేశ ముస్లింలలో కలిగించాలంటే హిందుత్వవాదుల ఆగడాలను పార్టీలు కాదు సమాజమే అడ్డుకట్ట వేయాలి. ఓట్లు దండుకున్న హిందుత్వవాదం వెర్రితలలు వేయకముందే ప్రతి పౌరుడూ మెళకువతో వ్యవహరించక తప్పని పరిస్థితి ఇది. మరో ఐదేళ్ళ పాటు ఈ దేశంలో దళితులూ, మైనారిటీలూ, స్త్రీలూ తమని తాము వ్యక్తులుగా, ఉమ్మడిగా శక్తిని కూడగట్టుకోవాల్సిన సందర్భమిదే. స్వతంత్రపోరాట కాలంలో ఆ తర్వాత కూడా, ఈ దేశంలోని ప్రతి అభివృద్ధిలో వారి చెమటచుక్కలున్నాయి. శత్రుదేశాలనుంచి ఈ దేశాన్ని రక్షించుకోవడం మొదలుకొని, ఈ జాతిబిడ్డల ప్రాణాలు కాపాడటం కోసం ప్రాణాలర్పించడం వరకు ముస్లింల సేవలు అనన్యసామాన్యమైనవి. ఇక్కడ అడుగడుగునా ఎదురౌతోన్న అవమానాలను దిగమింగుతూ తన భూమిపైనే పరాయి వారుగా జీవిస్తున్న వారిని హత్తుకుని, అక్కున చేర్చుకునే రోజు కోసం భారత దేశస్తుడైన ప్రతి ముస్లిం ఎదురుచూస్తూనే ఉంటాడు. వారికి అండగా హృదయమున్న ప్రతిభారతీయుడూ స్పందిస్తూనే ఉంటాడు. ఇది సత్యం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | మొబైల్ : 81063 22077

సోషల్ మీడియా రేస్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బంతులు

"తన ఆల్‌టైమ్ వరల్డ్ 11 టీమ్‌లోకి తప్పకుండా తీసుకునే ఒక ఫాస్ట్ బౌలర్ పేరు చెప్పమని రాజ్‌దీప్ సర్దేశాయ్ ఇండియా టుడే టీవీలో గవాస్కర్‌ను అడిగాడు. వెంటనే గవాస్కర్ వాసిం అక్రమ్ పేరు చెప్పాడు. అతడు ఒకే ఓవర్ ఆరు బంతులు తాను ఆడలేని విధంగా వేశాడని కూడా చెప్పాడు"

– ఎం.కె.వేణు, జర్నలిస్ట్

ఆటస్థలం

"నా అటెన్షన్ కోసం ఆకలిగా ఎదురు చూసేది భక్తులే. సాగరిక ఇది, సాగరిక అది అంటూ వాళ్లే ఏవేవో ట్వీట్లు పెట్టుకుని, వాటిపై తిరిగి వారే పిచ్చిపిచ్చిగా కామెంట్లు చేస్తూ స్పందిస్తుంటారు. వాళ్లు కేవలం మూర్ఖులు మాత్రమే కాదు, సైకోలు కూడా. ట్విట్టర్ ఇడియట్ల ఆట స్థలంగా తయారయ్యింది"

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

ఆలోచన

"ఈ టేబుల్ ఎంత పొడవుందో కనీసం అందులో సగమైనా చంద్రబాబు ఆలోచన ఉండాలని కోరుకుంటున్నాను"

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

రేస్

"తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవికి నేను రేసులో ఉన్నట్టు న్యూస్‌లో చూసి ఆశ్చర్యపోయాను. చాలామంది నాకు ఫోన్‌లు చేసి అడుగుతున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నదే నా కోరిక. అందుకోసమే పని చేశా. నావంతు సహకారం అందించా. వైఎస్ జగన్ ప్రజల ముఖ్యమంత్రి అన్న నమ్మకంతోనే నేను తిరిగి రాజకీయాలలోకి వచ్చా. అంతేకానీ, ఎటువంటి పదవులు ఆశించి కాదు"

– ఎం. మోహన్‌బాబు, నటుడు

పోటీ

"వామ్.. వారితో ఎవరు పోటీ పడగలరు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిజేపీ రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టింది. ఇది చాలా భారీ వ్యయం. వాళ్లు ఒక్కొక్క పార్లమెంటరీ నియోజకవర్గానికీ రూ. 100 కోట్లు లేదంటే ప్రతి ఓటరుకు రూ.700 ఖర్చు చేశారు"

– గార్గి రావత్, యాంకర్

కరువు నేల పాడే నీటిపాట



ఒకానొక ఉదయం
నీళ్లతో కళకళలాడుతున్న నదిని
ముక్కున కరుచుకుని
సరిహద్దులు దాటి ఏ దేశంలోకో
ఎగిరిపోతుందో పిట్ట
పిట్టని పట్టుకుని కాల్చిపారేయాలని
హుకుంలూ జులుంలూ
గొంతు తడిసిన వాళ్లకేం తెలుస్తుంది
పిట్ట ఆరాటం
పాపం పిట్టది
ఎన్నాళ్ల దాహమో
నీళ్ల కోసం
ఎన్ని కన్నీళ్లను జారవిడిచిందో
పొడారిన నేలని
కళ్లనిండా చూసుకోలేని
విచిత్ర స్థితిని
ఎన్ని జీరగొంతులతో
ఎన్నెన్ని
వూళ్లుకాని వూళ్లల్లో
పాడుకుంటూ సాగిపోయిందో
పిట్టది తీరని ఆరాటం
నదిని ముక్కున కరుచుకుని
ఎగిరిపోతున్న పిట్ట
నా వూహల్లోనిది మాత్రమే
నీళ్లకోసం నాలుక చాచిన నేలది కానే కాదు
నీళ్లులేని నేలది ధర్మకాంక్ష
నీటిగొంతు ఎంత సౌకుమార్యమో
అంత రాతి కఠినం
ఎగిసిపడే మంటపై
ఎన్నిసార్లు నీళ్లు చల్లినా
అడుగునెక్కడో నిప్పు
రాజుకుంటూనే వుంటుంది
ఎలుగెత్తిన కాంక్షని
ఏ అడ్డుకర్రో వేసి ఇంకెవరూ ఆపలేరు
కరువు నేల పాడే నీటి పాట
హృదయంలో నీళ్లు నిలిచినంత వరకూ
దేశమంతా వినిపిస్తుంది
ఒకానొక ఉదయం
నీళ్లతో కళకళలాడుతున్న నదిని
కళ్లనిండా చూసుకుని
పిట్ట ఆకుపచ్చని పాట పాడుతుంది

(రాయలసీమ 'సిద్ధేశ్వరం అలుగు' పోరాటానికి సంఘీభావంగా)

బాలసుధాకర్ మౌళి
మొబైల్ : 9676493680

ప్రగతికి పనిముట్టు పుస్తకం

సందర్భం

జూలూరి గౌరీశంకర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత అనేక రంగాల్లో వినూత్నమైన మార్పులు, ప్రతిరంగాన్ని తీర్చిదిద్దుకునే పునర్నిర్మాణపనులు శరవేగంతో జరుగుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పరిస్థితి ఎలా ఉంటుంది అని వాదన చేసిన వారుకూడా లేకపోలేదు. కానీ రాష్ట్ర అవతరణ తర్వాత హైదరాబాద్ పుస్తకప్రదర్శనకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. హైదరాబాద్‌లోని 'తెలంగాణ కళాభారతి' (ఎన్టీఆర్ స్టేడియం) స్థలాన్ని డిసెంబర్ 18 నుంచి 29 వరకు మాకు ఉచితంగా, ఇచ్చింది. గత 30 ఏళ్ల పుస్తకప్రదర్శనలకు ఏ ప్రభుత్వము కూడా ఉచితంగా ఇవ్వలేదు. పుస్తకాలు చదివే ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు అన్నిరకాల సహాయసహకారాలు అందించటం వల్ల గత ఐదేళ్లుగా దేశంలోనే అతిపెద్ద బుక్‌ఫెయిర్‌గా నిలిచింది. రాష్ట్రప్రభుత్వం చేసిన మరోసహాయం జిల్లా కేంద్రాలలో మేం నిర్వహించే బుక్‌ఫెయిర్స్‌కు కూడా సహకారం అందించటం మరో విశేషం. హైదరాబాద్ లాంటి మహానగరాలకే పరిమితమైన పుస్తకప్రదర్శనలను గ్రామీణ ప్రాంతాలదాకా మట్టి కాళ్లపాదాల దాకా తీసుకుపోవాలన్న మా సంకల్పాన్ని కేసీఆర్ సహకారంతో నెరవేరింది. దీంతో ఏ జిల్లాకు వెళ్లినా మాకు సహకారం లభిస్తుంది.

జూన్ 2 నుంచి జూన్ 9 వరకు ఖమ్మంలో తెలంగాణ అవతరణ దినోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ కర్ణన్ కోరారు. ఇది నాకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కల్గించింది. ఒక రకంగా ఆయనే మా వెంటపడి మరీ బుక్‌ఫెయిర్ పెట్టించారు. ఎండలు మండిపోతున్నాయి. రోకళ్లు పగిలే రోహిణీకార్తెలో జనం రావటం కష్టమౌతుందన్నా కలెక్టర్ కర్ణన్ పట్టుబట్టి మరీ ఖమ్మంలో పుస్తక ప్రదర్శన పెట్టించారు. ఊహించని విధంగా పుస్తక ప్రియులనుంచి కదలిక వచ్చింది. తెలంగాణ అవతరణోత్సవాల సందర్భంగా ఈ పుస్తక ప్రదర్శన జరపాలన్న కర్ణన్ ప్రతిపాదనను ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ సమర్థించటమే కాదు, ఇక ప్రతిఏడాది ఇదే

ఖమ్మం బుక్ ఫెయిర్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

సాంప్రదాయాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. పుస్త

సాక్షి స్పోర్ట్స్
గురువారం
6-6-2019

ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీకి వర్షం దెబ్బ

భారీ వర్షాల కారణంగా ఫ్రెంచ్ ఓపెన్‌లో బుధవారం జరగాల్సిన అన్ని క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లను గురువారానికి వాయిదా వేశారు. బుధవారం మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సిమోనా హలెప్ (రొమేనియా)-అనిసిమోవా (అమెరికా); మాడిసన్ కీస్ (అమెరికా)-యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా) మధ్య... పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జొకోవిచ్ (సెర్బియా)-ఐదో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ); పదో సీడ్ ఖచనోవ్ (రష్యా)-నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) మధ్య మ్యాచ్‌లు జరగాల్సింది. కానీ వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో నిర్వాహకులు మ్యాచ్‌లను గురువారానికి వాయిదా వేశారు.

సూపరోహిట్...

ఎన్నాళ్లయిందో బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ నిబ్బరం చూసి! ఎన్ని ఇన్నింగ్స్‌లయ్యాయో అతడింత సంయమనంగా ఆడి! సిక్సర్ల జోరు, బౌండరీల మెరుపుల్లేకుండా ఎంత నిగ్రహంగా నిలిచాడో! ప్రపంచ కప్‌లో భారత్ ఏమైతే కోరుకుంటోందో అదే జరిగిన వేళ... అలవోక విజయంతో జట్టు టైటిల్ వేట ఆశావహంగా ప్రారంభమైంది. భారీ స్కోర్ల మైదానంగా పేరున్న రోజ్ బౌల్ అందుకు భిన్నంగా స్పందించినా... యజువేంద్ర చహల్ మాయాజాలం, బుమ్రా మెరుపులు, రోహిత్ పోరాటంతో దక్షిణాఫ్రికాపై టీమిండియా సమయోచితంగా ఆడి గెలుపును సొంతం చేసుకుంది.

మ్యాచ్‌లో ఇరు జట్ల ఆట కంటే వాతావరణం గురించే ఎక్కువ చెప్పకోవాలేమో...? మబ్బులు కమ్మి శీతల గాలులతో అంతగా పరిస్థితులను మార్చింది మరి. అదనపు బౌన్స్, స్వింగ్‌తో బ్యాట్స్‌మెన్‌కు పరీక్ష పెట్టింది. దీంతో క్యాచ్‌ల కోసం టెస్టుల తరహాలో మూడు స్లిప్‌లలో ఫీల్డర్లను మోహరించారు. చల్లదనంతో ఆటగాళ్లు పదేపదే చేతులను రుద్దుకున్నారు. దీంతో ఊహించిన దానికంటే తక్కువ స్కోర్లే నమోదయ్యాయి.

అజేయ సెంచరీతో భారత్‌ను గెలిపించిన ఓపెనర్

- ప్రపంచ కప్‌లో టీమిండియా శుభారంభం
- దక్షిణాఫ్రికాపై ఆరు వికెట్లతో గెలుపు
- బౌలింగ్‌లో నాలుగు వికెట్లతో 'చహల్'చల్
- 9న ఆస్ట్రేలియాతో తదుపరి మ్యాచ్

సౌతాంప్టన్: అంచనాలకు తగ్గకుండా ఆడి... ప్రపంచ కప్‌లో భారత్ శుభారంభం చేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ఆటతో తమ తొలి మ్యాచ్‌లో సునాయాస విజయం సాధించింది. 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ (144 బంతుల్లో 122 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో రాణించిన వేళ దక్షిణాఫ్రికాతో బుధవారం ఇక్కడి రోజ్‌బౌల్ మైదానంలో జరిగిన ప్రపంచ కప్ మ్యాచ్‌లో టీమిండియా ఆరు వికెట్లతో జయభేరి మోగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు... మణికట్టు స్పిన్నర్ యజువేంద్ర చహల్ (4/51) మాయాజాలం, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (2/35) పకడ్బందీ బౌలింగ్‌తో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. 8వ నంబరు బ్యాట్స్‌మన్ క్రిస్ మోరిస్ (34 బంతుల్లో 42; ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. రబడ (35 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు)తో అతడు జోడించిన 66 పరుగులే ఇన్నింగ్స్‌లో అత్యధిక భాగస్వామ్యం. కెప్టెన్ డు ప్లెసిస్ (54 బంతుల్లో 38; 4 ఫోర్లు), ఫెలుక్వాయో (61 బంతుల్లో 34; 2 ఫోర్లు, సిక్స్) మోస్తరుగా ఆడారు. భువనేశ్వర్ (2/44) ఆఖర్లో రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో రోహిత్ శతకానికి రాహుల్ (42 బంతుల్లో 26; 2 ఫోర్లు), ధోని (46 బంతుల్లో 34; 2 ఫోర్లు) అండగా నిలవడంతో భారత్ 47.3 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 230 పరుగులు చేసి లక్ష్యాన్ని అందుకుంది. రోహిత్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. టీమిండియా తదుపరి మ్యాచ్‌ను లండన్‌లో ఈ నెల 9న ఆస్ట్రేలియాతో ఆడనుంది.

మొదట బుమ్రా, మధ్యలో చహల్...

గత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించి దెబ్బతిన్న పరిణామమేమో కాని... మబ్బులు కమ్మిన వాతావరణం ఉన్నప్పటికీ, బుధవారం టాస్ నెగ్గగానే డు ప్లెసిస్ బ్యాటింగ్‌ను ఎంచుకున్నాడు. కానీ భువీ, బుమ్రాను ఎదుర్కొనడం సఫారీ ఓపెనర్లు ఆమ్లా (9 బంతుల్లో 6; ఫోర్), డికాక్ (17 బంతుల్లో 10; ఫోర్)లకు కత్తిమీద సామే అయింది. గుడ్ లెంగ్త్‌లో ఆఫ్ స్టంప్‌కు దూరంగా బుమ్రా వేసిన బంతి అదనపు బౌన్స్‌తో ఆమ్లా బ్యాట్ అంచును తాకుతూ రాగా రెండో స్లిప్‌లో రోహిత్ ఒడిసి పట్టాడు. బుమ్రా మరుసటి ఓవర్లో ఫుల్ లెంగ్త్ బంతితో డికాక్‌ను పెవిలియన్ చేర్చాడు. ఈ క్యాచ్‌ను మూడో స్లిప్‌లో కోహ్లి అందుకున్నాడు. ప్రధాన పేసర్ల తొలి స్పెల్ పూర్తికాక ముందే ఓపెనర్లు ఔటైన పరిస్థితుల్లో డు ప్లెసిస్, డసెన్ (22) నిలిచారు. పది ఓవర్ల పవర్ ప్లే పూర్తయ్యేసరికి జట్టు స్కోరు 34/2 మాత్రమే. కుల్దీప్, పాండ్యా బౌలింగ్‌లో ఇబ్బంది పడుతూనే ఈ జోడీ మూడో వికెట్‌కు 54 పరుగులు జత చేసింది. ఈ దశలో చహల్ రంగప్రవేశం ఇన్నింగ్స్‌ను మలుపు తిప్పింది. అతడు వేసిన 20వ ఓవర్ మొదటి బంతిని రివర్స్ స్వీప్‌కు యత్నించి డసెన్ బౌల్డ్ కాగా, గుగ్లీగా వచ్చిన చివరి బంతి డు ప్లెసిస్ వికెట్లను గిరాటేసింది. డుమిని (3)ని కుల్దీప్ ఎల్బీగా పంపాడు. దీనిపై రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. మిల్లర్ (40 బంతుల్లో 31; 1 ఫోర్), ఫెలుక్వాయో 12 ఓవర్ల పైగా నిలిచి 46 పరుగులు జోడించారు. మరోసారి చహల్ మాయాజాలం చూపి వీరిద్దరినీ ఔట్ చేశాడు. 158/7తో ఒకదశలో దక్షిణాఫ్రికా తక్కువ స్కోరుకే చాపచుట్టేసేలా కనిపించింది. మోరిస్, రబడ జంట భారత బౌలర్లందరినీ తట్టుకుని 59 బంతులు ఆడి స్కోరును 200 దాటించింది. చివరి ఓవర్లో మోరిస్, తాహిర్ (0)లను భువీ ఔట్ చేశాడు.

సరైన సమయంలో...

కొన్నాళ్లుగా భారత విజయాల్లో టాప్-3 బ్యాట్స్‌మెన్‌దే కీలక పాత్ర. అయితే, ఈ మ్యాచ్‌లో ధావన్ నిరాశపర్చాడు. కోహ్లి విఫలమయ్యాడు. రోహిత్ మాత్రం సెంచరీతో హిట్ కొట్టాడు. 145 కి.మీ.పైగా వేగంతో వచ్చిన రబడ మెరుపు బంతులను, పదునుగా కనిపించిన మోరిస్ బౌలింగ్‌ను తట్టుకుని మరీ పరీక్ష గట్టెక్కాడు. ఐపీఎల్ సహా ఇటీవల ఫామ్ లేమితో సతమతం అవుతున్న అతడు సరైన సమయంలో నిలిచి గెలిపించాడు. తన ఆటతో జట్టు నెత్తిన పాలు పోశాడు. పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడిన అతడికి ఈ క్రమంలో అదృష్టం కూడా తోడైంది. నాలుగు సార్లు క్యాచ్ ఔట్ ప్రమాదాన్ని తప్పించుకున్న హిట్‌మ్యాన్, ఒకసారి రివ్యూ నుంచి నాటౌట్‌గా బయట పడ్డాడు. మరోసారి రనౌట్ నుంచి గట్టెక్కాడు. ఏదేమైనా కప్ తొలి మ్యాచ్‌లోనే రోహిత్ టచ్‌లోకి రావడం టీమిండియాకు పెద్ద బలం.

ఛేదన కష్టమైంది...

స్కోరు చిన్నదే అయినా దానిని అందుకోవడంలో భారత్‌కు తిప్పలు తప్పలేదు. పిచ్‌ను సద్వినియోగం చేసుకున్న ప్రత్యర్థి పేసర్లు రబడ (2/39), మోరిస్ (1/36) చుక్కలు చూపారు. వీరి ధాటికి శిఖర్ ధావన్ (12 బంతుల్లో 8; ఫోర్) చేతులెత్తేశాడు. కోహ్లి (34 బంతుల్లో 18; 1 ఫోర్) తన ఆఫ్ స్టంప్ బలహీనత చాటుకుంటూ... డికాక్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. కానీ, రోహిత్ దృఢ సంకల్పంతో నిలిచాడు. ఇరు జట్ల గెలుపు అవకాశాలు చెరిసగం ఉన్న దశలో రాహుల్‌తో కలిసి మూడో వికెట్‌కు 96 బంతుల్లో 85 పరుగులు జోడించి మ్యాచ్ భారత్ వైపు మొగ్గేలా చేసాడు. అనంతరం ధోనితో కలిసి 74 పరుగులు జత చేసి విజయం ఖాయం చేశాడు. 48 బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన దశలో వీరిద్దరూ దూకుడుగా ఆడి లక్ష్యాన్ని కరిగించారు. అంతకుముందు 70 బంతుల్లో 50 పరుగుల మార్క్‌ను చేరుకున్న రోహిత్... రెండో ఫిఫ్టీని 58 బంతుల్లోనే అందుకుని సెంచరీ పూర్తి చేసుకున్నాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (7 బంతుల్లో 15 నాటౌట్; 3 ఫోర్లు) ఫటాఫట్ బౌండరీలతో మ్యాచ్‌ను ముగించాడు.

> **పిచ్** సవాల్ విసరడంతో మ్యాచ్ చాలెంజింగ్‌గా సాగింది. రోహిత్‌కు హ్యాట్సాఫ్. టాస్ గెలిచి ఉంటే బౌలింగే చేసేవాళ్లం. బుమ్రా బౌలింగ్‌లో డికాక్ క్యాచ్ అందుకున్న 15 నిమిషాల తర్వాత సైతం నా చేతులు సాధారణ స్థితికి రాలేదు. ఆమ్లాను అతడు ఔట్ చేసిన తీరును వన్డేల్లో నేనింత వరకు చూడలేదు. దీన్నిబట్టి బుమ్రా ఓ ప్రత్యేక శ్రేణిలో ఉన్నాడని చెప్పొచ్చు. చహల్ అత్యుత్తమంగా బౌలింగ్ చేశాడు. బ్యాటింగ్‌లోనూ జట్టుగా రాణించాం. మేం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం.
>
> -విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

ఊపొచ్చింది... మజా లేదు

ప్రపంచ కప్ ప్రారంభమైన వారం రోజులకు... అది కూడా టీమిండియా ఆడుతుందనగానే మన ప్రేక్షకులకు ఊపొచ్చింది. ప్రారంభ ఉత్కంఠను అధిగమించి మ్యాచ్ గెలిచినా వారు కోరుకున్నంత మజా మాత్రం రాలేదు. త్వరత్వరగా వికెట్లు కోల్పోయిన సఫారీల నుంచి పెద్దగా ప్రతిఘటన, మెరుపులు లేక పోవడం, నత్తనడక రన్‌రేట్‌తో ఓ స్థితిలో మ్యాచ్ బోర్ కొట్టించింది. భారత ఇన్నింగ్స్‌లో ధావన్, కోహ్లి వికెట్లు కోల్పోయిన తర్వాత కాస్త చురుకు పుట్టింది. పిచ్ క్లిష్టంగా ఉండటంతో రోహిత్ సైతం ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో 5 పరుగులే చేయగలిగాడు. కోహ్లి (తొలి 32 బంతుల్లో 14)దీ ఇదే పరిస్థితి. కుదురుకున్నాక, ముఖ్యంగా అర్ధ సెంచరీ దాటాక రోహిత్ స్పిన్నర్లు షమ్సీ, తాహిర్ బౌలింగ్‌లో కట్ షాట్లతో బౌండరీలు కొట్టి తన క్లాస్ చూపాడు. దీంతో కొంత అనుభూతి మిగిలింది.

3 భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో సౌరవ్ గంగూలీ (22 సెంచరీలు)ని వెనక్కి నెట్టి రోహిత్ శర్మ (23 సెంచరీలు) మూడో స్థానానికి ఎగబాకాడు. ఈ జాబితాలో సచిన్ (49), విరాట్ కోహ్లి (41) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

ఆ క్యాచ్ పట్టి ఉంటే...

మ్యాచ్‌లో సెంచరీతో భారత గెలుపులో కీలక పాత్ర పోషించిన రోహిత్ వాస్తవానికి రబడ మొదటి ఓవర్లోనే ఔట్ కావాల్సింది. అప్పటికి అతడి స్కోరు 1 మాత్రమే. రబడ వేసిన బంతిని రోహిత్ ఫుల్‌షాట్ ఆడబోగా అది గ్లోవ్స్‌కు తగిలి రెండో స్లిప్ దిశగా గాల్లో లేచింది. డు ప్లెసిస్ నెమ్మదిగా కదలడంతో అందుకునే అవకాశం లేకపోయింది. వాస్తవానికి అద్భుత ఫీల్డరైన డుప్లెసిస్ తేలికైన క్యాచ్‌ను జారవిడిచి జట్టుకు కోలుకోలేని నష్టం చేశాడు. సరిగ్గా ఆరు బంతుల తర్వాత మోరిస్ ఓవర్లో డుమిని ఓ క్లిష్టమైన క్యాచ్‌ను పట్టలేకపోయాడు. ఈ రెండు దక్షిణాఫ్రికాకు మ్యాచ్‌ను చేజార్చాయని చెప్పొచ్చు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	నె.ర.రే.	పా
వెస్టిండీస్	1	1	0	+5.802	2
న్యూజిలాండ్	1	1	0	+5.754	2
ఆస్ట్రేలియా	1	1	0	+1.860	2
ఇంగ్లండ్	2	1	1	+0.900	2
బంగ్లాదేశ్	1	1	0	+0.420	2
భారత్	1	1	0	+0.302	2
శ్రీలంక	2	1	1	-1.517	2
పాకిస్తాన్	2	1	1	-2.412	2
దక్షిణాఫ్రికా	3	0	3	-0.952	0
అఫ్గానిస్తాన్	2	0	2	-1.264	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఆమ్లా (సి) రోహిత్ (బి) బుమ్రా 6; డికాక్ (సి) కోహ్లి (బి) బుమ్రా 10; డు ప్లెసిస్ (బి) చహల్ 38; డసెన్ (బి) చహల్ 22; మిల్లర్ (సి అండ్ బి) చహల్ 31; డుమిని (ఎల్బీ) (బి) కుల్దీప్ 3; ఫెలుక్వాయో (స్టంప్డ్) ధోని (బి) చహల్ 34; మోరిస్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 42; రబడ (నాటౌట్) 31; తాహిర్ (సి) జాదవ్ (బి) భువనేశ్వర్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 227.**

వికెట్ల పతనం: 1-11, 2-24, 3-78, 4-80, 5-89, 6-135, 7-158, 8-224, 9-227.

బౌలింగ్: భువనేశ్వర్ 10-0-44-2; బుమ్రా 10-1-35-2; హార్దిక్ పాండ్యా 6-0-31-0; కుల్దీప్ యాదవ్ 10-0-46-1; యజువేంద్ర చహల్ 10-0-51-4; కేదార్ జాదవ్ 4-0-16-0.

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) డికాక్ (బి) రబడ 8; రోహిత్ (నాటౌట్) 122; కోహ్లి (సి) డికాక్ (బి) ఫెలుక్వాయో 18; రాహుల్ (సి) డు ప్లెసిస్ (బి) రబడ 26; ధోని (సి అండ్ బి) మోరిస్ 34; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (47.3 ఓవర్లలో 4 వికెట్లకు) 230.**

వికెట్ల పతనం: 1-13, 2-54, 3-139, 4-213.

బౌలింగ్: తాహిర్ 10-0-58-0; రబడ 10-1-39-2; మోరిస్ 10-3-36-1; ఫెలుక్వాయో 8.3-0-40-1, షమ్సీ 9-0-54-0.

పాపం దక్షిణాఫ్రికా...

ఆటగాళ్ల తప్పిదాలు, ప్రకృతి శాపాలతో ప్రపంచ కప్‌కు ఎప్పుడూ దురదృష్టాన్ని నెత్తిన పెట్టుకెళ్లే దక్షిణాఫ్రికా ఈసారి ఏకంగా ఉదాసీన తనూ మోసుకొచ్చినట్లుంది. ఆ జట్టు టోర్నీలో ఉందన్న మాటే కానీ, ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన పరిస్థితుల్లో మిగతా ఆరూ గెలిస్తే కానీ సెమీస్ చేరే అవకాశం లేదు. సఫారీలు ఇప్పుడున్న ఫామ్‌లో ఇది ఊహకు కూడా అందని విషయం. కప్‌కు ముందే ఫిలాండర్, నోర్జె దూరం కాగా, కప్ జరుగుతుండగా ప్రధాన పేసర్లు స్టెయిన్, ఇన్‌గిడి ఔటయ్యారు. ఇది డుప్లెసిస్ సేనను కోలుకోలేని దెబ్బతీసింది. అటు బ్యాటింగ్‌లోనూ పేలవ ప్రదర్శనే. నిలకడకు మారుపేరైన ఆమ్లా పనైపోయినట్లుంది. అనుభవజ్ఞులైన డుమిని, మిల్లర్‌లది సంపూర్తి వైఫల్యం. డికాక్, డుప్లెసిస్ అవసరమైన సమయంలో ఆడలేకపోయారు. మొత్తం సఫారీ ఆటగాళ్ల కళ్లలో కసి లేదు. ప్రతిష్ఠాత్మక కప్ అన్న స్పృహే వారిలో లేదు. భారత్‌తో మ్యాచ్‌లో అతి పేలవమైన వారి ఫీల్డింగ్ చూస్తేనే ఈ విషయం తెలిసిపోతోంది. బహుశా ఈ ప్రపంచ కప్‌లో సఫారీలు సెమీస్ రేస్ నుంచి పక్కకు వెళ్లిపోయినట్టే అనిపిస్తోంది.

న్యూజిలాండ్ లక్ష్యం 245



లండన్: ప్రపంచకప్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో తమకన్నా పెద్ద జట్టయిన దక్షిణాఫ్రికాపై 330 పరుగుల భారీస్కోరు చేసి గెలుపొందిన బంగ్లాదేశ్ జట్టు... రెండో మ్యాచ్‌లో అదే జోరును కనబరచలేకపోయింది. ఇక్కడి కెన్నింగ్‌టన్ ఓవల్ మైదానంలో బుధవారం న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 49.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. కెరీర్‌లో 200వ వన్డే ఆడిన సీనియర్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ (68 బంతుల్లో 64; 7 ఫోర్లు) అర్ధసెంచరీ చేయగా... మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 4 వికెట్లతో బంగ్లాదేశ్‌ను దెబ్బతీశాడు. ట్రెంట్ బౌల్ట్ 2 వికెట్లు పడగొట్టాడు. 245 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ కడపటి వార్తలందే సమయానికి 36 ఓవర్లలో 4 వికెట్లకు 177 పరుగులు చేసింది. ఓపెనర్లు మార్టిన్ గప్టిల్ (25; 3 ఫోర్లు, 1 సిక్స్), కొలిన్ మున్రో (24; 3 ఫోర్లు, 1 సిక్స్) వికెట్లను షకీబ్ తన ఖాతాలో వేసుకున్నాడు. రాస్ టేలర్ (83 బంతుల్లో 76 బ్యాటింగ్; 8 ఫోర్లు), నీషమ్ (9 బంతుల్లో 8 బ్యాటింగ్; సిక్స్) క్రీజులో ఉన్నారు.

ఫేవరెట్‌గా బరిలోకి భారత్

- నేటి నుంచి భువనేశ్వర్‌లో ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ హాకీ టోర్నీ
- ఫైనల్‌కు చేరితే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు అర్హత

భువనేశ్వర్: ఆసియా క్రీడల ద్వారా నేరుగా 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాన్ని చేజార్చుకున్న భారత్ రెండో అవకాశం కోసం సంసిద్ధమైంది. నేడు మొదలయ్యే అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో టీమిండియా అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో పూల్ 'ఎ'లో భారత్, పోలాండ్, రష్యా, ఉజ్బెకిస్తాన్... పూల్ 'బి'లో జపాన్, మెక్సికో, దక్షిణాఫ్రికా, అమెరికాలకు చోటు కల్పించారు. గురువారం తొలి మ్యాచ్‌లో రష్యాతో భారత్ ఆడుతుంది. అనంతరం 7న పోలాండ్‌తో, 10న ఉజ్బెకిస్తాన్‌తో తలపడుతుంది. ఈ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరిన రెండు జట్లు అక్టోబర్-నవంబర్‌లలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తాయి. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానంలో ఉన్న భారత్ సొంతగడ్డపై ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కొత్త కోచ్ గ్రాహమ్ రీడ్ పర్యవేక్షణలో మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా తమ స్థాయికి తగ్గట్టు ఆడితే ఫైనల్ చేరుకోవడం కష్టమేమీ కాదు.

ఆసీస్‌కు విండీస్ సవాల్

రెండో విజయంపై ఇరుజట్ల దృష్టి

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

నాటింగ్‌హామ్: ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర పోరు ప్రేక్షకులను రంజింపచేయనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, మాజీ చాంపియన్ వెస్టిండీస్‌ల మధ్య నేడు మ్యాచ్ జరుగనుంది. ఈ రెండు జట్లు ప్రపంచకప్‌లో ఇప్పటికే చెరో విజయాన్ని సాధించి ఉన్నాయి. గెలుపే లక్ష్యంగా బరిలో దిగనుండటంతో ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానంలో గురువారం పరుగుల వరద పారే అవకాశముంది. వార్నర్, స్మిత్, ఫించ్, ఖాజా, మ్యాక్స్‌వెల్‌లతో పటిష్టంగా ఉన్న ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీసేందుకు విండీస్ ఫాస్ట్ బౌలర్లు సిద్ధంగా ఉన్నారు. పాక్‌తో తొలి మ్యాచ్‌లో విండీస్ పేస్ ద్వయం జేసన్ హోల్డర్, ఒషాన్ థామస్ విజృంభించారు. దీంతో పాక్ 105 పరుగులకే కుప్పకూలింది. క్రిస్ గేల్ తొలి మ్యాచ్‌లో తన పవర్ చాటుకున్నాడు. ఆండ్రీ రసెల్, బ్రేవో, హెట్‌మైర్ బ్యాట్లను ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. అటువైపు విండీస్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఫించ్ బృందం తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొంది జైత్రయాత్ర మొదలు పెట్టింది. ఆరోన్ ఫించ్, డేవిడ్ వార్నర్ అర్ధసెంచరీలతో చెలరేగారు. అన్ని రంగాల్లో రెండు జట్లు సమ ఉజ్జీలుగా ఉన్నప్పటికీ మైదానంలో వ్యూహాలను సరిగ్గా అమలు చేసే జట్టునే విజయం వరిస్తుందని ఆసీస్ కెప్టెన్ ఫించ్ భావిస్తున్నాడు.

సాక్షి బిజినెస్

గురువారం
6-6-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
184 ▼	67 ▼
40,084	12,022

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

నాస్‌డాక్	7,552	▲ 24
డోజోన్స్	25,473	▲ 140
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,220	▲ 6
డాక్స్	11,980	▲ 10
షాంఘై	2,862	▼ 1
నికాయ్	20,776	▲ 368

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

(మంగళవారం ముగింపు)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	68.33	69.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.03	89.14
€	యూరో	ఎస్‌బీఐ	76.36	79.28
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.81	65.24
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.22	49.36
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.66	51.41
SAR	సౌదీ రియాల్	ఫామెక్స్	17.69	19.45
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామెక్స్	18.12	19.68
¥	చైనా యువాన్	ఫామెక్స్	9.40	10.76

బ్యాంకుల 'ఫిజిటల్' మంత్రం!

- ఒకవైపు డిజిటల్... మరోవైపు శాఖల విస్తరణ
- భారీ బ్రాంచ్ నెట్‌వర్క్‌తోనే ఖాతాదారులకు భరోసా
- కొత్త కస్టమర్లను చేరుకోవటానికి పోటాపోటీ
- ఏటా 400 శాఖలు ఏర్పాటు చేయనున్న యాక్సిస్
- ఈ ఏడాదిలో కొత్త శాఖలపై కసరత్తు: ఫెడరల్ బ్యాంక్

సాక్షి, బిజినెస్ విభాగం: డిజిటల్ మాధ్యమంలో ఆర్థిక లావాదేవీలు క్రమంగా ఊపందుకుంటున్నప్పటికీ.. బ్యాంకులు సంప్రదాయ బ్రాంచి బ్యాంకింగ్‌ను కూడా మరింత మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెడుతున్నాయి. ఇటు మొబైల్, డిజిటల్ అటు బ్రాంచీల సాయంతో మరింత మందికి చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విధానాన్నే ముద్దుగా ఫిజిటల్‌గా (ఫిజికల్+డిజిటల్) వ్యవహరిస్తున్నాయి. ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం కోటక్ మహీంద్రా బ్యాంకు చీఫ్ ఉదయ్ కోటక్ తొలుత చేసిన ఈ పదప్రయోగం.. నెమ్మదిగా ప్రాచుర్యంలోకి వస్తోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ మెరుగుపడటం, నెట్ అందుబాటులోకి రావడం వల్ల 2011 నుంచి మొబైల్, నెట్ బ్యాంకింగ్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. అయితే, వీటితో పాటు శాఖలు కూడా కంటి ముందు కనిపిస్తుంటే ఖాతాదారులకు బ్యాంకుపై భరోసా ఉంటోందని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటు ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు అటు ప్రైవేట్ రంగ బ్యాంకులు కూడా పోటాపోటీగా శాఖలు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నాయి. సాధారణంగా అన్ని వర్గాలకూ ఆర్థిక సేవలు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యతతో ప్రభుత్వ రంగ బ్యాంకులు విస్తృతంగా శాఖలు నిర్వహిస్తున్నాయి. ఇపుడు ప్రైవేట్ బ్యాంకులు కూడా కొత్త కస్టమర్లకు చేరువయ్యేందుకు, డిపాజిట్లను పెంచుకునేందుకు శాఖలను పెంచుకుంటున్నాయి.

డిజిటల్‌తో వినూత్న ప్రయోగాలు..

మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫాంల ద్వారా మరింత వినూత్నమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తున్నాయి. వీటికి ఖాతాదారుల నుంచి సానుకూల స్పందన కూడా వస్తోంది. అదే సమయంలో డిజిటల్‌కు సమానంగా ఫిజికల్ (భౌతికంగా) శాఖలూ ఏర్పాటు చేయాలనే అభిప్రాయం బ్యాంకింగ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. 'బ్రాంచీలు ప్రధానంగా కస్టమర్లను ఆకర్షించేందుకు ఉపయోగపడతాయి. శాఖలపరంగా భారీ నెట్‌వర్క్ ఉంటే కస్టమర్లకు భరోసా ఉంటుంది. ఇక శాఖల నెట్‌వర్క్‌కు డిజిటల్ చానల్స్ అనుబంధంగా పనిచేస్తాయి. మరింత మెరుగైన సర్వీసు అందించేందుకు, ఇంకొంత మంది కొత్త కస్టమర్స్‌కు చేరువయ్యేందుకు ఉపయోగపడతాయి. ఫెడరల్ బ్యాంక్ విషయం తీసుకుంటే శాఖల్లో జరిగే 75 శాతం పైగా లావాదేవీలు ప్రస్తుతం డిజిటల్ చానల్స్ ద్వారా జరుగుతున్నాయి. మాకు దేశవ్యాప్తంగా పటిష్టమైన శాఖల నెట్‌వర్క్ ఉంది. గడిచిన మూడేళ్లలో కొత్త శాఖలేమీ ప్రారంభించలేదు కానీ.. ఈ ఏడాదిలో దీనిపై మళ్లీ కసరత్తు చేసే అవకాశం ఉంది. ఇటు డిజిటల్‌తో పాటు అటు బ్రాంచీల తోడ్పాటుతో ఫిజిటల్ సేవలు కొనసాగిస్తాం' అని ఫెడరల్ బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (డిజిటల్ హెడ్) జితేష్ పీవీ తెలిపారు.

శాఖల్లో ఎక్స్‌పీరియన్స్‌కు ప్రాధాన్యం..

డిజిటల్, మొబైల్ మాధ్యమాలు ఉన్నప్పటికీ.. ఖాతాదారులకు ప్రత్యేక ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వటంలో బ్యాంకుల శాఖలు ముందుంటాయని ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు చీఫ్ స్ట్రాటెజీ ఆఫీసర్ ప్రకాష్ సుందరం చెప్పారు. ''సెల్ఫ్ సర్వీస్ డిజిటల్ కావొచ్చు.. అసిస్టెడ్ డిజిటల్ విధానం (బ్యాంకింగ్ సిబ్బంది సహాయంతో డిజిటల్ లావాదేవీలు నిర్వహించుకోవడం) కావొచ్చు.. శాఖ తీరు బాగుంటేనే ఆ బ్యాంకుతో లావాదేవీలు నిర్వహించేందుకు కస్టమరు ఇష్టపడతారు. కాబట్టి పరిమాణంలో చిన్నవైనా సరే శాఖల ప్రాధాన్యం తగ్గదు'' అని ప్రకాష్ సుందరం చెప్పారు. యువతరం ఎక్కువగా మొబైల్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వైపే మొగ్గు చూపుతున్నప్పటికీ.. కొంత పాత తరం 45-50 ఏళ్ల వాళ్లు ఇప్పటికీ బ్యాంకు శాఖల ద్వారా లావాదేవీలు జరిపేందుకు ఇష్టపడుతున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రత్యేకంగా లాకరు సదుపాయం, వ్యక్తిగత ఆర్థిక సేవలు కోరుకునే సంపన్న వర్గాలకు కూడా బ్యాంకు శాఖలు అవసరమని ప్రకాష్ చెప్పారు.

యాక్సిస్ ఏటా 400 శాఖలు..

వినూత్న డిజిటల్ సేవలు ఆవిష్కరించడంతో పాటు మరిన్ని శాఖల ఏర్పాటుపై దృష్టి పెడుతున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఎండీ అమితాబ్ చౌదరి చెప్పారు. ఏటా 400 శాఖలు కొత్తగా ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం శాఖల సంఖ్య 5,500కు చేరే దాకా ఇదే విధానం కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యాక్సిస్ ఈ ఏడాది మార్చిలో తమ 4,000వ శాఖను ఏర్పాటు చేసింది. ఆర్‌బీఎల్ వంటి చిన్న బ్యాంకులు కూడా శాఖలను పెంచుకుంటున్నాయి. 2018 మార్చి ఆఖరు నాటికి 265గా ఉన్న ఆర్‌బీఎల్ బ్రాంచీల సంఖ్య 2019 మార్చి 31 నాటికి 324కి పెరిగింది. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇటీవల ఫిబ్రవరిలోనే తమ 5,000వ బ్రాంచీని ప్రారంభించింది. అయితే, బ్రాంచీల నెట్‌వర్క్‌పరంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులదే (పీఎస్‌బీ) ఆధిపత్యం ఉంటోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం గతేడాది జూన్ ఆఖరు నాటికి పీఎస్‌బీ శాఖల సంఖ్య 90,821గా ఉంది. అదే ప్రైవేట్ బ్యాంకుల శాఖల సంఖ్య 28,805కి పరిమితమైంది.

గత కేటాయింపులే బడ్జెట్‌లో కొనసాగింపు..

వివిధ శాఖలకు ఆర్థిక శాఖ సర్క్యులర్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మధ్యంతర బడ్జెట్‌లో వివిధ శాఖలకు జరిపిన కేటాయింపులనే వచ్చే నెల ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్లోనూ కొనసాగించవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ సూచనప్రాయంగా వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తెలిసిందే. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ జూలై 5న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలకు ఆర్థిక శాఖ సర్క్యులర్ జారీ చేసింది. మధ్యంతర బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకోకుండా పక్కన పెట్టిన వాటికి అవసరమైతేనే అదనపు కేటాయింపులు పరిశీలిస్తామని స్పష్టం చేసింది. '2019-20 మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనల్లో మార్పులుండవు' అని సర్క్యులర్‌లో ఆర్థిక శాఖ పేర్కొంది. కొత్తగా ఏర్పాటైన 17వ లోక్‌సభ.. జూన్ 17 నుంచి జూలై 26 దాకా సమావేశం కానుంది. జూలై 4న 2019-20 ఆర్థిక సర్వేను, ఆ మరుసటి రోజు 5వ తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం, బ్యాంకుల మొండి బాకీలు .. ఎన్‌బీఎఫ్‌సీల నిధులపరమైన సమస్యలు, ఉపాధి కల్పన, ప్రైవేట్ పెట్టుబడులు, ఎగుమతుల పునరుద్ధరణ, వ్యవసాయ రంగ సమస్యలు, ఆర్థిక క్రమశిక్షణ తప్పకుండా ప్రభుత్వ పెట్టుబడులు పెంచడం తదితర సవాళ్లు నిర్మలా సీతారామన్ ముందు ఉన్నాయి.

ఎగవేతదారుగా దిఘి పోర్ట్ చీఫ్ విజయ్

రూ. 3,334 కోట్ల రుణాల డిఫాల్ట్

న్యూఢిల్లీ: నీరవ్ మోదీ, విజయ్ మాల్యా కుంభకోణాలను తలపించే మరో కేసు వెలుగులోకి వచ్చింది. దిఘి పోర్ట్ చైర్మన్ విజయ్ గోవర్ధన్‌దాస్ కలాంత్రి, ఆయన కుమారుడు.. కంపెనీ డైరెక్టరు విశాల్ కలాంత్రిలను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ప్రకటించింది. పోర్టు అభివృద్ధి పేరిట వీరు బ్యాంక్ ఆఫ్ ఇండియా సారథ్యంలోని 16 బ్యాంకుల కన్సార్షియం నుంచి వీరు దాదాపు రూ. 3,334 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దిఘి పోర్ట్, విశాల్ కలాంత్రి, విజయ్ కలాంత్రిలను విజయా బ్యాంక్ (ప్రస్తుతం బీవోబీలో విలీనమైంది) ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ప్రకటించినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా బహిరంగ ప్రకటనలో పేర్కొంది. ఇటీవలే దిఘి పోర్ట్‌పై దివాలా ప్రక్రియ పిటీషన్‌ను ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ విచారణకు స్వీకరించింది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	33,080	0
బంగారం (22 క్యారెట్లు)	31,500	0
వెండి (కిలో)	40,000	▲ 400
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	32,720	▲ 200
బంగారం (22 క్యారెట్లు)	31,160	▲ 190
వెండి (కిలో)	40,000	▲ 400
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	32,720	▲ 200
బంగారం (22 క్యారెట్లు)	31,160	▲ 190
వెండి (కిలో)	40,000	▲ 400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,500	▲ 400
బంగారం (22 క్యారెట్లు)	31,160	▲ 370
వెండి (కిలో)	38,000	▼ 500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,690	▲ 210
బంగారం (22 క్యారెట్లు)	31,160	▲ 190
వెండి (కిలో)	40,000	▲ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

కోడిగుడ్లు

(హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 6-6-2019

విశాఖ	335-00
చిత్తూరు	378-00
వరంగల్	333-00
చెన్నై	385-00
ముంబై	385-00
విజయవాడ	325-00
నమక్కల్	375-00
గోదావరి	325-00
5-6-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	330-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365-00
కోల్‌కతా	358-00
ఢిల్లీ	320-00

విప్రో చేతికి అమెరికా కంపెనీ!

- ఐటీఐను చేజిక్కించుకుంటున్న విప్రో
- డీల్ విలువ రూ.312 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ టెక్నీ గ్రూప్ ఇన్‌కార్పొను (ఐటీఐ) కొనుగోలు చేయనున్నది. కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ అండ్ ప్రొడక్ట్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్ ఇంటెరోపెరాబిలిటీ సాఫ్ట్‌వేర్ సేవలందించే ఐటీఐను రూ.312 కోట్ల(4.5 కోట్ల డాలర్లు)కు కొనుగోలు చేయనున్నామని విప్రో తెలిపింది. 1983లో ఆరంభమైన ఐటీఐ అమెరికాలోని ఓహియో కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇంగ్లాండ్, ఇటలీ, ఇజ్రాయేల్, జర్మనీల్లో ఈ కంపెనీకి కార్యాలయాలున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి ఈ కంపెనీలో మొత్తం 130 మంది ఉద్యోగులున్నారు. కంపెనీ ఆదాయం గత ఏడాది జూన్ 30 నాటికి 2.32 కోట్ల డాలర్లుగా ఉంది.

సెప్టెంబర్ కల్లా డీల్ పూర్తి !

ఐటీఐ కొనుగోలుతో డిజిటల్ ఇంజినీరింగ్ మాన్యుఫాక్చరింగ్‌లో మరింత శక్తివంతమవుతామని విప్రో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఇండస్ట్రియల్ అండ్ ఇంజినీరింగ్ సర్వీసెస్) హర్మీత్ చౌహన్ పేర్కొన్నారు. ఈ డీల్‌కు నియంత్రణ సంస్థల ఆమోదాలు పొందాల్సి ఉందని, ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ఈ డీల్ పూర్తవ్వగలదని అంచనా వేస్తున్నామన్నారు.

బీఎండబ్ల్యూతో జట్టుకట్టిన జేఎల్ఆర్

- ఎలక్ట్రిక్ కార్ల టెక్నాలజీలో పరస్పర సహకారం

న్యూఢిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్).. జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యూతో జట్టుకట్టింది. ఎలక్ట్రిక్ కార్ల టెక్నాలజీ అభివృద్ధి కోసం ఈ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు బుధవారం వెల్లడించింది. నూతనతరం ఎలక్ట్రిక్ టెక్నాలజీ సహకారంలో భాగంగా ఇరు సంస్థలు.. పరిశోధన, అభివృద్ధి, ఇంజినీరింగ్‌లో సంయుక్తంగా పెట్టుబడి పెడతాయి. ఈ అంశంపై వివరణ ఇచ్చిన జేఎల్ఆర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ నిక్ రోగర్స్.. 'తరువాతి తరం ఈడీయూ (విద్యుత్ డ్రైవ్ యూనిట్స్) అవసరం ఇరు సంస్థలకూ ఉందనేది బీఎండబ్ల్యూ డైరెక్టర్లతో చర్చించాక మాకు స్పష్టమైంది. రెండు కంపెనీలకు ఈ భాగస్వామ్యం పరస్పర ప్రయోజనం అందిస్తుంది' అని చెప్పారు. ప్రీమియం బ్యాటరీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ జాగ్వర్ ఐ-పేస్, ప్లగ్ ఇన్ హైబ్రిడ్ మోడల్స్‌ను ఇప్పటికే ప్రదర్శించిన జేఎల్ఆర్.. ఎలక్ట్రిక్ కార్ రంగంలో తన ఉనికిని చాటిచెప్పిన విషయం తెలిసిందే. కాగా, 2013లోనే ఐ3 విడుదలతో బీఎండబ్ల్యూ ఈ విభాగంలో సత్తాచాటింది.

సుందర్ పిచాయ్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

వాషింగ్టన్: గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్‌కు అరుదైన గౌరవం దక్కింది. టెక్నాలజీ రంగంలో ఈయన చేసిన విశిష్ట సేవలను గుర్తించిన అమెరికా-భారత వాణిజ్య మండలి (యూఎస్ఐబీసీ).. ప్రతి ఏడాది ఇచ్చే గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డుకు పిచాయ్‌ను ఎంపికచేసినట్లు ప్రకటించింది. ఈయనతో పాటు నాస్‌డాక్ ప్రెసిడెంట్ అడెనా ఫ్రైడ్‌మాన్ పేరును ప్రకటించిన యూఎస్ఐబీసీ.. ఇరువురి నేతృత్వంలోని కంపెనీలు, అంతర్జాతీయ టెక్నాలజీ రంగ ప్లాట్‌ఫాంను ఏర్పాటుచేయడంలో తమవంతు కృషిచేసినట్లు కొనియాడింది. ఇరు సంస్థల కారణంగా భారత్, అమెరికా మధ్య వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యం గడిచిన ఐదేళ్లలో 150 శాతం పెరిగి గతేడాదినాటికి 142.1 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలిపింది. ఇక వచ్చేవారం జరగనున్న ఇండియా ఐడియాస్ సదస్సులో ఇరువురికి అవార్డులను అందించనున్నట్లు వెల్లడించింది.

వచ్చే ఆరేళ్లలో 8.8 కోట్లకు 5జీ కనెక్షన్లు..!

జీఎస్ఎంఏ అంచనా

న్యూఢిల్లీ: భారత మొబైల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025 నాటికి 92 కోట్లకు చేరనుందని గ్లోబల్ టెలికం పరిశ్రమ సమాఖ్య (జీఎస్ఎంఏ) అంచనావేసింది. ఇదేసమయంలో 5జీ కనెక్షన్లు 8.8 కోట్లకు చేరనున్నట్లు పేర్కొంది. 2018 చివరినాటికి మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 75 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ఈ రంగ ఆదాయం 2016 నుంచి 20 శాతం తగ్గిపోయినట్లు వెల్లడించింది.

సేవల రంగం వృద్ధి ఏడాది కనిష్టానికి

- మేలో 50.2 పాయింట్లకు నికాయ్ ఇండియా పీఎంఐ సూచీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, కొత్త ఆర్డర్ల రాక తగ్గడం తదితర అంశాల కారణంగా గత నెల దేశీయంగా సేవల రంగం కార్యకలాపాల వృద్ధి ఏడాది కనిష్టానికి పడిపోయింది. దీనికి కొలమానంగా పరిగణించే నికాయ్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ పీఎంఐ సూచీ మే లో 50.2 పాయింట్లకు తగ్గింది. ఏప్రిల్‌లో ఇది 51.0గా ఉంది. గడిచిన పన్నెండు నెలల్లో ఇంత తక్కువ స్థాయి వృద్ధి నమోదు కావడం ఇదే ప్రథమం. అయితే, మందగమనంలో ఉన్నప్పటికీ సేవల రంగం పీఎంఐ వరుసగా 12వ నెలా వృద్ధి బాటలోనే కొనసాగడం గమనార్హం. పీఎంఐ పరిభాషలో సూచీ 50 పాయింట్లకు పైగా ఉంటే వృద్ధిని, దానికన్నా తక్కువగా ఉంటే సంకోచాన్ని సూచిస్తుంది. ఎన్నికలపరమైన అవరోధాలు, వరుసగా మూడో నెలలోనూ కొత్త వర్క్ ఆర్డర్ల రాక .. వ్యాపార కార్యకలాపాలు మందగించడంతో భారత సేవల రంగం వృద్ధి మే లో నెమ్మదించిందని సూచీ నిర్వహించే ఐహెచ్ఎస్ మార్కిట్ సంస్థ ప్రిన్సిపల్ ఎకానమిస్ట్, నివేదిక రూపకర్త పోల్యానా డిలిమా పేర్కొన్నారు.

తాత్కాలికమే..

కంపెనీలు మళ్లీ నియామకాలను పెంచుకుంటుండటం, భవిష్యత్ అవకాశాలపై విశ్వాసంగా ఉండటం వంటి అంశాలు బట్టి చూస్తుంటే మందగమనం తాత్కాలికమే కావొచ్చని లిమా అభిప్రాయపడ్డారు. మరోవైపు ఇటు తయారీ అటు సేవల రంగం తీరుతెన్నులను ప్రతిఫలించే నికాయ్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ సూచీ మే లో 51.7 పాయింట్లుగా నమోదైంది. ఏప్రిల్‌తో పోలిస్తే పెద్దగా మారలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, పాలసీ ఎజెండాల అమలు మళ్లీ ప్రారంభం కావడం వంటి అంశాల కారణంగా 2019 ద్వితీయార్ధం నుంచి ఎకానమీ రికవరీ బాట పట్టొచ్చని లిమా తెలిపారు.

కస్టమర్ల నమ్మకం మూడు కంపెనీల మీదే!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైక్రోసాఫ్ట్, డాక్టర్ రెడ్డీస్, అమెరాన్‌లు హైదరాబాద్ నుంచి అత్యుత్తమ నమ్మకమైన బ్రాండ్స్‌గా ఎంపికయ్యాయి. ఈ మేరకు బ్రాండ్ ఇంటెలిజెన్స్ అండ్ డాటా ఇన్‌సైట్స్ కంపెనీ టీఆర్ఏ రీసెర్చ్ బ్రాండ్ ట్రస్ట్ రిపోర్ట్-2019 తెలిపింది. కన్స్యూమర్ ప్రభావిత అంశాలను పరిగణనలోకి తీసుకొని బ్రాండ్స్‌ను ఎంపిక చేసినట్లు టీఆర్ఏ తెలిపింది. దేశంలోని టాప్-1000 బ్రాండ్స్‌లో హైదరాబాద్ నుంచి కేవలం మూడు కంపెనీలు మాత్రమే నిలిచాయి. కాగా బెంగళూరు నుంచి 26 బ్రాండ్స్, చెన్నై నుంచి 14 బ్రాండ్స్ ఉన్నాయి. డెల్ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా టీఆర్ఏ సీఈఓ ఎన్ చంద్రమౌళి మాట్లాడుతూ.. ''వ్యాపార రంగంలో హైదరాబాద్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. పైగా ఇక్కడ ఐకానిక్ బ్రాండ్స్ ఉన్నాయి. ఏదేమైనా సిటీ బ్రాండ్స్ కస్టమర్ల పట్ల మరింత నమ్మకాన్ని పెంచుకొని జాతీయ స్థాయిలో బ్రాండ్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని'' సూచించారు.

2025 నాటికి కోటి టన్నుల ఉత్పత్తి

- కొత్త ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులొచ్చాయి
- కావాల్సిన ఎక్విప్‌మెంట్‌కు ఆర్డర్లు పూర్తయ్యాయి
- 'సాక్షి'తో సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సిమెంటు తయారీ సంస్థ సాగర్ సిమెంట్స్ భారీగా విస్తరిస్తోంది. 2025 నాటికి వార్షిక తయారీ సామర్థ్యాన్ని 10 మిలియన్ టన్నులకు (కోటి టన్నులకు) చేర్చాలని లక్ష్యంగా చేసుకుంది. ప్రతి 10 ఏళ్లకు సామర్థ్యాన్ని రెండింతలు చేయాలన్నది సంస్థ ధ్యేయం. ప్రస్తుతం ఉన్న మూడు ప్లాంట్లతో కలిపి సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 5.75 మిలియన్ టన్నులు. తాజా విస్తరణలో భాగంగా మధ్యప్రదేశ్, ఒడిశాలో ఏర్పాటు చేయనున్న రెండు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను దక్కించుకుంది. ఈ నెలలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాల కాలుష్య నియంత్రణ మండలి నుంచి క్లియరెన్సులు రానున్నట్లు సాగర్ సిమెంట్స్ జేఎండీ సమ్మిడి శ్రీకాంత్ రెడ్డి సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ఇవి పూర్తి అయితే తయారీ సామర్థ్యం 8.25 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని, విస్తరణకు కావాల్సిన నిధుల కోసం ఒక్కొక్కటి రూ.725 ధరలో 31,00,000 కన్వర్టబుల్ వారంట్లను జారీ చేస్తామని తెలిపారు.

2021 మార్చికల్లా పూర్తి..

కంపెనీ ఒక మిలియన్ టన్ను సామర్థ్యం గల ప్లాంటును మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వద్ద ఏర్పాటు చేస్తోంది. వ్యర్థాల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే 5.5 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును సైతం నిర్మిస్తోంది. వీటి కోసం రూ.425 కోట్లు వెచ్చిస్తారు. ఇందులో ఈక్విటీ రూ.150 కోట్లు ఉంటుంది. ఇక ఒడిశాలోని జాజ్‌పూర్ వద్ద ఉన్న జాజ్‌పూర్ సిమెంట్స్‌ను(జేసీపీఎల్) ఇటీవలే రూ.108 కోట్లు వెచ్చించి సాగర్ సిమెంట్స్ దక్కించుకుంది. 100 శాతం అనుబంధ సంస్థగా ఉండే జాజ్‌పూర్ సిమెంట్స్ ద్వారా రూ.308 కోట్లతో 1.5 మిలియన్ టన్నుల గ్రైండింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిపాదిత కొత్త ప్రాజెక్టుల కోసం యంత్రాలకై ఆర్డర్లు ఇచ్చామని, డెన్మార్క్, జర్మనీకి చెందిన దిగ్గజ కంపెనీలు వీటిని సరఫరా చేస్తాయని చెప్పారాయన. 2021 మార్చికల్లా నిర్మాణాలు పూర్తి అవుతాయని శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు.

కొత్త మార్కెట్లకు..

సాగర్ సిమెంట్స్ ప్రస్తుతం దక్షిణాది మార్కెట్లతో పాటు మహారాష్ట్ర, ఒడిశాలో విస్తరించింది. ఇండోర్ ప్లాంటు పూర్తయితే పశ్చిమ మధ్యప్రదేశ్, ఆగ్నేయ రాజస్థాన్, తూర్పు గుజరాత్, ఉత్తర మహారాష్ట్రలో అడుగు పెట్టేందుకు మార్గం సుగమమవుతుంది. ఇండోర్, వడోదర, భోపాల్, అహ్మదాబాద్ నగరాలు 110 నుంచి 330 కిలోమీటర్ల పరిధిలో ఉండడం కలిసొచ్చే అంశం. అలాగే ఒడిశా ప్లాంటు రాకతో ఉత్తర, మధ్య ఒడిషా, తూర్పు ఛత్తీస్‌గఢ్, దక్షిణ జార్ఖండ్, దక్షిణ పశ్చిమ బెంగాల్‌లో సిమెంటు మార్కెట్ చేసేందుకు వీలవుతుంది. భువనేశ్వర్, కటక్, బాలాసోర్, కోల్‌కతా, రాంచి, జంషెడ్‌పూర్ పట్టణాలను కవర్ చేయవచ్చునని కంపెనీ భావిస్తోంది.

రెండేళ్లుగా ధర పెంచలేదు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

ప్లాస్టిక్ వ్యర్థాలే స్కూలు ఫీజు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు అస్సాం దిస్‌పూర్‌లోని అక్షర్ ఫోరం స్కూలు వినూత్న పథకాన్ని ప్రారంభించింది. తమ స్కూలు విద్యార్థులు ఫీజుకు బదులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఇవ్వాలని ఆదేశించింది. ప్రతి విద్యార్థి ప్రతీవారం కనీసం 20 పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు తెచ్చివ్వాలని, అలా తెస్తే వారికి ఉచితంగా చదువు చెప్తామని ప్రకటించింది. దీంతో విద్యార్థులు తమ ఇళ్లు లేదా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తెచ్చి స్కూల్లో ఇస్తున్నారు. కిందటేడాది వరకు ఈ స్కూల్లో ఉచితంగానే చదువు చెప్పేవారు. అయితే, ఈ సంవత్సరం నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు తెస్తేనే ఉచితంగా చదువు చెబుతామని స్కూలు యాజమాన్యం స్పష్టం చేసింది. పిల్లల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిలింగ్ చేసి ఉపయోగిస్తున్నట్టు స్కూలు యాజమాన్యం తెలిపింది. విద్యార్థుల చేత ప్లాస్టిక్ సీసాల్లో ప్లాస్టిక్ కవర్లను నింపిస్తున్నారు. దాంతో అవి పర్యావరణానుకూల ఇటుకలుగా(ఎకో బ్రిక్స్) తయారవుతున్నాయి. ఇలా చేసినందుకు విద్యార్థులకు కొంత సొమ్ము కూడా చెల్లిస్తున్నారు. ఈ ప్లాస్టిక్ ఇటుకలతో స్కూలు భవనాలు, మరుగుదొడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు.

కన్ను కొట్టిన కెమిల్లా!

ప్రియా వారియర్.. రాహుల్ గాంధీ.. తాజాగా బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్ భార్య కెమిల్లా పార్కర్ కన్ను కొట్టి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారారు. బ్రెగ్జిట్ నేపథ్యంలో బ్రిటన్‌తో సంబంధాలు బలోపేతానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన భార్య మెలానియా లండన్‌కి వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్స్ చార్లెస్ వారికి ఆతిథ్యమిచ్చారు. వారితో కలసి ఫొటో దిగాక చార్లెస్ భార్య కెమిల్లా పార్కర్..ట్రంప్ వెనుక నడుస్తూ పక్కకి తిరిగి కన్ను కొట్టారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఆమె ఎందుకు కన్ను గీటారనేది అర్థం కాని విషయంగా మిగిలింది. బ్రిటన్ రాజకుటుంబీకురాలు కెమెరాల సాక్షిగా కన్ను కొట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎవరికి తోచిన విధంగా వారు కారణాలు చెబుతున్నారు. మలయాళీ కుట్టి ప్రియా వారియర్ ఓ సినిమా కోసం కన్ను కొట్టే ఒకే ఒక్క సీన్ దేశం మొత్తాన్ని ఊపేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గత ఏడాది పార్లమెంటులో అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీని కౌగిలించుకొని వచ్చి తన సీట్లో కూర్చొని జ్యోతిరాదిత్య సింధియావైపు చూస్తూ కన్ను కొట్టడం కూడా చర్చనీయాంశమయ్యింది.

10% తగ్గిన హెచ్1బీ వీసాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న కఠినమైన వలస విధానం దెబ్బ హెచ్-1బీ వీసాల జారీపై గణనీయమైన ప్రభావం చూపిస్తోంది. అత్యంత నైపుణ్యం కలిగిన భారత్, ఇతర విదేశీ ఐటీ నిపుణులకు అమెరికాలో ఉద్యోగానికి వీలు కల్పించే ఈ వీసాల జారీ బాగా తగ్గిపోయింది. అంతకుమందు ఏడాదితో పోలిస్తే 2018 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం మేర తగ్గింది. అమెరికా పౌరసత్వ, వలస సర్వీసుల సంస్థ (యూఎస్‌సీఐఎస్) 2018లో కొత్త వీసాలు, రెన్యువల్స్ కలిపి మొత్తం 3,35,000 హెచ్1బీలపై ఆమోద ముద్ర వేసింది. 2017లో 3,73,400 వీసాలిచ్చారు. 2017లో ప్రతి 100 దరఖాస్తులకు 93 వీసాలు మంజూరైతే, 2018లో ప్రతి 100 దరఖాస్తులకు 85 వీసాలు మంజూరయ్యాయి. అమెరికాలో విదేశీ వర్కర్లు పని చెయ్యాలంటే హెచ్1బీ వీసా తప్పనిసరి. హెచ్1 బీ వీసా నిబంధనల్ని అతిక్రమించే సంస్థల చుట్టూ ట్రంప్ ఉచ్చు బిగించారు. అమెరికా పౌరులకు ఉద్యోగాలు నిరాకరించే ఐటీ కంపెనీలపై ట్రంప్ గుర్రుగా ఉన్నారు. అమెరికా వర్కర్లకు అత్యధికంగా వేతనాలు చెల్లించేలా, వారికి ఆర్థిక భరోసా కల్పించేలా నిబంధనల్ని మార్చేశారు. దీంతో వీసాల సంఖ్య తగ్గిపోయింది.

నళిన్ టాపర్ అని తెలిశాక జైపూర్‌లో కొడుకుతో కలసి సంబరాలు చేసుకుంటున్న తల్లిదండ్రులు

నీట్ టాపర్ నళిన్

- రాజస్థాన్ విద్యార్థికి ప్రథమ ర్యాంకు
- తెలంగాణ అమ్మాయి మాధురికి బాలికల్లో టాప్ ర్యాంకు

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)-2019 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. గత నెల 5వ, 20వ తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షలో రాజస్థాన్‌కు చెందిన నళిన్ ఖండేల్వాల్ తొలి ర్యాంకును సొంతం చేసుకున్నారు. మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహించగా, నళిన్ 701 మార్కులు సాధించారు. అలాగే ఢిల్లీకి చెందిన భవిక్ బన్సల్ రెండో ర్యాంకు, ఉత్తర ప్రదేశ్ విద్యార్థి అక్షత్ కౌశిక్ మూడో ర్యాంకు పొందారు. పరీక్షలో అన్ని సబ్జెక్టులను కలిపి చూసినప్పుడు వీరిద్దరికీ సమానంగా 700 మార్కులే వచ్చినప్పటికీ, జీవశాస్త్రంలో కౌశిక్ కన్నా భవిక్‌కు ఎక్కువ మార్కులు రావడంతో రెండో ర్యాంకును భవిక్‌కు కేటాయించారు. ఇక అమ్మాయిల వరకు చూస్తే తెలంగాణకు చెందిన జి.మాధురీ రెడ్డి టాపర్‌గా నిలిచారు. 695 మార్కు లతో అఖిల భారత స్థాయిలో ఆమె ఏడవ ర్యాంకు సాధించారు. వికలాంగుల కేటగిరీలో రాజస్థాన్‌కు చెందిన భేరారాం 604 మార్కులతో తొలి ర్యాంకు సాధించారు. నీట్‌లో టాప్-10లో నాలుగు ర్యాంకులు రాజస్థాన్ వాళ్లకు, టాప్-50లో 9 ర్యాంకులు ఢిల్లీ వాళ్లకు దక్కాయి. ఢిల్లీ నుంచి పరీక్షకు హాజరైన వారిలో 74.9 శాతం మంది అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా చూస్తే అర్హత సాధించిన వారి శాతం 56.5 మాత్రమే కావడం గమనార్హం. భవిక్‌కు రెండో ర్యాంకు రాగా, 695 మార్కులు సాధించిన మిహిర్ రాయ్‌కి 9వ ర్యాంకు దక్కింది. 685 మార్కులు తెచ్చుకున్న విశ్వ రాకేశ్ 38వ ర్యాంకును పొందారు.

రెండో ర్యాంకర్ భవిక్ బన్సల్

కామెడీ వీడియోలు చూసేవాణ్ని: భవిక్

దీర్ఘకాలంపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన తర్వాత ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం తాను యుట్యూబ్‌లో స్టాండప్ కామెడీ వీడియోలు చూసేవాడినని నీట్ ద్వితీయ ర్యాంకర్ భవిక్ బన్సల్ చెప్పాడు. ఫలితాల్లో టాప్-10లో ఏదో ర్యాంకు వస్తుందని తాను అనుకున్నాననీ, కానీ రెండో ర్యాంకు వస్తుందని అస్సలు ఊహించలేదని భవిక్ ఆశ్చర్యంతో అన్నాడు. తాను ఇంట్లోనే కూర్చొని నీట్‌కు చదువుకున్నాననీ, తన తల్లిదండ్రులు తనను బాగా ప్రోత్సహించి, మద్దతుగా నిలిచారని తెలిపాడు. భవిక్ తల్లిదండ్రులిద్దరూ ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులే. తండ్రి అకౌంట్స్ ఆఫీసర్ కాగా, తల్లి భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు. ఇంటర్నేషనల్ బయాలజీ ఒలింపియాడ్‌లో పాల్గొనేందుకు భవిక్ ప్రస్తుతం ముంబైలో ఉన్నారు. ఈ పోటీలో టాప్-35లో నిలిస్తే హంగేరీలో జరిగే పోటీకి భారత్ నుంచి భవిక్ వెళ్తాడు.

అభినందనలు తెలిపిన హెచ్‌ఆర్డీ మంత్రి

నీట్‌లో అగ్ర ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్ అభినందనలు తెలిపారు. ఫలితాలు వెలువడిన తర్వాత టాప్ ర్యాంకర్లకు పోఖ్రియాల్ ఫోన్ చేసి మాట్లాడారు. ర్యాంకుల కోసం కృషి చేసిన ఆ విద్యార్థులను ప్రశంసించి, వారికి పోఖ్రియాల్ అభినందనలు తెలిపారు.

ఢిల్లీ టాప్.. నాగాలాండ్ లాస్ట్

నీట్-2019లో మెరుగ్గా రాణించిన తొలి పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ర్యాంకులు ఇవీ..

1. ఢిల్లీ (74.9 శాతం)
2. హరియాణా (73.4 శాతం)
3. చండీగఢ్ (73.2 శాతం)
4. ఆంధ్రప్రదేశ్ (70.7 శాతం)
5. రాజస్థాన్ (69.6 శాతం)
6. పంజాబ్
7. తెలంగాణ
8. కేరళ
9. మణిపూర్
10. హిమాచల్‌ప్రదేశ్

కుటుంబ సహకారంతోనే ఈ ర్యాంకు: నళిన్

నీట్‌లో తొలి ర్యాంకు సాధించిన నళిన్ ఖండేల్వాల్ రాజస్థాన్‌లోని సికార్ జిల్లాకు చెందిన విద్యార్థి. ఫలితాల ప్రకటన అనంతరం అతను మాట్లాడుతూ పూర్తిగా తన కుటుంబ సహకారంతోనే తాను నీట్‌లో తొలి ర్యాంకును సొంతం చేసుకోగలిగానని నళిన్ ఖండేల్వాల్ చెప్పాడు. 'మా అమ్మానాన్నలిద్దరూ డాక్టర్లే. మా అన్న కూడా ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఈ పరీక్ష కోసం రెండేళ్లపాటు జైపూర్‌లో ఉండి పూర్తి శ్రద్ధతో కష్టపడి చదివాను. ఆ రెండేళ్ల కాలంలో సామాజిక మాధ్యమాలు, స్మార్ట్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉన్నాను. నా కుటుంబం నుంచి, మా టీచర్ల నుంచి నాకు పూర్తిస్థాయిలో సహకారం లభించింది. రోజుకు దాదాపు ఎనిమిది గంటలు చదివే వాణ్ని' అని నళిన్ చెప్పారు. జైపూర్‌లోని అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్‌లో అతను నీట్ కోచింగ్ తీసుకున్నాడు. కోట పట్టణంలోని ఇదే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు సైతం ఐదవ, పదవ ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

నీట్-2019 విశేషాలు..

- మొత్తం 154 నగరాల్లోని 2,546 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు.
- 11 భాషల్లోని ఏదో ఒక భాషలో పరీక్ష రాసేలా విద్యార్థులకు అవకాశం కల్పించారు.
- నీట్ పరీక్షకు మొత్తంగా 14,10,755 మంది హాజరయ్యారు. 1,08,015 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 7,97,042 మంది (దాదాపు 56.5 శాతం మంది) అర్హత సాధించారు.
- పరీక్ష రాసిన అమ్మాయిల్లో 57.1 శాతం మంది, అబ్బాయిల్లో 55.7 శాతం మంది ప్రవేశాలకు అర్హత సాధించారు. ఐదుగురు హిజ్రాలు కూడా పరీక్ష రాయగా, వారిలో ముగ్గురు ప్రవేశాలకు అర్హత పొందారు.
- 315 మంది విదేశీయులు, 1,209 మంది ఎన్ఆర్ఐలు, 441 మంది ఓసీఐ (ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ ఆఫ్ ఇండియా) హోదా కలిగిన వారు, 46 మంది పీఐవో (పర్సన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్)లు నీట్‌లో అర్హత సాధించిన వారిలో ఉన్నారు.
- 79.3 శాతం మంది నీట్‌ను ఇంగ్లిష్‌లో, 11.8% మంది హిందీలో, 8.9 శాతం మంది ఇతర ప్రాంతీయ భాషల్లో నీట్ రాశారు.

ఖర్టౌమ్‌లో ఆర్మీ కార్యాలయం వద్ద నినాదాలిస్తున్న ఆందోళనకారుడు

సూడాన్‌లో 101 మంది మృతి

ఖర్టౌమ్: సూడాన్ రాజధాని ఖర్టౌమ్‌లో మిలిటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టినవారిపై జరిపిన కాల్పుల్లో 101 మంది ప్రాణాలు కోల్పోయారు. వంద మందికిపైగా గాయాలపాలయ్యారు. గాయపడిన వారికి వైద్యం చేసేందుకు ఖర్టౌమ్‌లోని ఆసుపత్రుల్లో తగినంత మంది వైద్య సిబ్బందిగానీ, సదుపాయాలు గానీ అందుబాటులో లేవు. సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్-బషీర్ నియంతృత్వ పాలనపై నెలల తరబడి ఆందోళనలు జరుగుతుండగా, ఆ దేశ మిలిటరీ ఈ ఏడాది ఏప్రిల్‌లో బషీర్‌ను పదవి నుంచి దింపేసింది. మరో మూడేళ్లలో పౌర పాలన మళ్లీ మొదలయ్యేలా ఓ ఒప్పందం కుదిరింది. అప్పటివరకు దేశ పాలనకు మిలిటరీ కౌన్సిల్ ఏర్పాటైంది. ఈ కౌన్సిల్ పాలనను వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా అనేక మంది ఆర్మీ ప్రధాన కార్యాలయం బయట నిరసనలు తెలుపుతుండగా, సోమ, మంగళ వారాల్లో ఆ నిరసనకారులను అణచివేసేందుకు ఆర్మీ కాల్పులకు దిగింది. ఆసుపత్రుల్లోనూ వైద్యులు, ఇతర సిబ్బందిపై సూడాన్ భద్రతా దళాలు దాడులు చేస్తున్నాయని వైద్యుల సంఘం ఆరోపించింది. కాల్పుల ఘటనలను ఖండించి, ఆందోళనకారులకు, మిలిటరీకి మధ్య సయోధ్య కుదర్చాలంటూ ఐక్యరాజ్యసమితికి వచ్చిన ఓ తీర్మానాన్ని చైనా, రష్యాలు అడ్డుకున్నాయి. 8 యూరప్ దేశాలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేస్తూ కాల్పులను ఖండించాయి. కాల్పుల ఘటనల్లో 101 మంది చనిపోవడంతో మిలిటరీతో చర్చలు జరిపేందుకు నిరసనకారులు నిరాకరించారు. 101లో 40 మంది మృతదేహాలు నైలునదిలో లభించాయి.

రూ.15 లక్షల కోట్లతో జాతీయ రహదారులు

- విద్యుత్ గ్రిడ్ తరహాలో రహదారుల గ్రిడ్
- ఖాదీ, లఘు ఉత్పత్తులకు మార్కెట్ కల్పిస్తాం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వంలో రెండో సారి మంత్రి అయిన నితిన్ గడ్కరీ తన మంత్రిత్వ శాఖలైన జాతీయ రహదారులు, సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)కు సంబంధించి బృహత్ ప్రణాళికలను ప్రకటించారు. రూ.15 లక్షల కోట్లతో జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఖాదీ, ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ కల్పించడం ద్వారా స్థూల జాతీయోత్పత్తిని (జీడీపీ)ని పెంచుతామన్నారు. 22 హరిత ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతోపాటు రూ.15 లక్షల కోట్లతో జాతీయ రహదారుల ప్రాజెక్టులు చేపట్టనున్నారు. అర్ధంతరంగా నిలిచిపోయిన రహదారి ప్రాజెక్టులను వచ్చే వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు గడ్కరీ వివరించారు. విద్యుత్ గ్రిడ్ తరహాలో రహదారుల గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

వచ్చే సమావేశాల్లో మోటారు వాహనాల బిల్లు

వచ్చే పార్లమెంటు సమావేశాల్లో మోటారు వాహనాల సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు మంత్రి గడ్కరీ చెప్పారు.2017లో లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందాల్సి ఉందని, అయితే గత ఫిబ్రవరిలో లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడటంతో బిల్లు మురిగిపోయిందని అన్నారు. కొత్త మంత్రి వర్గం ఆమోదం లభించిన వెంటనే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.

పెట్టుబడులు, ఉద్యోగ సృష్టిపై దృష్టి

- వీటికోసం రెండు కేబినెట్ కమిటీలు
- దేశ చరిత్రలోనే తొలిసారి ఏర్పాటు
- మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించడంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు దేశచరిత్రలోనే తొలిసారిగా రెండు కేబినెట్ కమిటీలను ఏర్పాటు చేశారు. వీటిలో మొదటిదైన 'పెటుబడులు, అభివృద్ధి కేబినెట్ కమిటీ'లో కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, పీయూష్‌గోయల్‌లను సభ్యులుగా నియమించారు. భారత్‌లోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఆర్థికవ్యవస్థ వృద్ధిపై కమిటీ దృష్టి సారించనుంది. అలాగే ఉద్యోగకల్పన-నైపుణ్యాభివృద్ధిపై ఏర్పాటైన కేబినెట్ కమిటీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, సీతారామన్, పీయూష్ గోయల్, నరేంద్రసింగ్ తోమర్, రమేశ్ నిశాంక్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంఎన్ పాండే, సంతోష్ కుమార్ గంగ్వార్, హర్దీప్ పురీలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ దేశంలో కొత్త ఉద్యోగాల సృష్టితో పాటు యువత ఉపాధి పొందేందుకు వీలుగా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై దృష్టి పెట్టనుంది.

ఈ రెండు కేబినెట్ కమిటీలు ప్రధాని మోదీ నేతృత్వంలో పనిచేస్తాయి. ఈ రెండు కమిటీలను ఏర్పాటుచేసేందుకు నిబంధనలు అనుమతిస్తున్నప్పటికీ ఎన్డీయే-1 ప్రభుత్వం వీటిని ఏర్పాటుచేయలేదు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విపక్షాలు ప్రధాని మోదీని దేశంలో నిరుద్యోగం, ఆర్థికవ్యవస్థ మందగమనంపై తీవ్రంగా విమర్శించిన సంగతి తెలిసిందే. ఈసారి అలాంటి విమర్శలకు తావివ్వకుండా చేసేందుకు మోదీ వ్యూహాత్మకంగా ముందుకెళుతున్నారు. మరోవైపు దేశభద్రత, విదేశీ వ్యవహారాలను పర్యవేక్షించే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీని బుధవారం ఏర్పాటుచేశారు. ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులు సభ్యులుగా ఉంటారు.

ప్రకృతితో మమేకమైతే ఉజ్వల భవిష్యత్

ప్రకృతితో మమేకమై సామరస్యంగా జీవించడం ఉజ్వల భవిష్యత్‌కు నాంది పలుకుతుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం(జూన్ 5) సందర్భంగా ఆయన అందరికి శుభాకాంక్షలు చెప్పారు. 'భూమి, పర్యావరణం.. మనం పరిరక్షించుకోవాల్సిన గొప్ప అంశాలు ఇవి. ప్రపంచ పర్యావరణ దినోత్సవమైన నేడు స్వచ్ఛమైన భూమి కోసం కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటిస్తున్నా' అంటూ ట్విట్టర్‌లో ప్రధాని ఓ వీడియోను పోస్ట్ చేశారు. మొక్కల్ని నాటడం గొప్ప విషయం కాదనీ, అవి చెట్లుగా మారేవరకూ పరిరక్షించాలని మోదీ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం(జూన్ 21) సమీపిస్తున్న వేళ యోగాను జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యోగా వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్న మోదీ.. తాను ఆసనాలు వేస్తున్నట్లు ఉన్న యానిమేషన్ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఢిల్లీ, సిమ్లా, మైసూరు, అహ్మదాబాద్, రాంచీలో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది.

రంజాన్ శుభాకాంక్షలు..

రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పర్వదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం సోదరసోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. 'రంజాన్ పర్వదినం మన సమాజంలో సామరస్యం, కరుణ, శాంతిని పెంపొందిస్తుందని ఆశిస్తున్నా. ప్రతీఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా' అని ప్రధాని తెలిపారు.

ఢిల్లీలోని చారిత్రక జామా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు. రంజాన్ సందర్భంగా బుధవారం దేశవ్యాప్తంగా ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు.

థాయ్ ప్రధానిగా ప్రయూత్ చాన్ ఓచా

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధానిగా సైనిక జుంటా పార్టీ అధినేత ప్రయూత్ చాన్ ఓచా(65) ఎన్నికయ్యారు. తన సమీప ప్రత్యర్థి, కోటీశ్వరుడైన థనాత్రోన్ జువాంగ్రోంగ్ రువాంకిట్‌పై ఆయన విజయం సాధించారు. థాయ్‌లాండ్‌లో ప్రధానిని ఎన్నుకోవడానికి ప్రతినిధుల సభ, సెనెట్ కలిపి 375 సభ్యుల మద్దతు ఉండాలి. అయితే 250 మంది సభ్యులున్న సెనెట్‌లో జుంటా పార్టీకి సంపూర్ణ ఆధిక్యం ఉండటంతో కౌంటింగ్ కొనసాగుతుండగానే ప్రయూత్ విజయం ఖరారైపోయింది.. 2014లో ఇంగ్లక్ షీనవ్రత ప్రభుత్వాన్ని సైన్యం కూలదోశాక అప్పటి ఆర్మీ చీఫ్ ప్రయూత్ చాన్ ఓచా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికతో సైనిక సంక్షోభం తర్వాత ఎన్నికైన తొలి పౌరప్రధానిగా ప్రయూత్ చాన్ ఓచా నిలిచారు.

స్థిరంగా 'నిఫా' విద్యార్థి ఆరోగ్యం

కొచ్చి: నిఫా వైరస్ లక్షణాలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని కేరళ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఆ విద్యార్థితో పాటు మరో ఐదుగురు విద్యార్థులను వైద్యులు పరీక్షిస్తున్నట్లు కేరళ ఆరోగ్య మంత్రి శైలజ వెల్లడించారు. 23 ఏళ్ల విద్యార్థికి నిఫా వైరస్ సోకినట్లు కేరళ సర్కార్ ధ్రువీకరించడం తెల్సిందే. 'వైద్యపరంగా విద్యార్థి ఆరోగ్యం స్థిరంగా ఉంది. నెమ్మదిగా మెరుగుపడుతోంది. అతని జ్వరం తగ్గుతోంది' అని మంత్రి శైలజ చెప్పారు. వైరస్ సోకిన విద్యార్థి ఇటీవల 311 మంది తోటి విద్యార్థులతో కలసి త్రిసూర్‌లో శిక్షణకు వెళ్లాడు. దీంతో ఆ 311 మందికి కూడా జ్వరం వంటి లక్షణాలు ఉన్నాయా? అనే విషయంపై వైద్యులు దృష్టి పెట్టారు.

బడ్జెట్‌కు పాక్ ఆర్మీ స్వచ్ఛంద కోత

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్‌కు మద్దతిస్తూ పాక్ ఆర్మీ కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రక్షణ బడ్జెట్‌కు కేటాయించే నిధులను స్వచ్ఛందంగా తగ్గిస్తున్నట్లు ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డీజీ మేజర్ జనరల్ ఆసిఫ్ గఫూర్ చెప్పారు. 'దేశ భద్రత, రక్షణ విషయాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోం. అన్ని ప్రమాదాల నుంచి దేశాన్ని రక్షించాలి. ముప్పులను దీటుగా ఎదుర్కొగలిగేలా సామర్థ్యాన్ని కొనసాగించాలి. బడ్జెట్‌లో కోత వల్ల కలిగే ఇబ్బందులను త్రివిధ దళాలు తగిన అంతర్గత చర్యల ద్వారా సర్దుబాటు చేసుకుంటాయి. దేశంలోని గిరిజన ప్రాంతాలు, బలూచిస్థాన్ అభివృద్ధిలో పాలుపంచుకోవడమే మాకు ముఖ్యం' అని ఆసిఫ్ అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ నిర్ణయాన్ని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రశంసించారు. పలు భద్రతా సవాళ్లు ఉన్నప్పటికీ దేశం కోసం వారు ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.

ఎవరెస్ట్.. ఇక అందరూ ఎక్కలేరు!

కాఠ్మండు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని ఇకపై ఎవరు పడితే వారు అధిరోహించే అవకాశం లేదు. ఎవరెస్ట్ శిఖరంపై పర్వతారోహకుల మరణాలు, ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో ఎవరెస్ట్ అధిరోహణపై కొన్ని నిబంధనలు విధించాలని నేపాల్ పర్యాటక శాఖ ఆలోచిస్తుంది. అధిరోహకులకు కనీస అర్హతలు ఉండేలా చూడనుంది. ఎక్కువ తాళ్ల ఏర్పాటు, ఆక్సిజన్, ఎక్కువ షెర్పాలను తీసుకెళ్లడం వంటి నిబంధనలు తీసుకురానున్నట్లు నేపాల్ పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారి చెప్పారు. టిబెట్ ప్రభుత్వం కేవలం 300 మందికి ఎవరెస్ట్‌ను అధిరోహించే అవకాశం కల్పిస్తుండగా నేపాల్ అపరిమితంగా పర్వతారోహకులకు అనుమతి మంజూరు చేస్తోంది.

11 వేల కిలోల చెత్త: ఎవరెస్ట్‌ను శుద్ధి చేసేందుకు నేపాల్ ప్రభుత్వం రెండు నెలల పాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా మొత్తం 11 వేల కిలోల చెత్తతో పాటు నాలుగు మృతదేహాలను వెలికి తీశారు.

మెడికల్ కాలేజీల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూచన

న్యూఢిల్లీ: విద్యార్థుల మానసిక స్థితిని మెరుగుపరిచేందుకు దేశంలోని అన్ని మెడికల్ కాలేజీలు, బోధనా సంస్థల్లో 24 గంటల పాటు నడిచే కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోరింది. ముంబైలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో సీనియర్ల వేధింపుల కారణంగా ఇటీవల 26 ఏళ్ల డాక్టర్ పాయల్ తాడ్వి ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో ఐఎంఏ ఈ నిర్ణయం తీసుకుంది. పని ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గించి డాక్టర్లు, పీజీ విద్యార్థుల్లో ఆత్మహత్యలను ఆపే ఉద్దేశంతో ఐఎంఏ డాక్టర్ ఫర్ డాక్టర్ (డీ4డీ) అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది.

మూడోరోజూ దొరకని ఆచూకీ

ఈటానగర్: కన్పించకుండా పోయిన భారత వాయుసేన రవాణా విమానం ఆచూకీ బుధవారం మూడోరోజూ దొరకలేదు. మరిన్ని ఐఏఫ్ విమానాలు రంగంలోకి దిగి పగలు, రాత్రి గాలిస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని మెచుకా పర్వత ప్రాంతంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో గాలింపు కొనసాగుతోంది. రష్యా తయారీ ఏఎన్-32

రెయిన్‌బో.. అదిరింది పో



ఎప్పుడైనా చూశారా.. విమానం ఇంద్రధనస్సును వెంటేసుకుని తిరగడం.. జర్మనీలోని బాంబర్గ్‌కు చెందిన నిక్ కూడా చూడలేదట. అందుకే వెంటనే క్లిక్‌మనిపించేశాడు.. విమానాలు వేగంగా వెళ్తున్నప్పుడు వాటి వెనుక తెల్లటి పొగ మాదిరిగా కనిపించడం మనం చూసుంటాం.. కానీ ఇక్కడ ఖతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఈ విమానం మేఘాలపై రెయిన్‌బోను ముద్రించుకుంటూ పోతున్నట్లు వెళ్లడం మాత్రం సూపర్ కదూ.. దీనికి ఆ సమయంలో సూర్యుడు ఉన్న దిశ కారణమని ఎయిర్ ఫొటోగ్రఫీలో ప్రావీణ్యత ఉన్న నిక్ అంటున్నారు. సూర్యుని కిరణాలు దానిపై ప్రతిబింబించడం వల్ల ఇంద్రధనస్సు ఎఫెక్ట్ వచ్చిందని చెబుతున్నారు.



చిన్నప్పుడు బీచుల్లో చాలాసార్లు ఇసుకతో గూళ్లు కట్టాం.. చిన్నచిన్న బిల్డింగులూ కట్టాం.. ఇక్కడ వీళ్లు కూడా అదే పని చేస్తున్నారు.. కాకపోతే కాసింత భారీగా.. వీళ్లు ప్రపంచంలోనే అత్యంత భారీ ఇసుక భవంతిని కట్టేపనిలో నిమగ్నమై ఉన్నారు.. ఎక్కడ అంటారా? జర్మనీలోని బింజ్‌లో.. ప్రస్తుతమక్కడ సైకత శిల్పాల ఉత్సవం జరుగుతోంది.. అక్కడే 57.4 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మిస్తున్నారు. ఇందుకోసం వాళ్లు.. ఏకంగా కోటి కిలోల ఇసుకను వాడుతున్నారట..

గుండెకు బ్యాండ్ ఎయిడ్

మూల కణాలతో కూడిన హార్ట్‌ప్యాచ్
అభివృద్ధిపరిచిన బ్రిటన్ శాస్త్రవేత్తలు

గుండెపోటుతో కండరాలకు జరిగిన నష్టాన్ని వేగంగా సరిచేసేందుకు బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు ఓ వినూత్న పద్ధతిని ఆవిష్కరించారు. ఏదైనా గాయమైతే మనం వాడే బ్యాండ్ ఎయిడ్ మాదిరిగానే.. మూలకణాలతో నిండిన పట్టీలను గుండెకు అతికిస్తే.. గుండెపోటు వల్ల పాడైన గుండె కణజాలానికి వేగంగా మరమ్మతులు చేయొచ్చని చెబుతున్నారు. గుండెపోటు వచ్చినప్పుడు గుండెకు తగినంత ఆక్సిజన్, పోషకాలు అందకపోవడం వల్ల అక్కడున్న కణజాలం నాశనమవుతుంది. ఫలితంగా గుండె సామర్థ్యం తగ్గుతుంది. తగు మోతాదులో రక్తాన్ని శుద్ధి చేయలేకపోతుంది. ఇదికాస్తా గుండె పనిచేయకుండా పోయేందుకు దారితీయొచ్చు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు ఈ వినూత్నమైన హార్ట్‌ప్యాచ్‌ను ఆవిష్కరించారు. 3 సెంటీమీటర్ల పొడవు, 2 సెంటీమీటర్ల వెడల్పు ఉండే ఈ హార్ట్‌ప్యాచ్‌లలో ఏకంగా 5 కోట్ల మూలకణాలు ఉంటాయి. ఒకసారి ఈ హార్ట్‌ప్యాచ్‌ను గుండెకు అతికిస్తే చాలు. కాలక్రమంలో ఈ మూలకణాలన్నీ గుండె కండరాలుగా మారిపోతాయి. సక్రమంగా కొట్టుకునేందుకు ఉపయోగపడతాయి. జరిగిన నష్టం ఆధారంగా ఒకటి కంటే ఎక్కువ హార్ట్‌ప్యాచ్‌లను వాడొచ్చని రిచర్డ్ జబౌర్ తెలిపారు. హార్ట్‌ప్యాచ్‌లో ఉండే రసాయనాలు గుండె కణాలు తమంతట తాము మరమ్మతు చేసుకునేందుకు, పెరిగేందుకు సాయపడతాయని చెప్పారు. పరిశోధనశాలలో తాము ఈ హార్ట్‌ప్యాచ్‌లను ప్రయోగాత్మకంగా పరీక్షించామని.. మూడు రోజుల్లోనే ఇందులోని మూలకణాలు గుండెమాదిరిగానే కొట్టుకోవడం మొదలవుతుందని.. పూర్తిస్థాయిలో గుండె కణజాలంగా మారేందుకు నెల రోజులు పడుతుందని రిచర్డ్ వివరించారు. జంతువులపై ప్రయోగాలు మంచి ఫలితాలిచ్చాయని, ఇంకో రెండేళ్లలో మనుషులపై కూడా ఈ హార్ట్‌ప్యాచ్‌లను పరీక్షిస్తామని చెప్పారు.



పాలిసెట్ చివరి దశ కౌన్సెలింగ్

- 6వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం
- 7న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 8 వరకు వెబ్ ఆప్షన్లు
- 10న సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకోసం చివరి దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ప్రవేశాల క్యాంపు అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకు ఫీజు చెల్లించి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోని విద్యార్థులు గురువారం వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో మొత్తం 34,901 సీట్లు అందుబాటులో ఉండగా మొదటి దశ కౌన్సెలింగ్‌లో 26,266 మంది విద్యార్థులకు సీట్లను కేటాయించామని వెల్లడించారు. అందులో 18,006 సీట్లలో చేరేందుకు విద్యార్థులు ఫీజు చెల్లించి కాలేజీల్లో రిపోర్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 16,895 సీట్లు ఈ కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో (https://tspolycet.nic.in) పొందవచ్చని వివరించారు.

ఎవరెవరు అర్హులంటే..

మొదటి దశ కౌన్సెలింగ్ సమయంలో ఫీజు చెల్లించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని వారు ఇపుడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవచ్చు. ఇపుడు కొత్తగా ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మొదటి దశ కౌన్సెలింగ్ సమయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన వారు ఇపుడు వెరిఫికేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో సీటు వచ్చి, దానికంటే బెటర్ కాలేజీలో సీటు కావాలనుకునే వారు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. అయితే మొదటి దశలో వచ్చిన కాలేజీకంటే మెరుగైన కాలేజీ అనుకుంటేనే అందులో సీటు కోసం ఆప్షన్లు ఇచ్చుకోవాలి. గతంలో వెబ్ ఆప్షన్లు ఇచ్చినా సీట్లు లభించని విద్యార్థులు ఇపుడు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. కొత్తగా వెరిఫికేషన్‌కు హాజరైన వారు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.

ఇదీ షెడ్యూలు..

6-6-2019 వరకు:	ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు, సర్టిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్.
7-6-2019:	స్లాట్ బుక్ చేసుకున్న వారికి హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్.
6-6-2019 నుంచి 8-6-2019 వరకు:	వెరిఫికేషన్ పూర్తయిన వారికి వెబ్ ఆప్షన్లకు అవకాశం.
10-6-2019:	సీట్ల కేటాయింపు
10-6-2019 నుంచి 11-6-2019 వరకు:	వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్.
12-6-2019:	సీట్లు లభించిన కాలేజీల్లో ఫిజికల్ రిపోర్టింగ్.

సర్పంచ్‌కు నోటీసు జారీ అధికారం లేదు

- పంచాయతీ తీర్మానాన్ని కార్యదర్శి అమలు చేయాలి
- తేల్చి చెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని పంచాయతీ చేసే తీర్మానాన్ని అమలు చేయాలని నోటీసు జారీ చేసే అధికారం గ్రామ సర్పంచ్‌లకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్మానాన్ని పంచాయతీ కార్యదర్శి ద్వారా అమలు చేయించాలని చట్టం చెబుతోందని, గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం నోటీసును సర్పంచ్ జారీ చేసే అధికారం చట్టంలో లేదని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామానికి చెందిన రైతు వంగ రాఘవరెడ్డి దాఖలు చేసిన కేసులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ఉత్తర్వులిచ్చారు. పంచాయతీ కార్యదర్శి చేయాల్సిన విధుల్ని సర్పంచ్ చేయడం చట్ట వ్యతిరేకమని, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్ అధికారం పరిమితమని పిటిషనర్ తరపు న్యాయవాది పి.జనార్దన్‌రెడ్డి వాదించారు. 'కార్యదర్శే పంచాయతీ స్థిరచరాస్తుల రక్షణ, నిర్వహణ బాధ్యతలు నిర్వహించాలి. ఆస్తుల అంశంపై పాలకవర్గం తీర్మానాన్ని కార్యదర్శే అమలు చేయాలి. సర్పంచ్‌కు నోటీసిచ్చే అధికారం లేదు'అని హైకోర్టు పేర్కొంది.

రెండోరోజూ అదే తీరు!

- విచారణకు సహకరించని రవిప్రకాశ్
- అడిగిన ప్రశ్నలకు బదులివ్వని టీవీ9 మాజీ సీఈఓ
- దర్యాప్తును తప్పుదోవ పట్టించే యత్నం
- రెండో నోటీసు ఇవ్వనున్న బంజారాహిల్స్ పోలీసులు
- ఆ కేసులో విచారణకు రాకుంటే అరెస్టు చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఫోర్జరీ, నిధుల మళ్లింపు కేసు విచారణలో టీవీ9 మాజీ సీఈఓ రవిప్రకాశ్ తీరు ఎంతమాత్రం మారలేదు. రెండోరోజు కూడా పోలీసులకు సహకరించలేదు. మంగళవారం సైబరాబాద్ పోలీసుల ఎదుట విచారణకు హాజరైన రవిప్రకాశ్.. విచారణలో సహకరించని సంగతి తెలిసిందే. బుధవారం కూడా ఆయన అదే ఒరవడి కొనసాగించారు. ఉదయం 11.30 గంటల తర్వాత సైబర్ క్రైం కార్యాలయానికి వచ్చిన రవిప్రకాశ్.. అక్కడ మీడియాతో మాట్లాడిన అనంతరం విచారణ కోసం వెళ్లారు. అప్పటి నుంచి రాత్రి 10.30 గంటల వరకు 11 గంటలపాటు పోలీసులు విచారించారు. అలందా మీడియా కార్యదర్శి కౌశిక్‌రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన 2 కేసులపై పోలీసులు ప్రశ్నలు సంధించారు. టీవీ9 పాత యాజమాన్యం నుంచి అలందా మీడియాకు యాజమాన్య బదిలీలు జరగకుండా ఉండేందుకు నకిలీ పత్రాలు సృష్టించడం, కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంపై నమోదైన రెండు కేసులకు సంబంధించి పోలీసులు విచారించారు. అయితే, విచారణలో తమకు రవిప్రకాశ్ ఎంతమాత్రం సహకరించలేదని పోలీసు అధికారులు తెలిపారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోగా.. దర్యాప్తును పక్కదోవ పట్టించేలా వ్యవహరించారని వివరించారు.

అడిగిన ప్రశ్నలివే..

రవిప్రకాశ్‌ని విచారించడానికి పోలీసులు ముందుగానే ప్రశ్నావళిని సిద్ధం చేసుకున్నారు. 'కంపెనీ సెక్రటరీ దేవేంద్ర అగర్వాల్ సంతకాన్ని ఎవరు, ఎందుకు ఫోర్జరీ చేశారు? తాజాగా కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలతో ఎన్‌సీఎల్‌టీకి పాత తేదీలతో శివాజీతో మీరు ఫిర్యాదు చేయించడానికి కారణాలేంటి? శివాజీకి 40వేల షేర్లు ఎందుకు విక్రయించారు? శివాజీకి షేర్లు బదిలీ చేయకుండా ఎందుకు మోసగించారు? టీవీ9 యాజమాన్య మార్పిడి జరిగినప్పుడు సీఈవోగా దాన్ని కొత్త యాజమాన్యానికి అప్పగించాల్సిన బాధ్యత మీకు లేదా''అంటూ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. వీటితోపాటు నిధుల మళ్లింపు, లోగో విషయంలోనూ పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

పెండింగ్‌లోనే మరో కేసు...

టీవీ9 వ్యవహారంలో రవిప్రకాశ్‌పై హైదరాబాద్ కమిషనరేట్‌లోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోనూ మరో కేసు పెండింగ్‌లో ఉంది. టీవీ9 లోగో, కాపీ రైట్స్, ట్రేడ్‌మార్కులను 2018 మే నెలలో మోజో టీవీకి విక్రయించారనే ఆరోపణలపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఐపీసీ 467, 420, 409, 406, 120 (బీ) సెక్షన్ల కింద హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని గతనెల 21న రవిప్రకాశ్ ఇంటికి నోటీసు అంటించారు. దీనికి ఆయన స్పందించలేదు. ఈ నేపథ్యంలో రెండోసారి నోటీసు జారీచేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. అరెస్ట్ చేయడానికి 48 గంటల ముందు నోటీసు జారీచేయాలన్న సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండో నోటీసు జారీచేసిన తర్వాత కూడా విచారణకు హాజరు కాకుంటే రవిప్రకాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉంది.

ఇంకా పరారీలోనే శివాజీ..?

ఈ కేసులో పోలీసులు గాలిస్తున్న మరో నిందితుడు సినీ నటుడు శివాజీ ఇంకా పరారీలోనే ఉన్నాడు. ఆయన ఇప్పటికీ విజయవాడలోనే తల దాచుకున్నాడని సమాచారం. శివాజీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఈ కేసులో నిందితులకు పరిస్థితులు రోజురోజుకూ ప్రతికూలంగా మారుతుండటంతో త్వరలోనే శివాజీ కూడా బయటికి రాక తప్పదని పోలీసులు ధీమాగా ఉన్నారు.

మోజో టీవీ ఆక్రమణకు యత్నం: రవిప్రకాశ్

విచారణకు వెళ్లే ముందు రవిప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. తనపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే కాకుండా మోజో టీవీని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మీడియాను ఆక్రమిస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్‌కు చెందిన అంబరీశ్ పూరి కొంత మంది పోలీసులతో కలసి మోజో టీవీని ఆక్రమించే పన్నాగం పన్నారని ఆరోపించారు. ధనిక స్వామ్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు, జర్నలిస్టులు కలసి రావాలని కోరారు.

ప్రపంచంలోనే వరస్ట్ ముంబై!

- వాహనదారుల సమయమంతా రోడ్డుపాలు
- ట్రాఫిక్ జామ్‌లపై తేల్చి చెప్పిన టామ్ టామ్ అధ్యయనం

వాహనదారులు అత్యధికంగా ట్రాఫిక్ జామ్ బారిన పడుతున్న నగరాల్లో ముంబై ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచింది. దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రజానీకం సాధారణ సమయాల్లో కంటే పీక్ అవర్స్‌లో 65 శాతం కంటే అధికంగా తమ విలువైన సమయాన్ని రోడ్డు పాల్జేసుకుంటున్నట్టు 2018 టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ట్రాఫిక్ జామ్స్‌తో, వాహనరద్దీతో విలవిల్లాడుతోన్న నగరాల్లో కొలంబియా, పెరూ, మాస్కో లాంటి మహానగరాలు కూడా ఉండటం గమనార్హం. అయితే ప్రపంచంలోని అన్ని దేశాల్లోని నగరాల కంటే కూడా మన దేశంలోని ముంబై నగర ప్రజలు తీవ్రమైన ట్రాఫిక్ జామ్ సమస్యను ఎదుర్కొంటున్నట్టు తేలింది. బొగోటా, కొలంబియాల్లో వాహనాల రద్దీ 63 శాతంగానూ, లిమా, పెరూల్లో రద్దీ తీవ్రత 58 శాతంగానూ ఉంటే, న్యూఢిల్లీ 58 శాతం రద్దీతో ప్రపంచంలోనే ట్రాఫిక్ జామ్ తీవ్రతలో టాప్-5లో స్థానం సంపాదించింది. పై నాలుగు నగరాలు కూడా అభివృద్ధి చెందుతోన్న దేశాల్లోనివే కావడం గమనించాల్సిన విషయం. ఇక 56 శాతం వాహనరద్దీతో ముప్పుతిప్పలు పడుతూ ఐదో స్థానంలో ఉన్న మాస్కో.. అభివృద్ధి చెందిన దేశాలకంటే కూడా అనేక ప్రమాణాల్లో వెనుకబడి ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది.

పదేళ్ల అధ్యయనం..

ప్రపంచవ్యాప్తంగా 400 నగరాల్లో ట్రాఫిక్ రద్దీని జీపీఎస్ ఆధారంగా అధ్యయనం చేసిన ఈ సంస్థ ముంబై మహానగరాన్ని 'అత్యధిక వాహన రద్దీ ఉన్న నగరం'గా తేల్చింది. అయితే 8 లక్షల జనాభాకు పైబడిన నగరాలనే ఈ అధ్యయనంలో భాగస్వామ్యం చేశారు. వాహనాల రద్దీపై గత పదేళ్లుగా అధ్యయనం చేస్తోన్న ఈ సంస్థ తొలిసారిగా భారతదేశంలోని వాహన రద్దీ స్థాయిని అంచనా వేసింది.

ఆనందించాలా.. బాధపడాలా..!

ప్రపంచవ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీ తీవ్రత పెరుగుతోందని టామ్ టామ్ అధ్యయన సంస్థకి చెందిన ప్రముఖుడు రాల్ఫ్ పీటర్ చెప్పారు. అయితే ఇది ఒకరకంగా ఆనందించాల్సిన విషయమూ, మరో రకంగా బాధపడాల్సిన విషయమూ అని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా బలోపేతమౌతోన్న ఆర్థిక వ్యవస్థను ఇది సూచిస్తోంటే, ట్రాఫిక్ జామ్ కారణంగా విలువైన సమయాన్ని కోల్పోతుండటం బాధాకరమని వ్యాఖ్యానించారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌పై దృష్టి పెట్టాలి..

దురదృష్టవశాత్తూ ప్రపంచమంతా కార్ల చుట్టూనే తిరుగుతోంది. అలాగే కార్ల కొనుగోలు, వాడకానికి సంబంధించిన నియమ నిబంధనలేవీ లేకపోవడం కూడా నష్టం చేకూరుస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్‌ని తగ్గించాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పడం సుస్థిర పరిష్కారాలను సూచించగలుగుతుందని టామ్ టామ్ ఇండియా జనరల్ మేనేజర్ బార్బరా బేల్సెయిర్ అభిప్రాయపడుతున్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
6-6-2019

ఆట ముగిసింది
సినిమా పేజీలో...

ప్రతీకాత్మక చిత్రం

హెల్దీ టేస్టీ లంచ్ బాక్స్
లోపలి పేజీలో...

గోడలు కట్టుకోవచ్చు.
పిల్లల మనసులో అవి నిలువవు.
ఆస్తులు పంచుకోవచ్చు.
పిల్లల దృష్టిలో ఆ కాగితాలు చిత్తు కాగితాలు.
ఎడమొహం పెడమొహంగా జీవించవచ్చు.
కాని పిల్లలు వారధులు కట్టే ఉడుతలు.
బంధాలున్న బాల్యం... బాల్యాన్నిచ్చే బంధాలు
వీటిని మనం ఎప్పటికి అర్థం చేసుకోగలం?

కలిసుందాం అన్నయ్యా...

'అమ్మా... చెట్టు విరిగి మీద పడినట్టు కల వచ్చిందమ్మా' అన్నాడు బుజ్జి స్కూల్‌కు వెళుతూ.

తల్లి స్కూల్‌కు పంపే హడావిడిలో పట్టించుకోలేదు.

ఆమె గమనించి ఉంటే అతడి కళ్లు వాచి ఉండటాన్ని చూసేది. అది నిద్ర సరిగ్గా పట్టని ముఖం అని తెలుసుకొని ఉండేది. అది పీడకలలతో భీతిల్లిన మనసు అని అర్థం చేసుకొని ఉండేది.

'ఇదిగో నీకిష్టమని క్యారెట్ రైస్ పెట్టాను. లంచ్‌లో అంతా తినాలి. వాటర్ బాటిల్ మొత్తం తాగి ఖాళీ బాటిల్ ఇంటికి తేవాలి. నీళ్లు అలాగే తెచ్చావో ఈసారి నీ క్లాస్ టీచర్‌కు కంప్లయింట్ రాస్తా నీ డైరీలో' అని బుజ్జిని స్కూల్ బస్సు ఎక్కించింది.

* * *

ఆ మధ్యాహ్నమే స్కూల్ నుంచి ఫోన్ వచ్చింది.

'మీ బాబు ఏం తినట్లేదండీ'

'వాడికి ఇష్టమైనదే పంపానే'

'అసలు వాడు రెండు మూడు నెలలుగా సరిగ్గా తినడం లేదు. చాలా అన్నం పారేసి బాక్సులు తెస్తున్నాడు. మీకు చెప్దాం చెప్దాం అనుకుంటూ మర్చిపోతున్నాను' అంది క్లాస్ టీచర్.

బుజ్జి తల్లి చేతిలో ఉన్న సెల్‌ఫోన్ చెమటతో తడిసింది.

* * *

మూడు నెలలుగా బుజ్జి సరిగ్గా లేడన్న సంగతి ఇప్పుడు తీరిగ్గా కూచుని మననం చేసుకుంటే బుజ్జి తల్లికి అర్థమైంది. వాడు ఎక్కువ తినడం లేదు. అపార్ట్‌మెంట్‌లో కింద ఆడుకోవడానికి వెళుతున్నాడు కాని అక్కడ ఊరికే కూచుని ఉంటున్నాడు. హోమ్‌వర్క్‌లో చురుకు పోయింది. నవ్వడం తగ్గింది.

'అమ్మో.. ఇదంతా ఏమిటి?' అనుకుందామె.

స్కూల్ బస్ వచ్చి వాడిని దింపే వరకూ ఏమి టేమిటోగా అనిపించింది.

సాయంత్రం స్కూల్‌బస్ రాగానే బుజ్జిని వెళ్లి గట్టిగా కావలించుకుంది.

'కన్నా... ఏమైంది ఎందుకలా ఉంటున్నావు?'

బుజ్జి ఏం చెప్పలేదు.

ఇంట్లోకొచ్చి బాల్ పట్టుకొని ఒక్కడే నేలకు టప్పాలు కొడుతూ కూచున్నాడు.

కిందకు తాకుతున్న బాల్ పైకి లేస్తోంది.

వాడు ఆటగా దాన్ని కిందకు కొడుతున్నాడా? కోపంగానా?

* * *

ఎనిమిదేళ్ల బుజ్జికి లోకంలో డబ్బు అనేది ఉంటుందని సరిగ్గా తెలియదు. దాని వల్ల మనుషులు అవస్థలు పడతారని తెలీదు. దాని కారణాన అవస్థలు తెచ్చుకుంటారని తెలియదు. దాని కోసమని దారుణంగా వ్యవహరిస్తారని తెలియదు. వాడికి తెలిసిందల్లా ఒక్కటే. తను ఇష్టపడే ఇల్లు. ఆ ఇంట్లో తనతో ఎప్పుడూ ఆడుకునే ఇద్దరు స్నేహితులు. పెద్దా. చిన్నా. వాళ్లు మొదట అతడి గాఢమైన స్నేహితులు. ఆ తర్వాతే పెదనాన్న పిల్లలు.

పెద్దా.. చిన్నా... ఇప్పుడు ఎక్కడ ఉన్నట్టు?

* * *

సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లినప్పుడు ఆమె కూడా అదే ప్రశ్న వేసింది బుజ్జి తల్లిదండ్రులను.

'మీ అబ్బాయి ఎవరినో మిస్ అవుతున్నాడు. బహుశా పెద్దా చిన్నల గురించి కావచ్చు. వాళ్లెక్కడ?'

వారు ఒకరిగా ఎప్పుడూ లేరు. అన్నం తింటున్నా టీవీ చూస్తున్నా కింద ఆడుకుంటున్నా ముగ్గురూ ఒక జట్టుగా ఉండేవారు. స్కూలుకు కూడా కలిసి వెళ్లేవారు. లంచ్ అవర్‌లో కలిసి తినేవారు.

బుజ్జి తల్లిదండ్రులు తల వొంచుకున్నారు.

* * *

బుజ్జి తండ్రి రాజకుమార్ ఎం.సి.ఏ చేశాడు. ఆ తర్వాత హైటెక్ సిటీలో జాబ్ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ కొన్నాడు. మరొకటి అద్దెకు తీసుకున్నాడు. ఒకటి తనకు. రెండోది తన అన్నయ్యకు. రాజకుమార్ చిన్నప్పటి నుంచి చదువులో టాపర్. కాని తండ్రి పట్టించుకునే వాడు కాదు. అతడు తాగుబోతు. ఉన్న నాలుగెకరాల భూమిని వ్యవసాయం చేయకుండా పాడుబెట్టాడు. అప్పుడు డిగ్రీ చదవాల్సిన రాజకుమార్ అన్న దేవకుమార్ చదువు మానేసి వ్యవసాయంలో దిగాడు. తమ్ముడి చదువుకోసం రెక్కలు ముక్కలు కొట్టుకున్నాడు. అతడు చేసుకున్న భార్య కూడా రాజకుమార్‌ను అభిమానించి దేవకుమార్ ఏం చేసినా అడ్డు చెప్పలేదు. పల్లెటూళ్లో దేవకుమార్ కష్టపడుతుంటే రాజకుమార్ చదువు కోసమని ఉద్యోగం కోసమని మంచి జీవితం అనుభవించాడు. తాను పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యాక అన్నయ్యను ఇక పల్లెటూరి వ్యవసాయం వద్దని ఆ భూమి కౌలుకు ఇచ్చి హైదరాబాద్‌కు తెచ్చుకున్నాడు. తమ ఫ్లాట్స్ దగ్గరే ఒక కిరాణా షాప్ పెట్టించాడు. అన్నదమ్ములు చెరో ఫ్లాట్‌లో ఉన్నా కలిసి ఉన్నట్టే. వారి కంటే వాళ్ల పిల్లలు బుజ్జి, చిన్నా, పెద్ద ఇంకా కలిసి ఉండేవాళ్లు.

వారు ఒకరిగా ఎప్పుడూ లేరు. అన్నం తింటున్నా టీవీ చూస్తున్నా కింద ఆడుకుంటున్నా ముగ్గురూ ఒక జట్టుగా ఉండేవారు. స్కూలుకు కూడా కలిసి వెళ్లేవారు. లంచ్ అవర్‌లో కలిసి తినేవారు. బుజ్జి మూడో క్లాస్‌లో ఉంటే చిన్నా ఐదో క్లాసు పెద్ద ఏడో క్లాసు.

కాని రాజకుమార్‌కు రాను రాను అన్న కుటుంబం భారం అయ్యింది. కిరాణా షాపులోనూ కౌలులోనూ వచ్చేది దేవ కుమార్ కుటుంబానికి ఏమీ సరిపోయేది కాదు. అది సరిపోదని తాను సపోర్ట్‌గా ఉంటానని చెప్పే తీసుకు వచ్చాడు. లక్షన్నరకు పైగా జీతం వచ్చే రాజకుమార్ అన్నయ్య ఇరవై ముప్పై వేలకు నెలకు సపోర్ట్‌గా ఉండటం నిజంగా చూస్తే కష్టం కాదు.

కాని మనసు మారింది.

ఎవరి బతుకులు వారివైతే బాగుండు అన్నట్టు ప్రవర్తన మారింది.

పల్లెటూరి వాళ్లకు ఏమి అర్థమైనా అర్థమవకపోయినా ఇంట్లాంటివి అర్థమవుతాయి.

వేసవి సెలవులు ముగియడంతోటే తమ శక్తి మేరకు తాము బతుక్కుంటాము అని దేవకుమార్ కుటుంబం సిటీ శివార్లకు వెళ్లిపోయింది. వ్యవసాయం తెలుసు కనుక ఒక ఫామ్‌హౌస్ మేనేజర్‌గా కుదురుకున్నాడు దేవకుమార్. అక్కడి మామూలు స్కూల్‌లో పిల్లలు చేరారు. నివాసం ఫ్రీ కనుక పెద్ద ఇబ్బంది లేదు.

కాని ఇబ్బంది అంతా బుజ్జికి వచ్చింది.

విడిపోయి ఆర్నెల్లయినా వాళ్లు వచ్చింది లేదు. వీళ్లు వెళ్లింది లేదు.

అంతవరకూ ఉన్న ప్రపంచం తల్ల కిందులై పోయింది.

* * *

'వాడు చెట్టు కూలి మీదపడినట్టుగా చెబుతున్నది మీ ఇంటి చెట్టు గురించి. మీ బాంధవ్యాల చెట్టు గురించి. అది మీకు అర్థం కాలేదు' అంది సైకియాట్రిస్ట్.

'చూడండి. ఇది పెద్ద సమస్య కాదు. పిల్లలు ఇలా ఫీల్ అవడం మామూలే. కొన్నాళ్లకు సర్దుకుపోతారు. మర్చిపోతారు కూడా. కాని నిజంగా తన పెదనాన్న పిల్లలను మర్చిపోయి పెరగాల్సిన అవసరం వాడికీ, చిన్నాన్న కొడుకును మర్చిపోయి బతకాల్సిన అవసరం ఆ పిల్లలకీ ఉందా? ఆర్థిక సమస్యలు అవసరానికి మించి మోయాల్సిన పని లేదు. కాని చేదుగా విడిపోయి బంధాలను తెంచుకోవడం ఎందుకు? మీ అన్న మట్టి పిసకడానికి అంగీకరించక అతని స్వార్థం అతను చూసుకొని ఉంటే ఇవాళ మీరు అదే పల్లెటూళ్లో చిన్న కిరాణా కొట్టు పెట్టుకొని ఉండేవారు. అవసరం తీరిపోయింది కాబట్టి ఆయన మీకు భారం అయ్యాడు కాని జీవితానికి సరిపడా భారం ఆయన తీర్చేశాడు అని మీకు అనిపించడం లేదు. కాబట్టి ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోండి. ఏది మంచో అది గ్రహించండి' అంది సైకియాట్రిస్ట్.

* * *

ఇప్పుడు ఆరునెలలు గడిచిపోయాయి. ఈ సంవత్సరం స్కూలు మార్చడం కుదరనట్టే. కాని వచ్చే సంవత్సరానికి మళ్లీ ఆ అన్నదమ్ములు కలిసి జీవించాలని కలిసే ఉండాలని రాజకుమార్ అనుకున్నాడు.

ఆ ఆదివారమే భార్యతో బుజ్జితో అన్నయ్య ఉంటున్న ఫామ్‌హౌస్ దగ్గరకు వెళ్లారు.

బుజ్జి, చిన్నా, పెద్దా ఆ చెట్లలో రోజంతా ఆటలే.

ఆ మరుసటి రోజు స్కూల్ నుంచి టీచర్ వచ్చింది 'ఏమిటండీ మీ వాడికి అంత తక్కువ అన్నం పంపారు. వాడు పక్కనున్న పిల్లలది కూడా లాక్కుని తింటున్నాడు'.. అవతల టీచర్ తిడుతూ ఉంటే బుజ్జి తల్లి మాత్రం సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చింది.

– కథనం: **సాక్షి ఫ్యామిలీ**
ఇన్‌పుట్స్: **డా. పద్మ పాల్వాయి**, సైకియాట్రిస్ట్

రీ ఎంట్రీ

సరిలేరు నీకెవ్వరు

పదమూడేళ్ల విరామం తర్వాత విజయశాంతి మళ్లీ సినిమాల్లోకి వస్తున్నారు! మహేశ్‌బాబు హీరోగా 2020 లో విడుదల కాబోతున్న 'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో ఆమెను మనం చూడవచ్చు. నిజానికి ఆరు నెలల క్రితమే విజయశాంతి సినిమాల్లోకి రావలసి ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున ఆమె ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పర్యటించవలసి ఉన్నందున సినిమాల్లోకి రాలేకపోయారు. అయితే ఇప్పుడు సినిమాల్లోకి వస్తున్నందున రాజకీయాలకు దూరమైనట్లేనని భావించనక్కర్లేదని విజయశాంతి అంటున్నారు. ఆమె నటించిన చివరి చిత్రం 'నాయుడమ్మ'. విజయశాంతి మొదటి చిత్రం తెలుగు కాదు. అది 'కల్లుక్కుళ్ ఈరమ్' అనే తమిళ చిత్రం. విజయశాంతి రాజకీయ రంగ ప్రవేశం చేసింది కూడా ప్రాంతీయ పార్టీ కాదు. అది భారతీయ జనతా పార్టీ. అయితే ఆమె ఎలాగైతే తమిళ, తెలుగు భాషలకు మాత్రమే పరిమితం కాలేదో, అలాగే ఒక పార్టీలోనే ఉండిపోలేదు. బీజేపీలోంచి బయటికి వచ్చి సొంతంగా 'తల్లి తెలంగాణ' పార్టీని స్థాపించారు. ఆ తర్వాత తల్లి తెలంగాణను టి.ఆర్.ఎస్. లో విలీనం చేశారు. తర్వాత టి.ఆర్.ఎస్.నుంచి బయటికి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. ఆ క్షణం నుంచే విజయశాంతి మళ్లీ బీజేపీలోకి వెళ్లిపోతారనీ, లేదంటే తెలుగుదేశంలో చేరతారనీ వార్తలు మొదలయ్యాయి. తర్వాత ఆమె అన్నాడీయెంకేలో చేరబోతున్నారనే మాట కూడా వినిపించింది. అయితే ఆమె కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు.

> విజయశాంతి ఎలాగైతే తమిళ, తెలుగు భాషలకు మాత్రమే పరిమితం కాలేదో, అలాగే ఒక పార్టీలోనే ఉండిపోలేదు.

విజయశాంతి : 'ఒసేయ్ రాములమ్మ' చిత్రంలోని స్టిల్

చెట్టు నీడ

న్యాయమా శివయ్యా!

అతనొక ఉప్పు వ్యాపారి. పేరు మంగయ్య. రోజూ శివుడి ఆలయంలో నమస్కరించుకున్న తర్వాతే వ్యాపారానికి బయలుదేరుతాడు. ఆరోజు ఎప్పటికన్నా ఎక్కువ ఉప్పు బస్తాలను ఎడ్లబండిపై పెట్టుకుని వ్యాపారానికి బయలుదేరాడు. కాస్త దూరం వెళ్లేసరికి మబ్బు కమ్ముకుంది. వర్షం పడటం ఖాయం అని అనుకున్న మంగయ్య 'అయ్యో ఇప్పుడు వర్షం పడితే ఈ ఉప్పు బస్తాలన్నీ ఏమైపోవాలి' అని అనుకున్నాడు.

''దేవుడా, నేను ఇంటికి చేరే వరకూ వర్షం పడకుండా కరుణించవా... నేను నీ భక్తుడిని. నీకది తెలుసు. రోజూ నీకు దణ్ణం పెట్టుకున్న తర్వాతే అమ్మకానికి బయలుదేరుతుంటాను. నువ్వే నన్ను ఆదుకోవాలి. వర్షం పడితే ఈ ఉప్పు బస్తాలన్నీ కరిగిపోతాయి. అలా జరిగితే నేను భారీగా నష్టపోవలసి ఉంటుంది. వర్షం రాకుండా చూడవా'' అని మంగయ్య వేడుకున్నాడు.

అతను భయపడుతూనే కొన్ని అడుగులు ముందుకు వేశాడో లేదో జోరున వర్షం పడింది. బండిని నడపలేకపోయాడు మంగయ్య. బస్తాలన్నీ వర్షానికి తడిసి ఉప్పంతా కరిగిపోయింది. వాటిని ఎక్కడైతే చేర్చాలనుకున్నాడో అక్కడికి వెళ్లలేకపోయాడు మంగయ్య. పెను నష్టంతో బాధపడుతూ ఇంటికి బయలుదేరాడు.

మార్గమధ్యంలో గుడికి వెళ్లిన మంగయ్య.. 'ఓ దేవయ్యా.. శివయ్యా.. వర్షం వల్ల జరగబోయే నష్టాన్ని నీకు చెప్పి కరుణించమని కోరాను. అయినా నువ్వు నా మాట వినిపించుకోలేదు' అని నిందించాడు. లబోదిబోమన్నాడు.

ఇలా బాధపడుతున్న మంగయ్యకు శివుడు ప్రత్యక్షమయ్యాడు!

''నువ్వు నా సన్నిధిలో వర్షం రాకుండా చూడు దేవా అని నన్ను వేడుకుంటున్న సమయంలో అక్కడే నీకు సమీపంలో ఉన్న ఇద్దరు దొంగలు నిన్ను గుర్తించి గుళ్లోనే దాక్కున్నారు. నువ్వు వ్యాపారం ముగించుకుని తిరిగి వచ్చేటప్పుడు ఈ గుడికి వస్తావని వాళ్లకు తెలుసు. నువ్వు రోజూ ఇలా వచ్చి వెళ్తుంటావన్నది వాళ్లు గమనించారు. ఈరోజు కూడా నువ్వు తిరుగు ప్రయాణంలో వచ్చినప్పుడు ఇక్కడ నిన్ను అటకాయించి నీ దగ్గరున్న డబ్బులన్నీ దోచుకోవాలనుకున్నారు. ఒకవేళ నువ్వు డబ్బులు ఇవ్వకుంటే నిన్ను హత్య చేసి దోచుకోవాలనుకున్నారు. వారి నుంచి నిన్ను కాపాడటం కోసమే నీకిలా నష్టం కలిగించాను. వర్షంతో నువ్వు నష్టపోయావని తెలిసిన తర్వాత నీ వల్ల ఎలాంటి లాభమూ లేదనుకుని ఆ దొంగలు వెళ్లిపోయారు. ఇక వర్షాన్ని ఆపలేదంటావా.. వ్యాపారంలో లాభనష్టాలు సర్వసహజమని చెప్పడానికే అలా జరిగింది. మరొకసారి నీకు ఇప్పుడు కోల్పోయిన డబ్బంతా వచ్చేలా చేస్తాను'' అని అంతర్ధానమయ్యాడు. జరిగేదేదైనా మన మంచికే అనుకోవాలని, దేవుడి ఆలోచనే వేరని గ్రహించిన మంగయ్య నష్టపోతే పోయానని, ప్రాణం మిగిలిందని సంతోషించి దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుని ఇంటికి చేరాడు.



– యామిజాల జగదీశ్

ఉచిత ప్రయాణం

దారి మళ్లింపు

మహిళలు నిర్భయంగా బయటికి వెళ్లిరాలేకపోతున్నారంటే భద్రతా యంత్రాంగంలో లోపం ఉందనే కానీ.. చీకటి వెలుగులలో, రాకపోకల రహదారులలో భద్రతలేని విపరీతాలు ఉన్నాయని కాదు. అయితే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మహిళల భద్రత కోసం ఉచిత ప్రయాణం అనే 'దారి మళ్లింపు'ను ఒక పరిష్కారంగా ఎంచుకున్నారు!

● మాధవ్ శింగరాజు

విపత్తులు, విలయాలు వచ్చి.. పట్టాలు దెబ్బతిన్నప్పుడు రైళ్ల రాకపోకల్ని దారి మళ్లిస్తుంటారు. విపత్తులను, విలయాలను ప్రభుత్వాలు దారి మళ్లించలేవు కాబట్టి, ప్రజల ప్రయాణాలనే సురక్షిత మార్గాలలోకి మళ్లిస్తుంటాయి. అది ప్రభుత్వాల బాధ్యత కూడా. అమ్మాయి స్కూలుకు వెళుతోంది. లేదా ఉద్యోగానికి వెళ్లొస్తోంది. వచ్చే పోయే దారిలో లైంగిక వేధింపులు ఎదురౌతున్నాయి. ఆ వేధించే వాళ్ల నుంచి తప్పించడానికి చక్కగా చదువులకు, ఉద్యోగాలకు వెళ్లొచ్చే పిల్లల్ని దారి మళ్లించడం మాత్రం ప్రభుత్వాలు చేయదగిన పని కాదు. వేధించేవాళ్లేమీ మానవులు నిరోధించలేని విపత్తులు, విలయాలు కాదు.. బిక్కుబిక్కుమంటూ వేరే రూటులో స్కూలు బ్యాగు మోసుకుంటూ వెళ్లిరావడానికి, క్యాబ్‌లలో దొంగమొహాలు ఉంటున్నాయని మెట్రోల్లో ఆఫీసుకు ప్రయాణించడానికి! అమ్మాయిల్ని వేధించేవారికి చట్టబద్ధంగా నాలుగు తగిలించి 'సెట్రైట్' చేసే యంత్రాంగం ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఉంది.

> ఒంటిపై చెయ్యేసినవాడు తప్పించుకుని పోవడానికి వీల్లేకుండా చెయ్యాలి కానీ, ఒంటిపై చెయ్యేస్తున్నవాడి నుంచి తప్పించడానికైతే ప్రభుత్వాలు ఎందుకు?!

అయినా గానీ బాలికలు స్కూళ్లకు, మహిళలు ఉద్యోగాలకు నిర్భయంగా వెళ్లిరాలేకపోతున్నారంటే భద్రతా యంత్రాంగంలో లోపం ఉందనే కానీ.. చీకటి వెలుగులలో, రాకపోకల రహదారులలో భద్రతలేని విపరీతాలు ఉన్నాయని కాదు. అయితే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మహిళల భద్రత కోసం 'దారి మళ్లింపు'నే ఒక పరిష్కారంగా ఎంచుకున్నారు! చీకటి పడ్డాక క్యాబ్‌లలో రావడం సురక్షితం కాదు కాబట్టి, పట్టపగలైనా ఒకరిద్దరి మధ్య ప్రయాణించడం సేఫ్ కాదు కాబట్టి.. ఎప్పుడూ రద్దీగా ఉండి, జనం బాగా మసులుతుండే మెట్రో రైళ్లను, కార్పొరేషన్ బస్సులను తమ డే-టు-డే జర్నీకి ఎంచుకునేలా మహిళలందరికీ ఆయన ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించబోతున్నారు! ఆదేశాలు అమల్లోకి వచ్చిన వెంటనే ఢిల్లీ మహిళలు మెట్రో రైళ్లలో, కార్పొరేషన్ బస్సులలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా టికెట్ లేకుండా ప్రయాణించవచ్చు.

ఉచిత ప్రయాణం వల్ల మహిళలపై వేధింపులు తగ్గుతాయా అనే ప్రశ్న కనుక మీరు వేయదలిస్తే కాస్త ఆగండి. అది పూర్తిగా సంబంధం లేని ప్రశ్న. ఉచిత ప్రయాణానికి, సురక్షిత ప్రయాణానికి సంబంధం లేదు కాబట్టి! ఉచిత ప్రయాణమేమీ మహిళల ఒంటి మీది కరెంట్ జాకెట్ కాదు.. ఎవరైనా చెయ్యేస్తే చెయ్యి వేసిన వ్యక్తి షాక్ కొట్టి గిలగిల కొట్టుకుంటూ కింద పడిపోడానికి! మరి ఏడాదికి 700 కోట్ల రూపాయల వ్యయం అయ్యే ఈ 'స్కీమ్' వల్ల ప్రయోజనం ఏమిటి? ఏమీ లేదు. మహిళల్ని వేధింపుల నుంచి 'దారి మళ్లించడం'.. అంతే. లేదా ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడం. రోజుకు లక్ష మంది మహిళలకు ఈ ఏడొందల కోట్ల రూపాయల వల్ల రక్షణ లభిస్తుందని కేజ్రీవాల్ అంచనా. అంటే.. రోజూ క్యాబ్‌లలో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లొస్తుండే మహిళల్లో లక్షమంది 'ఉచితం'లోకి మళ్లుతారని. 'పాలోమంటూ.. ఉన్న వాళ్లు, లేనివాళ్లు ఉచిత ప్రయాణానికి ఎగబడితే మెట్రో రైళ్లు కిక్కిరిసి పోతాయి కదా' అనే మాటకు ఆయన వేసిన లక్ష లెక్క అది! క్యాబ్‌ల నుంచి కార్పొరేషన్ బస్సులకు షిఫ్ట్ అయ్యే మహిళల సంఖ్య ఎంతో కూడా ఆయన టీమ్ లెక్కేసే పనిలో ఉంది. వారం రోజుల్లో ఆ డేటా అంతా ఇవ్వాలని కేజ్రీవాల్ ఇప్పటికే ఆదేశాలు కూడా జారీ చేశారు! వచ్చే రెండు మూడు నెలల్లో ఢిల్లీ ప్రభుత్వం మహిళలకు కల్పించబోతున్న ఈ ఉచిత ప్రయాణ సదుపాయం వల్ల ఢిల్లీలో జెండర్ క్రైమ్ రేట్ బాగా తగ్గిపోతుందని ఢిల్లీ మొత్తం మీద కేజ్రీవాల్ ఒక్కరే బలంగా నమ్ముతున్నారు. ఢిల్లీ ప్రస్తుత జనాభా 2 కోట్ల 60 లక్షలు. ఇందులో సగం మంది మహిళలే అన్నది సాధారణమైన విషయం అయితే, ఈ సగం మందిలో లక్షకు 300 మంది ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారన్నది అసాధారణమైన సంగతి. యూ.కె.లో ఈ లెక్క 80గా, ప్రపంచం మొత్తం మీద సగటున 40గా ఉంది. ఢిల్లీ రైళ్లలో, బస్సులలో రోజుకు 60 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. వాళ్లలో మహిళలు ముప్పై లక్షల మంది ఉంటారనుకున్నా.. కేజ్రీవాల్ ఉచిత ప్రయాణం కల్పించబోతున్న రక్షణ ఈ ముప్పై లక్షలమందికి కాదు. క్యాబ్‌లు, రిక్షాల నుంచి రైళ్లకు మళ్లే రెండు మూడు లక్షలమందికి (బస్సులను కూడా కలుపుకుని). ఈ రెండు మూడు లక్షల మందిని కాపాడే బాధ్యతలను ఆయన సీసీ కెమెరాలకు అప్పగిస్తే ఇన్ని వందల కోట్లు ఖర్చు చేసే పని ఉండదు. మిగతా డబ్బును సమృద్ధిగా మహిళల సంక్షేమానికి, సంరక్షణకు ఉపయోగించవచ్చు. అప్పుడు లక్షకు 300గా ఉన్న క్రైమ్ రేటు కూడా తగ్గుతుంది. అయితే ఈ తెలివి కేజ్రీవాల్‌కు లేక కాదు.

ఢిల్లీ మెట్రో రైల్ : ఉచిత ప్రయాణం కేజ్రీవాల్ అవసరమే కానీ, మహిళల అవసరం కాదు

'నిర్భయ' ఘటన జరగడానికి ఇరవై రోజుల ముందు ఆవిర్భవించి, నిర్భయ వంటి ఘటనలు మళ్లీ జరగక్కుండా ఢిల్లీ మహిళలకు భద్రత కల్పించడమే తమ ధ్యేయమన్న హామీతో నాలుగేళ్ల క్రితం అఖండ విజయం సాధించిన కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీకి మళ్లీ ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడ్డాయి. నిజానికి ఈ మాటను మనం ఇంకోలా చెప్పుకోవాలి.. 'రోజులు దగ్గర పడ్డాయి' అని! ఎన్నికలకు ఏడాది కూడా సమయం లేని ఈ తరుణంలో కేజ్రీవాల్ తిరిగి మునుపటి హామీతోనే మోదీని ఎదుర్కోవడం తప్ప వేరే దారి లేని పరిస్థితిని ఈ నాలుగేళ్లలో ఢిల్లీలో మహిళలపై ఏమాత్రం తగ్గుముఖం పట్టని నేరాలు తెచ్చిపెట్టాయి. ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ నాయకులు పడే పాట్లు ఎలాంటివైనా.. నగరాల్లో, పట్టణాల్లో ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి చేరే వరకు పడే పాట్లన్నిటికీ ప్రధాన కారణం భద్రత లేకపోవడం అనుకుంటాం కానీ, లేకపోవడం కాదు. 'కల్పించలేకపోవడం'. నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో బీజేపీనే విజయం సాధించింది! ఆ ఏడుగురు ఎంపీల గెలుపులో కీలక పాత్ర పోషించినది కూడా.. దైనందిన జీవితంలో భద్రతను కోరుకున్న మహిళా ఓటర్లే. మహిళలు నిర్భయంగా, స్వేచ్ఛగా మసలేంత భద్రతను కల్పిస్తామని బీజేపీ ఇచ్చిన హామీ బాగా ప్రభావం చూపింది. మహిళలకు అంతకుమించిన హామీని ఏదైనా ఇస్తే తప్ప కేజ్రీవాల్ మళ్లీ అధికారంలోకి రావడం కష్టం. అందుకే ఆయన ఈ ఉచిత ప్రయాణం వైపు మళ్లినట్లున్నారు. అనుదిన జీవన పోరాటంలో భద్రత తర్వాతే మహిళకు ఏదైనా. 'ఏమమ్మా.. నీ భద్రత కోసం పెద్ద ప్రాజెక్టును తలకెత్తుకున్నాం. నీ వంతుగా పదో, ఇరవయ్యో ఇవ్వు' అని ప్రభుత్వమే వచ్చి అడిగినా.. సంతోషంగా పర్సులోంచి ఇంకో పది ఎక్కువే తీసి ఇచ్చే మహిళలకు.. భద్రత పేరుతో డబ్బులు మిగిల్చినా అది వాళ్లకు ఏం సంతోషం.. ఉచిత ప్రయాణానికీ, వేధింపులు తగ్గడానికి ఏం సంబంధం లేదని క్లియర్‌గా తెలిసిపోతుంటే?! ఒంటిపై చెయ్యేసినవాడు తప్పించుకుని పోవడానికి వీల్లేకుండా చెయ్యాలి కానీ, ఒంటిపై చెయ్యేస్తున్నవాడి నుంచి తప్పించడానికికైతే ప్రభుత్వాలు ఎందుకు?! ●

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
6-6-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను ఒకరిని ప్రాణంగా ప్రేమించాను. కానీ తను నన్ను చాలా సార్లు అవమానంగా మాట్లాడాడు. నా క్యారెక్టర్ గురించి, నా అందం గురించి. అయినా తన మీద ఇష్టం పోవట్లేదు. ఏం చెయ్యాలి అన్నయ్యా మీరే చెప్పండి.
– సిరి

మనం ప్రేమించిన వాడికి మన ప్రేమ వర్త్ తెలియదు!

సన్నాసి గాడు.. సిరి లాంటి ప్రేమ.. దళసరి హార్ట్‌లకు అర్థం కాలేదు..

ఇక్కడ రోజూ నాకొక లవ్ కూడా దొరకడం లేదని అబ్బాయిలందరూ గుండెలు చించుకుంటుంటే.. ఈ కౌన్ కిస్కా గొట్టం గాడు సిరి ప్రేమను కాదంటాడా?

'సార్!! కాదనటమే కాదు క్యారెక్టర్ మీద బురద జల్లుతున్నాడు సార్!!'

వాడి మైండ్ అంతా బురదే కాబట్టి.. వాడి హార్ట్ అంతా పెంటే కాబట్టి...

'అవును సిరి..! మనకొద్దు అలాంటి డర్టీ ఫెలో వద్దు..!! నిన్ను గౌరవించే, ప్రేమించే రాకుమారుడు నీకోసం తప్పకుండా వస్తాడు. కాన్ఫిడెన్స్ పడనివ్వద్దు!'

lovedoctorram@sakshi.com

సురేశ్ బాబు

"మా నాన్నగారి (ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు) గురించి ఆలోచించిన ప్రతిసారీ నా కళ్లలో నీళ్లు తిరుగుతాయి. ఆయన లేరనే ఆలోచనే చాలా కష్టంగా ఉంటుంది" అన్నారు నిర్మాత డి. సురేశ్‌బాబు. సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎన్నో హిట్ సినిమాలు తీసి తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఓ సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు డి. రామానాయుడు. ఇవాళ ఆయన జయంతి. అలాగే సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణరంగంలో 55ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని రామానాయుడు తనయుడు, నిర్మాత డి. సురేశ్‌బాబు చెప్పిన సంగతులు.

డబ్బంతా పోయినా నాన్నగారు భయపడలేదు

● మా సురేశ్ ప్రొడక్షన్స్‌లో తొలి సినిమా ('రాముడు-భీముడు') విడుదలై 55ఏళ్లు పూర్తయ్యాయి. 56 ఏళ్ల క్రితం ఒక వ్యక్తి (రామానాయుడు) మద్రాసు వెళ్లి అనుకున్న బిజినెస్ కుదరక, అక్కడే సినిమాలు తీస్తున్న కంపెనీలో భాగస్వామ్యం తీసుకుని, సైలెంట్ పార్ట్‌నర్‌గా ఉండి సినిమాలు తీశారు. అక్కడ పెట్టిన డబ్బంతా పోయింది. భయపడకుండా సినిమాలు చేయడం కంటిన్యూ చేశారు. ఈ క్రమంలో ఫిల్మ్‌మేకింగ్, ప్రొడక్షన్‌లో ఉన్న లోటుపాట్లను గమనించి, మెరుగుపరచాలనుకున్నారు.

● సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ బాగా ఎస్టాబ్లిష్ కావడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. 1964 నుంచి 70 ఒక ఫేజ్. 'రాముడు భీముడు' బాగా ఆడింది. ఆ తర్వాత కొన్ని ఫెయిల్యూర్స్. ఇక చావో రేవో అనే టైమ్‌లో 1970లో 'ప్రేమనగర్' తీశారు. 1970-1980లో గుడ్ టైమ్. 81-82 బ్యాడ్ టైమ్. ఆ టైమ్‌లో సినిమాలు కాకుండా వాటికి సంబంధించిన వనరులను డెవలప్ చేయడం స్టార్ట్ చేశారు నాన్నగారు. 82లో నేను వచ్చాను. స్టూడియో, ఎగ్జిబిషన్, డిస్ట్రిబ్యూషన్ వైపు వచ్చాం. వెంకీ (హీరో వెంకటేశ్), నేను ఉండటం వల్ల సంస్థ ముందుకు వెళ్లింది. నాన్నగారు చనిపోయాక ఈ రోజు మేం హ్యాపీగా ఉన్నది ఒక్క విషయంలోనే.. అదేంటంటే ఆయన ఉన్న రంగంలోనే ఫ్యామిలీలో అందరూ ఆల్మోస్ట్ వర్క్ చేస్తున్నాం.

● సినిమాల్లోకి రావొద్దు. బాగా చదువుకోమని నాన్న అనేవారు. కానీ నేను సినిమా కలెక్షన్స్, సినిమా రిపోర్ట్స్ రాస్తూ సినిమాలకే కనెక్ట్ అయ్యాను. మా నాన్నగారు నాతో 'నిరంతర శత్రువులు ఉండకూడదు. క్షమించాలి, మరచిపోవాలి. బౌండ్‌స్క్రిప్ట్‌తో సినిమా మొదలుపెట్టాలి. కుటుంబానికి టైమ్ కేటాయించాలి. రోజూ నిద్రపోయే ముందు అప్పులు, లాభాలను బేరీజు వేసుకోవాలి'.. అంటూ ఇలా చాలా విషయాలను చెప్పారు.

● మా నాన్న మాటిస్తే ఆ మాట మీద ఉండేవారు. ఆ బలహీనతను తీసుకుని కొందరు డైరెక్టర్స్ ఆడని సినిమాలు తీశారు. అయినప్పటికీ ఆయన ఏమీ అనలేదు. మాట ఇవ్వడం మానలేదు. నాన్నగారు చనిపోవడానికి రెండు మూడు రోజుల ముందు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంగారు వచ్చారు. 'బాలూ.. కథ చూడు. మంచి సినిమా చేద్దాం' అన్నారు. ఆయనకు తెలిసింది సినిమానే.

● అప్పట్లో మా నాన్నగారు ఫిల్మ్‌మేకింగ్‌లో చూసిన కొన్ని లోపాలు ఇప్పటికీ ఉన్నాయి. అందుకే మా ప్రొడక్షన్ కంపెనీ ఇప్పుడు కంటెంట్, టాలెంట్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీ అంశాలపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించుకున్నాం. ఇందుకోసం రానా, నేను కంప్లీట్ ఎంటర్‌టైన్మెంట్ ఎకో సిస్టమ్‌ను డెవలప్ చేస్తున్నాం. ఈ కంటెంట్‌ను కేవలం సినిమాలకే కాదు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లోనూ వినియోగిస్తాం. పార్ట్‌నర్స్‌ను చూస్తున్నాం. ఎలా అయితే హాలీవుడ్ వారు మార్వెల్, స్టార్‌వార్స్‌కి సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారో, మన మైథాలజీ తో 'అమర చిత్ర కథలు'ను అలానే ప్లాన్ చేస్తున్నాం.

● ఫిల్మ్‌మేకింగ్‌లో కొందరు యంగ్‌స్టర్స్ ప్రీ ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌లో కొన్ని మిస్టేక్స్ చేస్తున్నారు. మొహమాటంతో నేర్చుకోవడం వదిలేస్తున్నారు. ఇండస్ట్రీని తప్పు పట్టడం లేదు. కొత్త విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నాను.

● ఒకప్పుడు బాలీవుడ్‌లో ప్రొడక్షన్ పరంగా సరైన విధానాలు ఉండేవి కావు. ఇప్పుడు కార్పొరేట్ విధానాలతో మరింత ముందుకు వెళ్తున్నారు. 'ఉరి' లాంటి సినిమాను 45 రోజుల్లో తీశారు. మార్వెల్ అవెంజర్స్ సినిమాను వందరోజుల్లోపు తీశారు. మనం మాత్రం పెద్ద పెద్ద సినిమాలు తీయడానికి 200 రోజులు తీసుకుంటున్నాం. ఎక్కడో మిస్టేక్స్ ఉన్నాయి. అందుకే మేం 'ప్రొడక్షన్ ప్రాసెస్ స్టాండర్డ్'ను క్రియేట్ చేస్తాం. జామ్‌ఎయిట్ ప్రాసెస్, థీమ్ పార్క్, డిజిటల్ మార్కెటింగ్ ఇలా ఎంటర్‌టైన్మెంట్‌ను 360 డిగ్రీస్ యాంగిల్‌లో కవర్ చేయాలనుకుంటున్నాం. ఈ ప్రొడక్షన్ ప్రాసెస్ స్టాండర్డ్‌లో కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఎవరైనా రావొచ్చు. నేషనల్ అండ్ ఇంటర్‌నేషనల్ ట్రైనర్స్‌ను కూడా పెట్టాలనుకుంటున్నాం.

● ఆడియన్స్‌ను థియేటర్స్‌కు రమ్మని ఫోర్స్ చేయలేం. వాళ్ల చాయిస్‌కి తగ్గట్టు సినిమాలు చూస్తారు. పెద్ద సినిమా బాగాలేకపోయినా వెళ్తారు. చిన్న సినిమాలకు అలా ఉండదు. 'కంచరపాలెం'తో మేం అసోసియేట్ అవ్వడం వల్ల చిన్న సినిమా అయినా ఆ స్థాయికి వెళ్లగలిగింది.

● 'వెంకీమామ' చిత్రం షూటింగ్ జరుగుతోంది. తరుణ్ భాస్కర్, త్రినాథరావు దర్శకత్వాల్లో వెంకటేశ్ హీరోగా సినిమాలు ఉన్నాయి. 'దేదే ప్యార్‌దే' రీమేక్ రైట్స్ తీసుకున్నాం. రానా 'విరాటపర్వం' త్వరలో ప్రారంభం అవుతుంది. ఇవి సురేశ్ ప్రొడక్షన్స్ పార్ట్‌నర్‌షిప్‌లో కావొచ్చు లేదా సురేశ్ ప్రొడక్షన్స్ నిర్మించవచ్చు. సురేశ్ ప్రొడక్షన్స్ ఫండ్ చేసి డిస్ట్రిబ్యూట్ చేయవచ్చు. లవ్‌రంజన్ (బాలీవుడ్ డైరెక్టర్)-సురేశ్ ప్రొడక్షన్స్ జాయింట్ వెంచర్ ఉంది. అతని హిందీ సినిమాలు రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నాం.

పూజా ఇన్

అల్లు అర్జున్

ఇన్ని రోజులూ జోడీ లేకుండానే అల్లు అర్జున్ షూటింగ్ చేశారు. ఇక బన్నీ జోడీ పూజా హెగ్డే కూడా జాయిన్ అయ్యారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్, పూజా హెగ్డే జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. గీతా ఆర్ట్స్, హారికా హాసినీ క్రియేషన్స్ బ్యానర్లపై అల్లు అరవింద్, కె.యస్. రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెండో షెడ్యూల్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో పూజా హెగ్డే జాయిన్ అయ్యారు. ''అద్భుతమైన టీమ్‌తో పని చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా మిమ్మల్ని క్రేజీగా ఎంటర్‌టైన్ చేస్తుంది'' అని పేర్కొన్నారు పూజా హెగ్డే. ఇందులో టబు, మలయాళ నటుడు జయరామ్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి పీడీవీ ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

పూజా హెగ్డే

వంద సినిమాల్లో ఒకటిలా ఉండదు

''కళకు భాషతో సంబంధం లేదని మళ్లీ మళ్లీ నిరూపిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. అందర్నీ ఆదరిస్తారు. ఈ సినిమా కూడా బాగుంది.. పెద్ద హిట్ అవుతుంది.. మళ్లీ సక్సెస్ మీట్‌లో తప్పకుండా కలుద్దాం'' అన్నారు విజయ్ ఆంటోని. అర్జున్, విజయ్ ఆంటోని హీరోలుగా, ఆషిమా నర్వాల్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కొలైగారన్'. ఆండ్రూ లూయిస్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాని టి.నరేష్‌కుమార్-టి.శ్రీధర్ 'కిల్లర్' పేరుతో తెలుగులో రేపు విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత ప్రదీప్ మాట్లాడుతూ- ''విజయ్ ఆంటోని, అర్జున్.. తమ నటనతో ఆకట్టుకున్నారు. కథ చాలా బాగుంటుంది. అందుకే తెలుగులో విడుదల చేస్తున్నాం. ఇంట్రెస్టింగ్ అంశాలు, ఉత్కంఠ పరిచే సన్నివేశాలు చాలా ఉన్నాయి'' అన్నారు. ''ఈ సినిమాతో తమిళంలోకి హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఎప్పటికైనా సావిత్రిగారంత పెద్ద హీరోయిన్ అవ్వాలన్నదే నా లక్ష్యం'' అన్నారు ఆషిమా నర్వాల్. ''ఇది నా మొదటి తెలుగు సినిమా. పాటలకు ఇంత మంచి స్పందన ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు సంగీత దర్శకుడు సైమన్ కె. కింగ్. ''వంద సినిమాల్లో ఒక సినిమాలా 'కిల్లర్' ఉండదు.. వంద సినిమాలకు ఒక సినిమాలా ఉంటుంది'' అని చిత్ర రచయిత భాషా శ్రీ అన్నారు.

ఆండ్రూ, విజయ్ ఆంటోని, ఆషిమా, సైమన్, శ్రీధర్, సజ్జు

ఆట ముగిసింది

తాప్సీ

గేమ్ ఓవర్ అంటున్నారు తాప్సీ. ఇంతకీ ఏ ఆట? ఎవరు ఎవరితో ఆడారు? చివరికి ఎవరి ఆట ముగిసింది? అన్నది తెలియాలంటే ఈ నెల 14 వరకూ వేచి చూడాల్సిందే. తాప్సీ లీడ్ రోల్‌లో అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఓవర్'. వై నాట్ స్టూడియోస్ పతాకంపై ఎస్.శశికాంత్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషలలో ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ- ''భారతీయ సినీ చరిత్రలో ఇంత వరకూ రాని సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. వెన్నులో వణుకు పుట్టించే కథ, కథనాలు ఈ థ్రిల్లర్ మూవీ ప్రత్యేకతలు. హిందీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రానికి హిందీలో సమర్పకునిగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1200కు పైగా స్క్రీన్స్‌లో సినిమా రిలీజవుతోంది. మూడు భాషల్లోని చిత్ర ప్రముఖులు 'గేమ్ ఓవర్' ట్రైలర్‌ను చూసి ప్రశంసలతో ట్వీట్స్ చేయటంతో ప్రేక్షకుల్లో మా చిత్రంపై అంచనాలు పెరిగాయి. మా బ్యానర్లో వచ్చిన 'లవ్ ఫెయిల్యూర్','గురు' చిత్రాల విజయాల సరసన ఈ 'గేమ్ ఓవర్' నిలుస్తుంది'' అన్నారు. ''గేమ్ ఓవర్' చిత్రం ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను కలిగిస్తుంది. అశ్విన్ శరవణన్ తెరకెక్కించిన తీరే దీనికి కారణం'' అన్నారు తాప్సీ. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: ముత్తురామలింగం, సహ నిర్మాత: చక్రవర్తి రామచంద్ర.

జీరో నుంచి వందకి తీసుకెళ్లింది

కార్తికేయ

"ఎలాంటి సినిమాలు చేయాలనే విషయంలో నాకు ఫుల్ క్లారిటీ ఉంది. కన్‌ఫ్యూజన్ లేదు. కథ నాకు నచ్చి, డైరెక్టర్ చేయగలుతాడనే నమ్మకం వస్తే సినిమా చేయడానికి వెంటనే ఒప్పుకుంటాను" అని కార్తికేయ అన్నారు. టీఎన్ కృష్ణ దర్శకత్వంలో 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ హీరోగా కలైపులి యస్. థాను నిర్మించిన చిత్రం 'హిప్పీ'. ఇందులో దిగంగనా సూర్యవన్షీ, జజ్జా సింగ్ కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కార్తికేయ చెప్పిన విశేషాలు.

● 'హిప్పీ' సినిమా బాగా వచ్చింది. నేను బాగా నటించాననే నమ్మకం ఉంది. ఆడియన్స్‌కి నన్ను నేను డిఫరెంట్‌గా చూపించుకోబోతున్నాను. సినిమా చూసిన తర్వాత రివ్యూలు ఎలా ఉంటాయి? ఆడియన్స్ నా గురించి ఎలా మాట్లాడుకుంటారు? అని ఎగ్జైటింగ్‌గా ఎదురు చూస్తున్నాను.

● జేడీ చక్రవర్తిగారి గురించి 'జేడీ.. ఉంటే సినిమా ఫినిష్ కాదు. సెట్‌లో నుంచి వెళ్లిపోతారు' అని కొందరు రాంగ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. కానీ అంతా రివర్స్. ఆఫ్‌స్క్రీన్‌లో మేం ఫ్రెండ్స్ అయిపోయాం. సార్.. కొందరు మీ గురించి బ్యాడ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చారని చెప్పాను. 'వాళ్లు చెప్పింది నిజమే. నచ్చని సినిమాలకు నేను అలానే చేశా'నని జేడీ అన్నారు.

● టీఎన్‌కృష్ణగారు కథ చెబుతా అన్నప్పుడు 'ఏమాయ చేసావె' లాంటి సాఫ్ట్ లవ్‌స్టోరీ ఎక్స్‌పెక్ట్ చేశాను. కథ నరేట్ చేసిన తర్వాత అర్థం అయ్యింది. ఇది 'ఆర్ఎక్స్ 100' సినిమాకు ఫుల్ డిఫరెంట్ అని.

● 'ఆర్ఎక్స్ 100'తో పెద్దహిట్ వచ్చిందని అందరూ అంటున్నారు. కానీ థానుగారులాంటి పెద్ద ప్రొడ్యూసర్ నాతో సినిమా చేయడానికి రెడీ అయినప్పుడు ఆ నమ్మకం నాకు వచ్చింది. నాపై నాకు భరోసా కలిగింది. 'ఆర్ఎక్స్ 100 'సినిమాను మేమే తీశాం. నాకు ఫస్ట్ ఎర్నింగ్ థానుగారే ఇచ్చారు. అడ్వాన్స్‌గా పది లక్షలు తీసుకున్నాను.

● ఒక హిట్ సినిమా తర్వాత వస్తున్న సినిమా కాబట్టి నిజానికి ఒత్తిడిలోనే ఉన్నాను. 'ఆర్ఎక్స్ 100' రిలీజ్‌కు ముందు జీరోలో ఉన్నాను. ఆ సినిమా జీరో నుంచి 100కి తీసుకెళ్లింది. సో... ఇది 101 వస్తేనే సక్సెస్ వచ్చినట్లుగా ఫీల్ అవుతున్నాను.

● 'ఆర్ఎక్స్100' సినిమాతో పోలిస్తే ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ డిఫరెంట్‌గా ఉంటాయి. నా ఏజ్ ప్రకారం నాకు లవ్‌స్టోరీలే వస్తాయి. లవ్‌స్టోరీలు అన్నప్పుడు లిప్ లాక్‌లు తప్పవు. రియలిస్టిక్ సినిమాలు చేయాలి. న్యాచురల్‌గా ఉండాలి, అందరికీ కనెక్ట్ అవ్వాలి అన్నప్పుడు లిప్‌లాక్ సీన్స్‌ను కూడా న్యాచురల్‌గానే చూపించాలి.

● పాతికేళ్ల వయసు వచ్చేసరికి ఏ అమ్మాయికైనా, ఏ అబ్బాయికైనా ఎవరూ నచ్చకుండా ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. కాలేజ్ డేస్‌లో ఓ లవ్‌ఫెయిల్యూర్ ఉంది.

● ఇప్పటి యంగ్ హీరోలతో కాంపిటీషన్ ఫీలయ్యే స్టేజ్‌కి నేను ఇంకా రాలేదు. నాకు పెద్దగా ఫ్యాన్స్ లేరనుకుంటా. ఇటీవల ఇద్దరు యంగ్ హీరోల మధ్య వినిపించిన ఫ్యాన్స్ వార్ మిస్‌అండర్‌స్టాండింగ్ వల్లే వచ్చిందని నా భావన.

● 'ఆర్ఎక్స్ 100' సినిమాకు ఫస్ట్ బ్యాడ్ రివ్యూస్ వచ్చాయి. ఇక క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేయాలా? అనుకున్నాను. నిజంగా భయం వేసింది. నెక్స్ట్ డే థియేటర్‌లోకి వెళితే ఆడియన్స్ బ్లాక్‌బస్టర్ అన్నారు. అప్పుడు రివ్యూస్‌పై కోపం వచ్చింది. ఏదైనా తేడా జరిగితే నాది, పాయల్, అజయ్ ఇలా అందరి కెరీర్‌లకు ఇబ్బంది కలిగేది.

● ప్రస్తుతం 'గుణ 369, గ్యాంగ్‌లీడర్' చేస్తున్నాను. శేఖర్ రెడ్డి, వీవీ వినాయక్ దగ్గర అసిస్టెంట్‌గా వర్క్ చేసిన శ్రీ సరిపల్లితో సినిమా చేయబోతున్నాను.

హెల్దీ టేస్టీ లంచ్ బాక్స్

ఇక వచ్చే వారం నుంచి మళ్లీ పిల్లలకు స్కూళ్లు మొదలవ్వబోతున్నాయి. వేసవి సెలవుల వల్ల ఇప్పటివరకూ ఇంట్లోనే కళ్ల ముందు ఉన్న పిల్లలు నేడో రేపో బడికి వెళ్లక తప్పదు. బాక్స్ కట్టి ఇచ్చినా అక్కడ వాళ్లేం తింటారో ఎలా తింటారో అసలు తింటారో లేదో అన్న బెంగ తల్లులకు వారం రోజుల ముందునుంచే మొదలైపోతుంది. ఇప్పటివరకూ ఇంట్లో ఉంటేనే ఎన్నోసార్లు బతిమిలాడితేగానీ పిల్లలు ఇంతన్నా తినరు. అలాంటి ఆ లంచ్ టైమ్‌లో ఎంత తింటారో తెలియదు. అందుకే స్కూల్ మొదలయ్యాక... మన ఎదిగే పిల్లలకు పోషకాలేమీ మిస్ కాకుండా ఇవ్వాల్సిన ఆహారం ఎలా ఉండాలో తెలుకునేందుకే ఈ కథనం.

స్కూలుకు బయలుదేరేముందు పిల్లలు చాలా హడావుడిగా ఏదో తినేస్తుంటారు. బడికి టైమ్ అవుతుందన్న తొందరలో ఇంత నోట్లో వేసుకొని బయలుదేరుతారు. పైగా చాలా స్కూళ్లు ఎనిమిదింటికల్లా మొదలైపోతుంటాయి. దాంతో పిల్లలు నింపాదిగా, నిమ్మళంగా తినడానికే టైమ్ ఉండదు. అయితే స్కూల్‌కు వెళ్లే ముందర కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు ఉన్న ఆహారం తీసుకోవడం పిల్లలకు చాలా మేలు చేస్తుంది. వాళ్లు ఆరోగ్యకరంగా ఎదగడానికి చాలా ఉపయోగపడుతుంది. అంతేకాదు... అలా పొద్దున్నే టిఫిన్ తిన్న పిల్లల్లో ఏకాగ్రత, విజయసాధన అవకాశాలు చాలా ఎక్కువని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. వివిధ వయసుల్లోని స్కూలు పిల్లలకు ఏయే పోషకాలు అవసరమో తెలుసుకుందాం.

ప్రోటీన్ ఇవ్వడం మరవద్దు

రోజును మంచి ప్రోటీన్‌తో ప్రారంభించడం పిల్లలకు ఎంతో మేలు చేస్తుంది. ఎదిగే వయసు పిల్లల విషయంలో ప్రోటీన్లను 'బిల్డింగ్ బ్లాక్స్'గా చెబుతుంటారు ఆహార నిపుణులు. అంటే భవన నిర్మాణానికి ఇటుకలు ఎలాగో... శరీర నిర్మాణానికి ప్రోటీన్లు అలాగన్నమాట. పైగా ప్రోటీన్లు మన కండరాల్లో అయిన గాయాలను ఎప్పటికప్పుడు రిపేర్లు చేస్తుంటాయి.

అందుకే ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పిల్లలకు ప్రోటీన్లు పుష్కలంగా ఉండే గుడ్డు పెట్టవచ్చు. దాంతోపాటు వెన్న, పెరుగు వంటి వాటిల్లోనూ ప్రోటీన్ ఎక్కువగానే ఉంటుంది. అలాగే పప్పులో కూడా ప్రోటీన్ ఎక్కువ. అందుకే పూరీ/చపాతీతో పాటు పప్పు లేదా శనగల వంటివి ఇవ్వడం వల్ల అటు పూరీ/చపాతీలోని కార్బోహైడ్రేట్లతో పాటు ఇటు పప్పు, శనగలు, గుడ్డు వంటి వాటి నుంచి ప్రోటీన్ కూడా సమకూరుతుంది.

స్కూల్ నుంచి రాగానే...

పిల్లలు స్కూల్ నుంచి రాగానే వారికి ''పవర్'' స్నాక్స్ ఇవ్వడం మంచిది. అంటే ఇందులో భాగంగా పొట్టు తీయని ధాన్యంతో తయారు చేసిన బ్రెడ్ ముక్కలకు వెన్న, చీజ్ వంటివి పుష్కలంగా రాసి, ఆ బ్రెడ్ ముక్కల మధ్యన తాజా ఆకుకూరలు, కీర, టొమాటో వంటి కాయగూరలు నింపి శాండ్‌విచ్‌లు తయారు చేసి ఇవ్వాలి. వీటితో పాటు అరటిపండ్లు ఇవ్వడం మంచిది. పిల్లలు స్కూల్‌లో బాగా ఆటలాడి వచ్చినా లేదా స్కూల్ నుంచి రాగానే ఆటలకు వెళ్లాలనుకున్నా ఈ తరహా శాండ్‌విచ్‌లు వారికి అవసరమైన పోషకాలను, తక్షణ శక్తిని ఇస్తాయి.

రాత్రి వేళలో ద్రవాహారాలు ఇవ్వండి

పిల్లల రాత్రి భోజనం సమయంలో వారికి ద్రవాలు ఎక్కువగా ఇవ్వడం మంచిది. ఎందుకంటే ఉదయం నుంచి స్కూలుకు వెళ్లడం, ఆటలాడటం వంటి కార్యకలాపాలతో వారు చేసిన శారీరక శ్రమ వల్ల వారు కోల్పోయిన వారి ఒంట్లోని లవణాలు, ద్రవాలు మళ్లీ భర్తీ చేయాల్సిన అవసరం ఉంటుంది.

పిల్లల లంచ్‌బాక్స్ ఎలా ఉండాలంటే...

పిల్లలు స్కూల్లో దాదాపుగా ఒక పూట లేదంటే రెండు పూటలు తింటారు. ఆ బాక్స్ ఈ కిందివిధంగా ఉండటం వారి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

పిల్లల లంచ్-బాక్స్ ఎలా ఉండాలనేందుకు చాలా సింపుల్ ఫార్ములా ఉంది. అదేమిటంటే... వారి లంచ్‌బాక్స్‌లో సగం... రంగురంగుల తాజా పండ్ల ముక్కలతో నింపండి. (ఇందులో కనీసం రెండు నుంచి మూడు రకాలు ఉండాలి). ఆ తర్వాత మరో పావు భాగం దంపుడు బియ్యం (పాలిష్ చేయని బియ్యం)తో వండిన అన్నం లేదా పొట్టు తీయని ధాన్యాలతో చేసిన చపాతీలు నింపండి. ఇక మిగతా పావు భాగాన్ని ప్రోటీన్ పుష్కలంగా ఉండే కూరలతో నింపండి. అంటే శాకాహారులైతే బీన్స్, కిడ్నీ-బీన్స్, ఛోలే వంటి వాటితో వండిని కూరలు గానీ... మాంసాహారులైతే చికెన్, చేపలతో వండిన కూరలను ప్రతిరోజూ మార్చి మార్చి వారికి ఇస్తుండాలి. ఇక వారు రోజూ తగినన్ని నట్స్ కూడా తినేలా చూడాలి. ఇక అన్నం, చపాతీలకు బదులుగా తమకు అందుబాటులో ఉన్నవారు హోల్‌గ్రెయిన్ పాస్తా, క్వినోవా వంటి వాటినీ వండి ఇవ్వవచ్చు.

- అరబాక్స్ పండ్లలో ఏమేం ఉండాలంటే... తాజా ద్రాక్ష, ఆపిల్స్, పుచ్చపండు ముక్కలు, స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, అరటిపండ్లు వంటివి
- రంగురంగుల పచ్చికాయగూరల్లో... క్యారట్, దోస, కీర, బ్రాకలీ, బెల్‌పెప్పర్ (బెంగుళూరు మిర్చీల పేరిట ఇవి ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగుల్లో లభ్యమవుతుంటాయి), టొమాటోల వంటి వాటిని ముక్కలుగా కోసి పండ్ల ముక్కలతో పాటు కలిపి కొన్ని ఇవ్వాలి
- ప్రోటీన్‌లు పుష్కలంగా ఉండే ఆహారాలివే... బీన్స్, శనగలు, పీనట్ బటర్, చికెన్, చేపలు, ఉడకబెట్టిన గుడ్లు
- ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు ఏమిటంటే... పొట్టు తీయని పాస్తా, పొట్టు తీయని ధాన్యాలతో చేసిన బ్రెడ్, ముడిబియ్యంతో వండిన అన్నం, ఓట్స్ వంటివి
- ద్రవాహారాలుగా పాల ఉత్పాదనలివి... పాలు, ఫ్లేవర్డ్ మిల్క్, పెరుగు, వెన్న, కాటేజ్ చీజ్, సోయా పాలు, (అందుబాటులో ఉన్నవారు సోయా యోగర్ట్ వంటివి తీసుకోవచ్చు). వీటిలో పిల్లల ఎముకలను బలంగా చేయడానికి, వారు ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడే క్యాల్షియమ్, విటమిన్-డి పుష్కలంగా ఉంటాయి. ప్రోటీన్లు కూడా ఉండనే ఉంటాయి.

ఇక పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత వారికి మీరే భోజనం ఎలాగూ పెడతారు. వారు ఇంట్లో ఉన్నప్పుడు తక్కువ మోతాదుల్లో వీలైనన్ని ఎక్కువ సార్లు మీరు ఇంట్లో తినే ఆరోగ్యకరమైన భోజనం పెట్టండి.

వేర్వేరు వయసుల పిల్లలకు లంచ్ బాక్స్ ఇలా...

- **మూడున్నర ఏళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల లంచ్‌బాక్స్ :** ఇప్పుడు పిల్లలు మూడున్నర ఏళ్ల నుంచే ప్రీ-స్కూల్ అంటూనో, ఎల్కేజీ, యూకేజీ అంటూనో స్కూలుకు వెళ్తున్నారు. ఆ వయసు నుంచి ఆరేళ్ల లోపు వారి లంచ్ బాక్స్ ఈ కింద ఉన్న పదార్థాలతో ఉండటం మంచిది. వారి బాక్స్‌లో పొట్టు తీయని ధాన్యాలతో చేసిన రొట్టెలు (రోటీ-పప్పు), ముడిబియ్యంతో వండిన అన్నం (దాల్-చావల్), శాండ్‌విచ్ పరాఠాలు వంటివి ఇవ్వవచ్చు.

ఈ వయసు పిల్లలు తినే ఆహారపదార్థాల్లో కొన్ని ఆప్షన్స్ చూద్దాం.

1 క్యారట్ రైస్ + బీన్స్ కూర + ఆకుకూరలతో చేసిన కూర+ పెరుగు + పండ్లు
2 పాలక్ రైస్ + పప్పు (1 కప్పు) + ఏదైనా ఆకుకూర/కాయగూర (1 కప్పు) + పెరుగు + పండ్లముక్కలు
3 బీట్‌రూట్ రోటీ + ఏదైనా ఆకుకూర/కాయగూర (ఒక కప్పు) + ఒక ఉడకబెట్టిన గుడ్డు + పెరుగు + పండ్లముక్కలు
4 మిక్స్‌డ్ వెజిటబుల్ రైస్ గ్రీన్‌పీస్ పనీర్ కూర లేదా చిక్కుళ్ల వంటి ప్రోటీన్ కూర + పెరుగు + పండ్ల ముక్కలు.

- **6 - 12 ఏళ్ల పిల్లల లంచ్ బాక్స్:** ఈ పిల్లల్లో ఎదుగుదల చాలా వేగంగా జరగుతుంటుంది. వాళ్లకు అవసరమైన రోజువారీ శక్తి (ఎనర్జీ) కూడా ఎక్కువే. ఈ రెండు అవసరాలు తీరేలా వారి ఆహారం ఉండాలి. వారి ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజలవణాలు ఎక్కువగా ఉండాలి. అయితే వారికి చాలా ఎక్కువ శక్తి అవసరం కాబట్టి వారి ఆహారంలో అధిక క్యాలరీలను ఇచ్చే ఆరోగ్యకరమైన పదార్థాలే ఉండాలి తప్ప... ఎక్కువ క్యాలరీలను ఇచ్చే చక్కెర పదార్థాలు (కోలా డ్రింక్స్‌లో ఉండే షుగర్స్ వంటివి), చెడు కొవ్వు పదార్థాలు (ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు వాడే మార్జరిన్ వంటి నూనెలతో చేసిన పదార్థాలు) ఉండకూడదు. అందుకే వారికి సాఫ్ట్‌డ్రింక్స్, చిప్స్, క్యాండీలు, తియ్యటి డెజర్ట్స్ చాలా తక్కువగా/పరిమితంగా మాత్రమే ఇవ్వాలి. ఎప్పుడో ఒకసారి రుచికోసం మాత్రమే ఇవి అని వారు గుర్తుంచుకునేలా వారికి మంచి ఆహారపు అలవాట్లను మప్పాలి. ఈ వయసు పిల్లల్లో ముడి బియ్యం, పొట్టుతీయని ధాన్యాలతో వండిన పదార్థాల వల్ల వారికి కార్బోహైడ్రేట్లతో పాటు పీచుపదార్థాలు, విటమిన్-బి కాంప్లెక్స్ వంటివి దొరుకుతాయి. ఇక తాజా పండ్లు, ఆకుకూరలు, కాయగూరల నుంచి విటమిన్-ఏ, విటమిన్-సి, పొటాషియమ్, పీచుపదార్థాలు లభ్యమవుతాయి. అందుకోసం వారి రాత్రి భోజనంలో అన్నంతో పాటు కరకర నమిలి తినే క్యారట్లు, ఆపిల్స్ ఇవ్వాలి. డిన్నర్‌లో వారి కూరల్లో బ్రాకలీ, బెల్‌పెప్పర్, మొక్కజొన్న గింజలు, గ్రీన్‌సలాడ్స్ అందేలా చూడాలి. ఆరెంజ్ వంటి తాజా పండ్లు ఇవ్వాలి. పిల్లల ఎదిగే అవసరాల కోసం క్యాల్షియమ్, పొటాషియమ్, మ్యాంగనీస్, ఫాస్ఫరస్ వంటివి బాగా అందేలా చూడాలి. ఇందుకోసం వీలైతే మూడు పూటలా లేదా కనీసం రెండు పూటలా పాలు, పాల ఉత్పాదనలు తీసుకునేలా చూడాలి. ఒకవేళ పాలు తాగని వారు సోయామిల్క్, సోయా పెరుగు, క్యాల్షియమ్ సెట్ టోఫూ తీసుకునేలా చూడాలి.

వారి ప్రోటీన్ అవసరాల కోసం కొవ్వు తక్కువగా ఉండే చికెన్, తాజా చేపల కూర, బీన్స్, నట్స్, ఇవ్వాలి. అలాగే ఆ మాంసాహారం వల్లనే వారికి ఐరన్, జింక్‌తో పాటు బి-విటమిన్‌లోని బి12 వంటివీ సమకూరతాయని గుర్తుంచుకోండి. ఈ వయసులోని పిల్లలకు వారంలో వీలైనన్ని సార్లు గుడ్లు ఇవ్వవచ్చు. రోజుకో గుడ్డు తప్పక ఇవ్వడమూ వారికి మేలు చేస్తుంది. అలాగే ఈ వయసు పిల్లలు ఆటలు ఎక్కువ ఆడతారు. కాబట్టి వారు తరచూ వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగేలా చూసుకోవాలి.

ఈ వయసులో పిల్లలు చాలా వేగంగా ఎదుగుతుంటారు. వాళ్ల ఎదుగుదలకు తగ్గట్లుగా పోషకాలు అందేలా వాళ్ల లంచ్ బాక్స్ ఉండాలి. ఒకవేళ అన్ని పోషకాలు అందక వాళ్ల ఎదుగుదల తగినంత వేగంగా జరగకపోయినా లేదా అనీమియా వంటి లోపాలు కనిపించినా డాక్టర్ సలహాలతో న్యూట్రిషనల్ సప్లిమెంట్స్ వాడటం మంచిది. ఎందుకంటే ఈ వయసులో ఆహార లోపాలవల్ల భవిష్యత్తులో వాళ్లకు హార్మోన్ సమస్యలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

13-18 ఏళ్ల పిల్లల లంచ్‌బాక్స్...

ఈ వయసు పిల్లల్లో పెరుగుదల చాలా ఎక్కువ. పైగా మిగతా అన్ని దశలతో పోలిస్తే ఆహారం, పోషకాల అవసరం ఈ దశలో చాలా ఎక్కువ. ఫ్రెండ్స్ ప్రభావాలతో ఆహారపు అలవాట్లు మారిపోయే అవకాశం కూడా ఉంది. తమ స్నేహితులతో కలిసి తినేందుకు వారు లంచ్ బాక్స్‌ను కూడా స్కిప్ చేస్తుంటారు. ఇలాంటి వారు జంక్‌ఫుడ్‌కు అలవాటు పడే ప్రమాదం ఉంది. స్వీట్స్, బాగా ప్రాసెస్ చేసిన ఆహారం, వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్స్ వైపు మొగ్గుచూపి ఆరోగ్యకరమైన ఆహారానికి దూరమయ్యేందుకు అవకాశాలు ఎక్కువ. చిప్స్, పిజ్జా, బర్గర్స్‌కు సాధ్యమైనంత దూరంగా ఉంచి అన్ని రకాల ఆకూకూరలు, కూరగాయలు, మాంసాహారంతో ఆరోగ్యకరమైన సమతుల ఆహారం అందేలా చూడాలి. 6-12 ఏళ్ల పిల్లలకు ఇచ్చే ఆహారాలే మరింత ఎక్కువ మోతాదుల్లో వీరి లంచ్‌బాక్స్‌లో ఉండాలి. ఈ వయసు పిల్లలు లంచ్ బాక్స్ తీసుకెళ్లేలా పేరెంట్స్ జాగ్రత్త తీసుకోవాలి.

పిల్లలకు అందాల్సిన క్యాలరీలు...

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫార్సుల మేరకు 4 నుంచి 18 ఏళ్ల వరకు వయసుండే పిల్లలకు అవసరమైన క్యాలరీల వివరాలు

అమ్మాయిలు...	4 - 8 ఏళ్ల అమ్మాయిలకు రోజుకు 1200 క్యాలరీలు 9 - 13 ఏళ్ల అమ్మాయిలకు రోజుకు 1600 క్యాలరీలు 14 - 18 ఏళ్ల అమ్మాయిలకు రోజుకు 1800 క్యాలరీలు
అబ్బాయిలకు...	4- 8 ఏళ్ల అబ్బాయిలకు రోజుకు 1400 క్యాలరీలు 9 - 13 ఏళ్ల అబ్బాయిలకు రోజుకు 1800 క్యాలరీలు 14 - 18 ఏళ్ల అబ్బాయిలకు రోజుకు 2200 క్యాలరీలు అవసరం.
కొవ్వు శాతం	కొవ్వుల విషయానికి వస్తే అమ్మాయిలైనా, అబ్బాయిలైన వారి ఆహారంలో కొవ్వులు రోజుకు 25% నుంచి 35% వరకు ఉండవచ్చు.
పాలు	అమ్మాయిలైనా, అబ్బాయిలైనా 4 - 8 ఏళ్ల వయసు వారు రోజుకు రెండు కప్పులు, 9 - 18 ఏళ్ల వారు రోజుకు మూడు కప్పుల వరకు పాలు, పాల ఉత్పాదనలు తీసుకోవచ్చు.
మాంసాహారం అమ్మాయిలు	4 - 8 ఏళ్ల వయసున్న వారు రోజుకు 3 ఔన్సులు (దాదాపు 85 గ్రాముల) మాంసాహారం తీసుకోవచ్చు. 9 - 18 ఏళ్ల వయసున్న వారు రోజుకు 5 ఔన్సులు (దాదాపు 141 గ్రాముల) మాంసాహారం తీసుకోవచ్చు.
అబ్బాయిలు	4 - 8 ఏళ్ల వయసున్న వారు రోజుకు 4 ఔన్సులు (దాదాపు 113 గ్రాముల) మాంసాహారం తీసుకోవచ్చు. 9 - 13 ఏళ్ల వయసున్న వారు రోజుకు 5 ఔన్సులు (దాదాపు 141 గ్రాముల) మాంసాహారం తీసుకోవచ్చు. 14 - 18 ఏళ్ల వయసున్న వారు రోజుకు 6 ఔన్సులు (దాదాపు 170 గ్రాముల) మాంసాహారం తీసుకోవచ్చు.

ఏయే ఆహారాలలో ఎన్నెన్ని క్యాలరీలు

- ఆరు అంగుళాల వ్యాసంతో ఉన్న రోటీలో దాదాపు 85 క్యాలరీలు ఉంటాయి. కొవ్వులు దాదాపు 0.5 గ్రాముల వరకు ఉంటాయి
- 150 గ్రాముల మినప్పప్పులో 154 క్యాలరీలు ఉంటాయి. కొవ్వులు 6 గ్రాముల వరకు ఉంటాయి
- 150 గ్రాముల శనగలు / రాజ్మా లో 153 క్యాలరీలు ఉంటాయి. కొవ్వులు 5 గ్రాముల వరకు ఉంటాయి
- 150 గ్రాముల మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ (కూరలో) 142 క్యాలరీలు ఉంటాయి. దాదాపు 15 గ్రాముల కొవ్వులు ఉంటాయి. (ఈ కొవ్వుల పాళ్లు కూర కోసం వాడిన నూనె పరిమాణం మీద ఆధారపడిఉంటాయి)
- 100 గ్రాముల చికెన్ కర్రీలో 300 క్యాలరీలు ఉంటాయి. ఇందులో 15-35 గ్రాముల కొవ్వుల వరకు ఉండవచ్చు. (ఇది స్కిన్‌తో ఉన్న చికెనా, స్కిన్‌లెస్‌నా, ఇక అందులో వాడిన నూనె ఎంత అనే అంశాల మీద ఆధారపడి ఉంటుంది)
- ఒక సాధారణ ప్లెయిన్ దోశ లో 125 క్యాలరీలు ఉంటాయి. దాదాపు 3 గ్రాముల కొవ్వు ఉంటుంది
- రెండు సాధారణ సైజ్ ఇడ్లీల్లో 132 క్యాలరీలు ఉంటాయి. దాదాపు 3 గ్రాముల కొవ్వు ఉంటుంది
- 100 గ్రాముల పెరుగన్నం (కర్డ్ రైస్)లో 190 క్యాలరీలు ఉంటాయి. కొవ్వులు దాదాపు 7 గ్రాముల ఉంటాయి
- 100 కోకోనట్ రైస్‌లో 369 క్యాలరీలు ఉంటాయి. దాదాపు 15 గ్రాముల కొవ్వు ఉంటుంది.

కంటి నిండా నిద్ర పోనివ్వండి

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుకోవాలని, ఈ వయసులోనే కష్టపడాలంటూ ఉదయం చాలా త్వరగా నిద్రలేపేస్తుంటారు. ఎదిగే వయసులోని ఏ పిల్లలైనా సరే... ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోయేలా చూడండి. ఆ నిద్రే లేకపోతే వారు చదివేదంతా మెదడులో సరిగా నిక్షిప్తం కాదు. మంచి నిద్ర సమయంలోనే చదివిందంతా పర్మనెంట్ మెమరీలోకి వెళ్తుందని గుర్తుంచుకోండి.

సుజాతా స్టీఫెన్,
చీఫ్ న్యూట్రిషనిస్ట్
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట, హైదరాబాద్



పరి పరిశోధన

కోడి గుడ్లూ మితంగానే..

అతి సర్వత్ర వర్జయేత్ అని సామెత. ఏదైనా అవసరానికి మించి చేస్తే ముప్పు తప్పదని దీనర్థం. కోడిగుడ్లు ఆరోగ్యానికి మంచివని మనం చాలా కాలంగా వింటున్నాం కదా.. అలాగని వీటిని ఎక్కువగా తింటే గుండెకు చేటు అంటున్నారు మసాచూసెట్స్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. అమెరికాలోని దాదాపు 30 వేల మందిని ఏకంగా 31 ఏళ్లపాటు పరిశీలించిన తరువాత తాము ఈ అంచనాకు వచ్చినట్లు కేథరీన్ టకర్ అనే శాస్త్రవేత్త తెలిపారు. జుకర్‌బర్గ్ కాలేజ్ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో పనిచేస్తున్న ఈ శాస్త్రవేత్త నిర్వహించిన అధ్యయనం ప్రకారం రోజుకు తినే గుడ్ల సంఖ్య ఎంత పెరిగితే ముప్పు కూడా అంతే పెరుగుతుంది. అధ్యయనంలో పాల్గొన్న వారి ఆహారపు నాణ్యత, వ్యాయామం చేసే అలవాట్లు వంటి వన్నీ పరిశీలించామని చెప్పారు. అమెరికాలో గుడ్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తమ అధ్యయనానికి ప్రాధాన్యం ఏర్పడిందని కేథరీన్ అంటున్నారు. 2017లో సగటున ఒక్కో అమెరికన్ 279 గుడ్లు తిన్నారని.. ఈ సంఖ్య 2012లో 254 మాత్రమేనని వివరించారు. ఒక్కో గుడ్డులో దాదాపు 200 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుందని.. రోజుకు 300 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ కొలెస్ట్రాల్ తీసుకుంటే గుండెజబ్బులు వచ్చే అవకాశం 17 శాతం ఎక్కువవుతుందని మరణం సంభవించే అవకాశం 18 శాతం ఉంటుందని కేథరిన్ వివరిస్తున్నారు. దీన్నిబట్టి రోజుకు మూడు గుడ్లతో కూడిన ఆమ్లెట్లను తినడం అంత మంచిది కాదని చెప్పారు.

* * *

ప్లాస్టిక్ చెత్త విరుగుడుకు కొత్త మార్గం...

మనిషికి ప్రియమైన శత్రువు ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసేందుకు ఇప్పటికే బోలెడన్ని మార్గాలు ఉన్నప్పటికీ.. అవి కొన్ని రకాలకు మాత్రమే పరిమితం. మనం నిత్యం వాడే క్యారీబ్యాగులు, పాలప్యాకెట్లు, నీటిబాటిళ్ల వంటి 'లో డెన్సిటీ పాలీ ఇథలీన్' (ఎల్‌డీపీ) ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడం కష్టపాధ్యం. అయితే వాషింగ్టన్ స్టేట్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించి ఎల్‌డీపీ ప్లాస్టిక్‌ను కాస్తా విమాన ఇంధనంగా మార్చే కొత్త టెక్నిక్‌ను ఆవిష్కరించారు. ఎల్‌డీపీ ప్లాస్టిక్స్‌ను వడ్లగింజలంత సైజుకు కత్తిరించి... కార్బన్ సమక్షంలో 430 నుంచి 571 డిగ్రీ సెల్సియస్ వరకూ వేడిచేస్తే ప్లాస్టిక్ నుంచి హైడ్రోజన్ వేరుపడుతుందని.. మిగిలిన పదార్థాన్ని విమాన ఇంధనంగా వాడుకోవచ్చునని వీరు ప్రయోగాత్మకంగా నిరూపించారు. దాదాపు ఏడు రకాల ఆక్టివేటెడ్ కార్బన్‌తో పరీక్షలు చేసి.. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి 85 శాతం విమాన ఇంధనం, 15 శాతం డీజిల్ వచ్చే పద్ధతిని వీరు సిద్ధం చేశారు. ఇందులో ఉత్ప్రేరకంగా వాడిన కార్బన్‌ను మళ్లీమళ్లీ వాడుకునేలా చేయవచ్చు. అంతేకాదు.. విమాన ఇంధనం, డీజిల్లను నేరుగా వేరు చేయవచ్చు. ఈ పద్ధతిని వాణిజ్య స్థాయిలో వాడుకునేందుకు ఏ ఇబ్బందీ లేదని... ఉప ఉత్పత్తులుగా అందుబాటులోకి వచ్చే వాయువుల నాణ్యత బాగా ఉండటం కారణంగా ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ఈ పరివోధనలకు నేతత్వం వహించిన శాస్త్రవేత్త ఈ తెలిపారు. పరిశోధనల వివరాలు అప్లైడ్ ఎనర్జీ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

వరుసగా అబార్షన్స్ అవుతున్నాయి... సంతానం కలుగుతుందా?

నా వయసు 32 ఏళ్లు. పెళ్లయి ఏడేళ్లు అవుతోంది. మూడుసార్లు గర్భం వచ్చింది. కానీ గర్భస్రావం అయ్యింది. డాక్టర్‌ను సంప్రదిస్తే అన్నీ నార్మల్‌గానే ఉన్నాయని అన్నారు. అయినా ఈ విధంగా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. హోమియో ద్వారా నాకు సంతాన ప్రాప్తి కలిగే అవకాశం ఉందా?
- ఒక సోదరి, ఖమ్మం

గర్భధారణ జరిగి అది నిలవనప్పుడు, ముఖ్యంగా తరచూ గర్భస్రావాలు అవుతున్నప్పుడు అది వారిని మానసికంగానూ కుంగదీస్తుంది. మరోసారి గర్భం ధరించినా అది నిలుస్తుందో, నిలవదో అన్న ఆందోళనను కలగజేస్తుంది. ఇలా రెండు లేదా మూడుసార్లు గర్భస్రావం అయితే దాన్ని 'రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్'గా పేర్కొంటారు.

కారణాలు: ఇలా గర్భస్రావాలు జరగడానికి చాలా కారణాలు ఉంటాయి. అందులో కొన్ని... ● గర్భాశయం అసాధారణంగా నిర్మితమై ఉండటం (రెండు గదుల గర్భాశయం) ● గర్భాశయంలో కణుతులు / పాలిప్స్ ఉండటం ● గర్భాశయపు సర్విక్స్ బలహీనంగా ఉండటం ● కొన్ని రకాల ఆటో ఇమ్యూన్ వ్యాధులు ● కొన్ని ఎండోక్రైన్ వ్యాధులు ● వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం ● రకరకాల ఇన్ఫెక్షన్లు రావడం వంటి ఎన్నో కారణాలు గర్భస్రావానికి దారితీస్తాయి. అయితే కొంతమందిలో ఎలాంటి కారణం లేకుండా కూడా గర్భస్రావాలు జరుగుతుండవచ్చు.

చికిత్స: రోగనిరోధకశక్తిని పెంపొందించడం, హార్మోన్ల అసమతౌల్యతను చక్కదిద్దడం వంటి చర్యల ద్వారా సంతాన లేమి సమస్యను పరిష్కరించవచ్చు. అలాగే గర్భస్రావానికి దారితీసే అనేక కరణాలు కనుగొని, వాటికి తగి చికిత్స అందించడంతో పాటు కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో మానసిక, శారీరక తత్వాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తే సంతాన సాఫల్యం కలుగుతుంది. అయితే అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో కారణాలతో పాటు వేర్వేరు అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైన ఔషధాలను వాడితే సంతానప్రాప్తి కలిగే అవకాశం ఉంది.

డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

మైగ్రేన్ తలనొప్పి... చికిత్స ఉందా?

నాకు విపరీతమైన తలనొప్పి వస్తోంది. వారంలో ఒకటి, రెండు సార్లు తీవ్రంగా వస్తోంది. ఎన్నో రక్తపరీక్షలు, ఎక్స్-రే, స్కానింగ్ పరీక్షలు చేయించాను. డాక్టర్లు దీన్ని మైగ్రేన్‌గా నిర్ధారణ చేశారు. జీవితాంతం వస్తుంటుందని చెప్పారు. హోమియోపతిలో దీనికి చికిత్స ఉందా?
- డి. రాము, కాకినాడ

తరచూ తలనొప్పి వస్తుంటే అశ్రద్ధ చేయకూడదు. నేటి ఆధునికయుగంలో శారీరక, మానసిక ఒత్తిడి, అనిశ్చితి, ఆందోళనలు తలనొప్పికి ముఖ్యమైన కారణాలు. ఇంకా రక్తపోటు, మెదడు కణుతులు, మెదడు రక్తనాళాల్లో రక్తప్రసరణల్లో మార్పులు, సైనసైటిస్ మొదలైన వాటివల్ల తలనొప్పి వచ్చేందుకు ఆస్కారం ఉంది. తలనొప్పి ఏ రకానికి చెందినదో నిర్ధారణ తర్వాత కచ్చితమైన చికిత్స చేయడం సులువవుతుంది. మైగ్రేన్ తలనొప్పిని పార్శ్వపు తలనొప్పి అంటారు. మానసిక ఆందోళన, ఒత్తిడి, జరిగిపోయిన విషయాల గురించి ఎక్కువగా ఆలోచించడం, డిప్రెషన్, నిద్రలేమి, అధికప్రయాణాలు, సూర్యరశ్మి, స్త్రీలలో హార్మోన్ సమస్యల వల్ల ఈ పార్శ్వపు తలనొప్పి వస్తుంటుంది. ఇది స్త్రీలలోనే ఎక్కువ.

మైగ్రేన్‌లో దశలూ, లక్షణాలు: సాధారణంగా మైగ్రేన్ వచ్చినప్పుడు 24 గంటల నుంచి 72 గంటలలోపు అదే తగ్గిపోతుంది. ఒకవేళ 72 గంటలకు పైనే ఉంటే దాన్ని స్టేటస్ మైగ్రేన్ అంటారు. దీంతో పాటు వాంతులు కావడం, వెలుతురునూ, శబ్దాలను అస్సలు భరించలేకపోవడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ: రక్తపరీక్షలు, రక్త పోటును పరీక్షించడం, సీటీస్కాన్, ఎంఆర్ఐ పరీక్షల ద్వారా మైగ్రేన్‌ను నిర్ధారణ చేయవచ్చు.

నివారణ: మైగ్రేన్ రావడానికి చాలా అంశాలు దోహదపడతాయి. ఉదాహరణకు మనం తినే ఆహారంలో మార్పులు, మనం ఆలోచించే విధానం, మానసిక ఒత్తిడి, వాతావరణ మార్పులు, నిద్రలేమి, మహిళల్లో రుతుసమస్యలు వంటి కారణాలతో వచ్చినప్పుడు జీవనశైలిలో మార్పులతో దీన్ని కొంతవరకు నివారించవచ్చు. ఇక మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు వ్యాయామం, యోగా, ప్రాణాయామ

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం
6-6-2019

ఉద్యోగ సమాచారం

బీహెచ్ఈఎల్‌లో 24 ఖాళీలు

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 24 ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పని ప్రదేశం:** హైదరాబాద్, బెంగళూరు, ఇండస్ట్రీస్ సెక్టార్-న్యూఢిల్లీ.
- **విభాగాలు:** సీనియర్ ఇంజనీర్, డిప్యూటీ మేనేజర్, సీనియర్ డీజీఎం.

- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 2019, జూన్ 1 నాటికి 32-48 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300+జీఎస్‌టీ.
- **దరఖాస్తులు ప్రారంభం:** జూన్ 10, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 25, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://careers.bhel.in

ఎన్‌వైకేఎస్‌లో 337 ఖాళీలు

కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని నెహ్రూ యువ కేంద్ర సంగఠన్ (ఎన్‌వైకేఎస్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 337 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:**
  అసిస్టెంట్ డైరెక్టర్/డిస్ట్రిక్ట్ యూత్ కో-ఆర్డినేటర్-160, జూనియర్ కంప్యూటర్ ప్రోగ్రామర్-17, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, అసిస్టెంట్-38, లైబ్రేరియన్-1, కంప్యూటర్ ఆపరేటర్-4, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్ (ఏసీటీఎస్)-58, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2-23, లోయర్ డివిజన్ క్లర్క్-12, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-23.
- **అర్హత:** పోస్టులను బట్టి పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట పని అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు చెందిన పురుష అభ్యర్థులకు రూ.700; మహిళా అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈఎస్ఎంలకు ఫీజు లేదు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://nyks.nic.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
❖ జనరల్ స్టడీస్ మెటీరియల్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

హయ్యర్ ఎడ్యుకేషన్

ఎంబీఏ, ఎంసీఏ.. ఉన్నత విద్యపరంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన కోర్సులు. తెలుగు రాష్ట్రాల్లో ఐసెట్ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరొచ్చు. ఇటీవల రెండు రాష్ట్రాల్లో ఐసెట్ ముగిసింది. ఏపీలో ఫలితాలు వెల్లడికాగా.. తెలంగాణలో త్వరలో ర్యాంకులు ప్రకటించే అవకాశముంది. ఐసెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు కోర్సు ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. ఏయే అంశాల ఆధారంగా కోర్సును ఎంచుకోవాలి! ఎంబీఏ, ఎంసీఏల్లో.. ఏది బెటర్?! ఏ కోర్సు ఎవరికి నప్పుతుంది.. దేనికి జాబ్ మార్కెట్లో ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయి.. ఇలాంటి ప్రశ్నలు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో జూన్/జూలైలో ఎంబీఏ/ఎంసీఏల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల స్వరూపం, అవసరమైన నైపుణ్యాలు, అందివచ్చే అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఎంబీఏ వర్సెస్ ఎంసీఏ

- తెలుగు రాష్ట్రాల్లో జూన్/జులైలో ఐసెట్ కౌన్సెలింగ్
- ఎంబీఏ, ఎంసీఏ.. కోర్సు ఎంపికపై దృష్టిసారించిన విద్యార్థులు
- ఆసక్తితోపాటు వ్యక్తిగతంగా నప్పే కోర్సులో చేరాలంటున్న నిపుణులు

ఎంబీఏ.. క్రేజీ కెరీర్

ఎంబీఏ.. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్. ఇది యువతను బాగా ఆకర్షిస్తున్న క్రేజీ కోర్సుల్లో ఒకటి. ఎంబీఏ కోర్సు లక్ష్యం.. కంపెనీల నిర్వహణకు అవసరమైన సమర్థ బిజినెస్ లీడర్లను తీర్చిదిద్దడం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో కీలక నిర్వహణ బాధ్యతలు చూస్తున్న బిజినెస్ మేనేజర్లు, సీఈవోల్లో ఎక్కువ మంది ఎంబీఏలే. అంతేకాకుండా యువత ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారడానికి కూడా ఎంబీఏ దోహదపడుతుంది. మార్కెటింగ్, హెచ్ఆర్, ఫైనాన్స్ తదితర ఎన్నో అంశాలపై ఎంబీఏ విద్యార్థులకు అవగాహన లభిస్తుంది. ఇది కంపెనీల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎవరికి అనుకూలం

ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు ఎంబీఏలో చేరొచ్చు. మేనేజ్‌మెంట్ రంగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు తమలో ఉన్నాయని గట్టిగా నమ్మే విద్యార్థులే ఎంబీఏలో చేరడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, టీం మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు, బిజినెస్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ఎంబీఏ చక్కగా సరిపోతుంది. దానికి తోడు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే నేర్పు, నిర్వహణ సామర్థ్యం, ప్రణాళిక ప్రకారం వ్యవహరించడం, భవిష్యత్ పరిణామాలను అంచనా వేయగలగడం, బృందం పని తీరును మెరుగుపరచేలా మోటివేట్ చేయడం, సమన్వయంతో వ్యవహరించడం, సమస్య వచ్చినప్పుడు కారణాలు అన్వేషించడం వంటి నైపుణ్యాలున్నవారు ఎంబీఏను ఎంపిక చేసుకోవచ్చు. వీటితోపాటు ఎలాంటి అంశాన్నయినా లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయగలిగే అభ్యర్థులకు ఎంబీఏ చక్కగా సరిపోయే కోర్సన్నది నిపుణుల మాట.

సిలబస్‌లో మార్పులు

ఎంబీఏ కోర్సు వ్యవధి రెండేళ్లు. యూనివర్సిటీలు ప్రస్తుత జాబ్‌మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను రూపొందిస్తున్నాయి. ఎప్పటికప్పుడు సిలబస్‌లో మార్పులుచేర్పులూ చేస్తున్నాయి. సెమిస్టర్ పద్ధతిలో నిర్వహించే ఎంబీఏ కోర్సులో

మొదటి సంవత్సరం సబ్జెక్టులు కామన్‌గా ఉంటాయి. సబ్జెక్టుల వారీగా చూసుకుంటే.. మేనేజ్‌మెంట్ అండ్ ఆర్గనైజేషనల్ బిహేవియర్, బిజినెస్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలసిస్, బిజినెస్ స్టాటిస్టిక్స్, బిజినెస్ లా అండ్ ఎథిక్స్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, మేనేజీరియల్ ఎకనామిక్స్, అకౌంటింగ్ ఫర్ మేనేజర్స్, బిజినెస్ ఎన్విరాన్‌మెంట్, క్వాంటిటేటివ్ అనాలసిస్ ఫర్ బిజినెస్ డెసిషన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి సబ్జెక్టులు మొదటి ఏడాదిలో ఉంటాయి. రెండో సంవత్సరంలో విద్యార్థులు ఎంచుకునే స్పెషలైజేషన్ ఆధారంగా సబ్జెక్టులు ఉంటాయి. మూడు, నాలుగో సెమిస్టర్‌లలో ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్‌ల తోపాటు ఐటీ, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ తదితర స్పెషలైజేషన్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తికి తగ్గ స్పెషలైజేషన్

విద్యార్థులు స్వీయ ఆసక్తులు, అభిరుచి, పరిజ్ఞానం ఆధారంగా ఏదో ఒక స్పెషలైజేషన్‌ను ఎంచుకోవచ్చు. స్పెషలైజేషన్ సబ్జెక్టులకు మాత్రమే పరిమితం కాకుండా.. అన్ని సబ్జెక్టులను సమప్రాధాన్యంతో చదవడం అలవర్చుకోవాలి. ఎందుకంటే... బిజినెస్‌పరంగా చూసుకుంటే సబ్జెక్టులు అన్నీ ఒకదానికి ఒకటి ఇంటర్‌లింక్‌గా ఉంటాయి. హెచ్ఆర్ మేనేజర్‌గా చేరే అభ్యర్థి సంస్థలో అన్ని విభాగాల వారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి వీరికి అకౌంట్స్, ఫైనాన్స్, మార్కెటింగ్‌లపై కూడా అవగాహన ఉండాలి. కోర్సులో భాగంగా కంప్యూటర్ తదితర ల్యాబ్స్, మినీ ప్రాజెక్టులు, సెమినార్లు, వైవా వంటి ఉంటాయి.

నిరంతర అధ్యయనం

ఎంబీఏ కోర్సులో రాణించాలంటే నిరంతర అధ్యయనం సాగించాలి. సంబంధిత అంశాలపై కేస్ స్టడీలను పరిశీలించాలి. జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలి. ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కాలేజీలో చేరిన రోజు నుంచే కృషి చేయాలి. ఎంచుకున్న స్పెషలైజేషన్‌లో మరింత 'స్పెషలైజ్డ్' నాలెడ్జ్ కోసం ఆ విభాగంలో తాజా పరిణామాలను నిరంతరం అధ్యయనం చేయాలి. సంబంధిత జర్నల్స్‌ను చదవాలి. ప్రాజెక్ట్ వర్క్‌కు అత్యంత ప్రాధాన్యమిచ్చి సొంతంగా చేయాలి.

చొరవతోనే రాణింపు

ఎంబీఏతో కార్పొరేట్ రంగంలో ఎదిగేందుకు చొరవ ముఖ్యం. కాబట్టి కోర్సులో చేరినప్పటి నుంచే చొరవను ప్రదర్శించడం అలవాటు చేసుకోవాలి. అన్ని రకాల బాధ్యతల స్వీకరణకు సిద్ధపడేతత్వం, చొరవగా వ్యవహరించడం, వివిధ రకాల వ్యక్తులతో చాకచక్యంగా మసలుకోవడం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా పనిచేసే గుణం, ప్రభావవంతమైన కమ్యూనికేషన్ స్కిల్స్, జట్టుగా పనిచేసే సామర్థ్యం, అవసరమైనప్పుడు బాధ్యతలు తీసుకునే నేర్పు, సాధించాలన్న తపన, కష్టపడే తత్వం వంటి లక్షణాలను పెంపొందించుకోవాలి. సమస్యలు ఎదురైనా స్థిరంగా నిలబడేతత్వాన్ని అలవాటు చేసుకోవాలి.

సాఫ్ట్‌స్కిల్స్‌తో ముందంజ

ఏటా వేల మంది ఎంబీఏ పట్టాతో బయటకొస్తున్నారు. కానీ, ఉద్యోగాలు లభిస్తున్నది మాత్రం కొంత మందికే! అసోచామ్, ఫిక్కీ, నాస్కామ్ వంటి సంస్థల అంచనాల ప్రకారం ఎంబీఏల్లో పరిశ్రమ అవసరాలకు సరిపడ నైపుణ్యాలున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. కాబట్టి ఎంబీఏలో చేరే విద్యార్థులు సిలబస్ పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా.. అదనపు నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిపెట్టాలి. సాప్, ఈ-కామర్స్, ట్యాక్సేషన్ వంటి అదనపు కోర్సులను చేయొచ్చు. ఎంబీఏ అభ్యర్థులకు బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, అగ్రికల్చర్, ఫార్మా, హెల్త్‌కేర్, ఇన్సూరెన్స్, ఎఫ్ఎంసీజీ వంటి రంగాల్లో వివిధ హోదాల్లో అవకాశాలు లభిస్తాయి.

ఐటీకి మరోదారి ఎంసీఏ

ఇంజనీరింగ్‌కు దీటైన కోర్సుగా మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ)కు పేరుంది. బీఎస్సీ మ్యాథ్స్ వంటి సైన్స్ డిగ్రీ తర్వాత ఐటీ రంగంలో ప్రవేశించాలనుకునే విద్యార్థులకు ఎంసీఏ చక్కటి మార్గమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మ్యాథమెటిక్స్, సైన్స్ పట్ల ఆసక్తి, ప్రాక్టికల్ ఓరియెంటేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలుంటే.. ఎంసీఏను ఎంపిక చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. గణితంలో ప్రావీణ్యం, అనలిటికల్ స్కిల్స్ ఉన్నవారికి ఎంసీఏ కోర్సు సరిగ్గా సరిపోతుందని చెప్పొచ్చు.

సాఫ్ట్‌వేర్‌లో కొలువులు

ఎంసీఏ విద్యార్థులకు ప్రధానంగా ఉపాధి కల్పించే రంగం.. సాఫ్ట్‌వేర్. ఈ రంగంలో టెక్నాలజీతో పూర్తికాలం పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి టెక్నాలజీపరంగా నూతనంగా వస్తున్న ఆవిష్కరణలు, కంప్యూటర్ లాంగ్వేజెస్ గురించి నిత్యం అప్‌డేట్‌గా ఉండాలి. ఏదైనా విషయాన్ని వేగంగా అవగాహన చేసుకునే నేర్పు, విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయగలిగే లక్షణాలున్న విద్యార్థులు ఎంసీఏను ఎంచుకోవచ్చు. ప్రస్తుతం జాబ్ మార్కెట్లో.. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, బృంద నిర్వహణ, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ఇంటరాక్షన్ వంటివి కూడా అవసరమవుతున్నాయి. అంతేకాకుండా ఎంసీఏలో చేరాలనుకునే విద్యార్థులు నూతన టెక్నాలజీని సొంతంగా నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

ఐటీకి సరితూగే సిలబస్

ఎంసీఏ కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో సంబంధిత సబ్జెక్టులతోపాటు ప్రాజెక్టు వర్క్ కూడా ఉంటుంది. ఎంసీఏ సిలబస్‌లో ఐటీ రంగంలోని అన్ని విభాగాలపై అవగాహన కలిగించేలా బేసిక్స్‌పై బోధనతోపాటు మ్యాథమెటిక్స్ కూడా ఉంటుంది.

డేటాస్ట్రక్చర్స్, ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్, డేటాకమ్యూనికేషన్ అండ్ నెట్‌వర్కింగ్, ఆపరేటింగ్ సిస్టమ్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ అల్గారిథమ్స్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, వెబ్ ప్రోగ్రామింగ్, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ ఆర్గనైజేషన్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆపరేటింగ్ సిస్టమ్స్, జావా వంటి సబ్జెక్టులను పొందుపరచారు. ఇటీవల ట్రెండింగ్ కోర్సులుగా నిలుస్తున్న పైథాన్, మెషిన్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డేటా మైనింగ్, బిగ్ డేటా, ఎథికల్ హ్యాకింగ్ సబ్జెక్టులను కూడా ఎంసీఏ కోర్సులో భాగంగా బోధిస్తున్నారు.

ప్రోగ్రామింగ్.. ప్రాక్టీస్

ఎంసీఏలో చేరిన నాటినుంచే ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవడానికి ప్రయత్నించాలి. మొదటి సంవత్సరం సబ్జెక్టులపై బాగా పట్టు సాధిస్తే.. ఆ తర్వాతి ఏడాది వచ్చే పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఎంసీఏలో చదివే సబ్జెక్టులు కెరీర్‌లో అడుగడుగునా ఉపయోగపడతాయి. ఇంటర్వ్యూల్లో ఎదురయ్యే ప్రశ్నలు సైతం ఆయా సబ్జెక్టుల ప్రాథమిక అంశాల నుంచే ఉంటాయనే విషయాన్ని గుర్తించుకోవాలి. అలాగే ప్రోగ్రామింగ్ పరంగా విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా అంశాలకు సంబంధించి థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ సొంతం చేసుకోవాలి. పరీక్షలో పాసైతే సరిపోతుంది అనే దృక్పథం ఎంసీఏ విద్యార్థులకు అస్సలు పనికిరాదు. సాఫ్ట్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలను, పరిశోధనలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

బీటెక్ అభ్యర్థులతో పోటీ

ఎంసీఏ అభ్యర్థులు జాబ్ మార్కెట్లో బీటెక్ ఉత్తీర్ణులతో పోటీపడాల్సి ఉంటుంది. కాబట్టి తదనుగుణంగా కోర్సులో చేరిన మొదటిరోజు నుంచే అకడెమిక్స్‌తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగుపరచుకునేందుకు కృషిచేయాలి. సెల్ఫ్ లెర్నింగ్, ప్రాక్టికల్ ఓరియెంటేషన్‌కు ప్రాధాన్యతనివ్వాలి. కెరీర్ పరంగా ప్రాజెక్ట్ వర్క్ చాలా కీలకం. కాబట్టి ఫేక్ ప్రాజెక్ట్ వర్క్ కాకుండా.. ఏదైనా కంపెనీలో సొంతంగా ప్రాజెక్ట్స్ చేయాలి. ఫలితంగా రియల్ టైమ్ ఎన్విరాన్‌మెంట్ తెలుస్తుంది. తాజాగా డేటాసైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), బ్లాక్ చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్ టెక్నాలజీపరంగా ముందువరుసలో నిలుస్తున్నాయి. వీటిని మూక్స్ ద్వారా నేర్చుకునే వెసులుబాటు ఉంది.

అదనంగా సర్టిఫికేషన్

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా జావా, పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్, బిగ్‌డేటా, డేటా మైనింగ్, ఒరాకిల్, సేల్స్‌ఫోర్స్, ఇతర క్లౌడ్ టెక్నాలజీలు, ఈఆర్‌పీ టెక్నాలజీలు, సైబర్ సెక్యూరిటీ, వెబ్ డెవలప్‌మెంట్, ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్, ఐఫోన్ మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, యూఐ టెక్నాలజీలు వంటి కోర్సులు చేయడం లాభిస్తుంది. ఎంసీఏలో చేరిన నాటి నుంచే సాఫ్ట్‌స్కిల్స్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ప్రయత్నించాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తమ భావవ్యక్తీకరణ నైపుణ్యాలను, ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవాలి. కాలేజీ ఎంపికలో నేర్పుగా వ్యవహరించాలి. బోధనా సిబ్బంది, వసతులు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను పరిశీలించి కళాశాలను ఎంపిక చేసుకోవాలి.

జాబ్ ఇన్‌ఫో

ఏఎఫ్‌క్యాట్..

వాయుసేనలో ఆఫీసర్ కొలువుకు మార్గం

- ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నతస్థాయి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
- ఎంపికైతే ప్రారంభంలోనే రూ.56వేలకు పైగా అందుకోవచ్చు

ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ ఆన్‌లైన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్).. భారత వాయుసేనలో ఆఫీసర్ కొలువులను అందించే పరీక్ష! ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఏటా ఫిబ్రవరి, ఆగస్టుల్లో ఏఎఫ్‌క్యాట్ నిర్వహిస్తోంది. తాజాగా ఏఎఫ్‌క్యాట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపడం ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లోని ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) బ్రాంచ్‌ల్లో కొలువు సొంతం చేసుకోవచ్చు. దీంతోపాటు అర్హులైన అభ్యర్థులు ఎన్‌సీసీ ఎంట్రీ స్కీమ్ ద్వారా ఫ్లయింగ్ బ్రాంచ్‌లో.. మెటియోరాలజీ ఎంట్రీ ద్వారా మెటియోరాలజీ బ్రాంచ్‌లో ఉద్యోగాలు పొందొచ్చు. ఏఎఫ్‌క్యాట్‌కు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ ఉద్యోగాల గురించి తెలుసుకుందాం...

పర్మనెంట్ కమిషన్ (పీసీ)

పర్మనెంట్ కమిషన్ ఆఫీసర్‌గా చేరిన అభ్యర్థులు సదరు బ్రాంచ్‌లో ర్యాంకుల ఆధారంగా పదవీ విరమణ వరకు కొనసాగే అవకాశం ఉంటుంది.

షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), పురుషులు/మహిళలు

ఫ్లయింగ్ బ్రాంచ్(పురుషులు/మహిళలు)కు ఎంపికైన వారి సర్వీసు కాలం..సర్వీసు(కమిషన్)లో చేరిన తేదీ నుంచి 14 ఏళ్లు. కాగా, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్, నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు ఎంపికైన ఉద్యోగుల ప్రాథమిక సర్వీసు కాలం పదేళ్లు. అవసరాన్ని బట్టి గ్రౌండ్ డ్యూటీ అధికారుల సర్వీసు కాలాన్ని నాలుగేళ్లపాటు పొడిగించే అవకాశముంది.

విద్యార్హతలు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి/60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్):** ఇంటర్, ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు తప్పనిసరి.
- **గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్):**
  - **అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 60 శాతం మార్కులతో మూడేళ్ల డిగ్రీ.
  - **అకౌంట్స్:** 60 శాతం మార్కులతో బీకామ్ లేదా తత్సమాన అర్హత.
  - **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ(ఫ్లయింగ్ బ్యాచ్):** 2017, జనవరి 1 నాటికి ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉండాలి. దీంతోపాటు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

వయోపరిమితి

ఏఎఫ్‌క్యాట్ అండ్ ఎన్‌సీసీ(ఫ్లయింగ్ బ్రాంచ్): 2020, జూలై1 నాటికి 20 ఏళ్ల నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందిన వారి గరిష్ట వయోపరిమితి 26 ఏళ్లు.

- **గ్రౌండ్ డ్యూటీ/నాన్ టెక్నికల్ బ్రాంచ్‌లు:** 2020, జూలై 1 నాటికి 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- కోర్సు ప్రారంభం నాటికి 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారిలో అవివాహితులు మాత్రమే అర్హులు. అలాగే 25 ఏళ్లలోపు ఉన్న వితంతు, విడాకులు పొందిన మహిళలు/పురుషులు సైతం అనర్హులు.

ఎంపిక విధానం

తొలిదశలో ఆన్‌లైన్ పరీక్ష(స్క్రీనింగ్ టెస్టు) జరుగుతుంది. ఇందులో ప్రతిభచూపిన అభ్యర్థులకు డెహ్రాడూన్, వారణాసి, గాంధీనగర్‌ల్లోని ఏదైనా ఓ ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డు నుంచి కాల్ లెటర్ అందుతుంది. ఆయా సెలక్షన్ బోర్డులు ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్టు, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్కషన్ టెస్టులు నిర్వహించి..వాటిలో ప్రతిభ చూపిన వారిని తర్వాత దశకు ఎంపిక చేస్తాయి. అనంతరం ఆయా అభ్యర్థులకు సైకలాజికల్ టెస్టు, ఫ్లయింగ్ బ్రాంచ్‌కు ఎంపికైన వారికి కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) టెస్టు వంటివి నిర్వహించి.. అర్హులను మెడికల్ టెస్టుకు సిఫార్సు చేస్తారు. తుదిదశలో రిటెన్ టెస్టు, మెడికల్ టెస్టు(ఫిట్‌నెస్) ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు.

శిక్షణ

ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జూలై మొదటి వారంలో శిక్షణ ప్రారంభమవుతుంది. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్) బ్రాంచ్‌ల వారికి 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచ్‌ల వారికి 54 వారాలు శిక్షణ ఉంటుంది.

స్పెషలైజేషన్లు

కమ్యూనికేషన్/కంప్యూటర్ లేదా టెక్నాలజీ/కంప్యూటర్ అండ్ అప్లికేషన్/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్/ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్.

ఏరోనాటికల్ ఇంజనీర్ (మెకానికల్)

ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

- **స్పెషలైజేషన్లు:** ఏరోస్పేస్/ఏరోనాటికల్/ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్/మెకానికల్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మె